www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 24-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 310

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి సా. 6.01 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మఖ రా. 10.21 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.8.53-10.41; దుర్ముహూర్తం: ఉ.6.41-8.14; అమృతఘడియలు: రా.7.39-9.27; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.17

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రుణగ్రహీతల చరిత్ర చెప్పే పోర్టల్

న్యూఢిల్లీ: బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి పూర్వచరిత్రను, వారిపై ఏవైనా మొండి బకాయిలున్నాయా అనే విషయాన్ని తనిఖీ చేసేందుకు కేంద్ర ఆర్థిక గూఢచర్య బ్యూరో (సీఈఐబీ) శుక్రవారం ఒక పోర్టల్‌ను ప్రారంభించింది. ఇది బ్యాంకులు రుణాలు మంజూరు చేయడానికి ముందుగా నిర్వహించే నిఘా క్లియరెన్స్ విధానాన్ని సరళం చేస్తుంది. కేంద్ర ఆర్థిక సర్వీసుల శాఖ నిబంధనల ప్రకారం కొత్త వారికి రూ.50 కోట్లు, ఆ పైబడిన రుణాలు మంజూరు చేయడానికి ముందు బ్యాంకులు వారి గురించి సీఈఐబీ నివేదిక తీసుకోవాల్సి ఉంటుంది.

వచ్చే మూడేళ్లలో థెర్మాక్స్ ఏటా రూ.1,000 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ థెర్మాక్స్ వచ్చే మూడేళ్ల కాలంలో ఏటా రూ.500 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ రీడిస్కవర్ పేరుతో నిర్వహిస్తున్న రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంగా థెర్మాక్స్ ఎండీ, సీఈఓ ఆశిష్ భండారీ మాట్లాడుతూ.. ఉత్పత్తి సామర్థ్యం పెంపు సహా ఇతరత్రా అవసరాల కోసం ఈ పెట్టుబడులను ఉపయోగించనున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.10,000 కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కంపెనీ ఏటా 20 నుంచి 25 శాతం వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. ప్రస్తుతం కంపెనీ ఫార్మా, ఎఫ్ఎంసీజీతో పాటు 14 వర్టికల్స్‌కు అవసరమైన ఉత్పత్తులను అందిస్తోందని తెలిపారు. కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీతో పాటు మొత్తం 9 ప్లాంట్లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

విదేశీ విమానాశ్రయాలపై జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నజర్



గ్రీస్ ప్రధానితో జీఎం రావు భేటీ

ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న గ్రీస్ ప్రధాని కిరియాస్కో విట్సోటాకిస్ శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయాన్ని సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జీఎం రావు, జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ బిజినెస్ చైర్మన్ బొమ్మిడాల శ్రీనివాస్, తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఏఓసీసీ)ని సందర్శించిన ఆయన విమానాశ్రయ నిర్మాణ శైలిని ప్రశంసించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు ప్రపంచ దేశాలకు, భారత దేశానికి ద్వారం లాంటిదని పేర్కొన్నారు.

హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. దేశ,విదేశాల్లో తన వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టింది. విదేశీ విస్తరణలో భాగంగా పశ్చిమాసియా, దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ దేశాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణ లేదా పాత విమానాశ్రయాల ఆధునికీకరణ, నిర్వహణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ నిర్వహించిన ఎనలిస్టుల సదస్సులో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నతాధికారులు ఈ విషయం వెల్లడించారు. ఆయా దేశాల రెగ్యులేషన్లపై పూర్తి అవగాహన ఉన్న స్థానిక కంపెనీలతో కలిసి ఈ ప్రాజెక్టులు చేపడతామని వారు తెలిపారు.

ఇప్పటికే రెండు ప్రాజెక్టులు: జీఎంఆర్ గ్రూప్ ఇప్పటికే ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దేశాల్లో రెండు విమానాశ్రయాలు నిర్వహిస్తోంది. కొత్తగా గ్రీస్ ప్రధాని కిరియాస్కో మిట్సోటాకిస్ సొంత పట్టణం క్రీట్‌లో.. అతి పెద్ద విమానాశ్రయం నిర్మిస్తోంది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా ఎయిర్‌పోర్టు ఆధునీకరణ, విస్తరణ, నిర్వహణ కోసం కూడా బిడ్ దాఖలు చేసింది.

స్వదేశంలో: భారత్‌లోనూ ప్రైవేటీకరించే విమానాశ్రయాల కోసం పోటీపడాలని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భావిస్తోంది. అయితే ఏటా కనీసం 50 లక్షల మంది విమాన ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయాలపై మాత్రమే తమకు ఆసక్తి ఉందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అధికారులు ఈ సదస్సులో చెప్పారు. జీఎంఆర్ గ్రూప్ ఇప్పటికే ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటికి తోడు ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వద్ద కొత్త విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. అలాగే గోవా, ఢిల్లీ విమానాశ్రయాల సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది.

పేటీఎం యూపీఐ హ్యాండిల్ యూజర్లను ఇతర బ్యాంకులకు బదిలీ చేయండి..

'ఎన్‌పీసీఐ'కి ఆర్‌బీఐ సూచన

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) సేవలను ఉపయోగించుకుంటున్న కస్టమర్లు, వాలెట్ హోల్డర్లు, వర్తకుల ప్రయోజనార్థం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం అదనపు చర్యలు చేపట్టింది. '@ పేటీఎం' యూపీఐ హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న పీపీబీఎల్ కస్టమర్లను ఇతర బ్యాంకులకు బదిలీ చేసే అవకాశాలను పరిశీలించాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ను ఆర్‌బీఐ కోరింది. వీరిని ఒకే బ్యాంక్‌కు కాకుండా 4-5 బ్యాంకులకు బదిలీ చేయాలని సూచించింది. ఈ ఏడాది మార్చి 15 నుంచి పీపీబీఎల్ ఖాతాదారులు, వాలెట్ హోల్డర్లు, మర్చంట్ కస్టమర్ల ఖాతాల్లో డిపాజిట్లు, క్రెడిట్‌పై నిషేధం అమలులోకి రానున్న విషయం తెలిసిందే. పీపీబీఎల్ వెబ్‌సైట్ డేటా ప్రకారం.. బ్యాంక్ నిర్వహణలో 30 కోట్ల వాలెట్లు, 3 కోట్ల బ్యాంక్ ఖాతాలున్నాయి. పేటీఎం యాప్‌లో యూపీఐ కార్యకలాపాలను కొనసాగించేందుకు తమ సంస్థ థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ) ఫర్ యూపీఐగా మారేందుకు అనుమతించాలన్న వన్97 కమ్యూనికేషన్ లిమిటెడ్ (ఓసీఎల్) అభ్యర్థనను పరిశీలించాలని కూడా ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచించింది. పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ అయిన ఓసీఎల్.. పీపీబీఎల్‌లో 49 శాతం వాటా కలిగి ఉంది. ఒకవేళ ఓసీఎల్‌కు టీపీఏపీ హోదాను మంజూరు చేసిన సందర్భంలో 'ఎట్ పేటీఎం' యూపీఐ హ్యాండిల్ వినియోగదారులను ఎలాంటి అవాంతరం లేకుండా పీపీబీఎల్ నుంచి కొత్తగా ఎంపిక చేసిన బ్యాంకులకు బదిలీకి నిర్దేశించవచ్చని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత యూజర్లను కొత్త యూపీఐ హ్యాండిల్స్‌కు బదిలీ చేసేవరకు ఈ టీపీఏపీ కొత్త కస్టమర్లను చేర్చుకోరాదని నిర్దేశించింది. అలాగే, పేటీఎం క్యూఆర్ కోడ్‌ను వినియోగిస్తున్న వర్తకుల కోసం ఓసీఎల్ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పీఎస్‌బీ బ్యాంకులతో సెటిల్మెంట్ అకౌంట్లను ప్రారంభించవచ్చని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పీపీబీఎల్ జారీ చేసిన ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్స్ (ఎన్‌సీఎంసీ) హోల్డర్లు మార్చి 15 లోగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

ప్రజా రవాణా చెల్లింపుల్లో మరింత సౌలభ్యం

పీపీఐల జారీకి బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ కంపెనీలకు అనుమతి

ప్రజా రవాణా వ్యవస్థల్లో చెల్లింపులు చేపట్టగలిగే ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) జారీకి బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ కంపెనీలకు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. తద్వారా ప్రయాణికులకు టికెట్ కొనుగోలు చేసేందుకు నగదుతో పాటు మరిన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వస్తాయని.. మరింత సౌలభ్యంగా, వేగంగా, భద్రంగా చెల్లింపులు జరిపే వీలుంటుందని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది.

బైజూస్ నుంచి రవీంద్రన్ ఔట్

ఆయన కుటుంబ సభ్యులు కూడా

తీర్మానించిన వాటాదారుల ఈజీఎం

న్యూఢిల్లీ: ఎడ్యుకేషన్ స్టార్టప్ బైజూస్‌పై ఆ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ బైజు రవీంద్రన్, ఆయన కుటుంబ పెత్తనానికి తెరపడింది. శుక్రవారం జరిగిన కంపెనీ వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) వారిని డైరెక్టర్ల బోర్డు నుంచి తొలగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. కంపెనీ అస్తవ్యస్థ నిర్వహణకు రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులే కారణమైనందున ఈ చర్య తీసుకున్నట్టు వాటాదారులు తెలిపారు. బోర్డు సభ్యులైన రవీంద్రన్, ఆయన భార్య, సోదరుడు ఈ ఈజీఎంకు హాజరు కాలేదు. రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యుల తొలగింపుతో పాటు కొత్త బోర్డు ఏర్పాటు కోసమూ ఈజీఎం తీర్మానం చేసింది. వీటికి తోడు బైజూస్ కొనుగోలు చేసిన కంపెనీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కూడా తీర్మానించింది.

చెల్లదంటున్నా..: బైజూస్ మాతృసంస్థ థింక్ అండ్ లెర్న్ ఈక్విటీలో 32 శాతానికిపైగా వాటా ఉన్న ఆరు ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఈ ఈజీఎంకు పిలుపు ఇచ్చాయి. ఈ ఈజీఎం చెల్లదని ప్రకటించాలని రవీంద్రన్ చేసిన విజ్ఞప్తిని కర్ణాటక హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. దీంతో వీరంతా శుక్రవారం ఈజీఎం నిర్వహించి రవీంద్రన్, ఆయన భార్య, సోదరుడిని బోర్డు నుంచి తొలగిస్తున్నట్టు తీర్మానించారు. ఈ సమావేశంగానీ, ఈ సమావేశం చేసే తీర్మానాలుగానీ చెల్లవని రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులు హెచ్చరించినా.. వాటాదారులు ఈజీఎం నిర్వహించి మరీ వారిని బోర్డు నుంచి తొలగించడం విశేషం.

హైకోర్టు నిర్ణయమే తరువాయి: మరోవైపు కర్ణాటక హైకోర్టు మార్చి 13న ఈ కేసుపై విచారణ జరపనుంది. అప్పటి వరకు ఈ తీర్మానాల అమలు పక్కన పెట్టాలని హైకోర్టు కోరింది. దీంతో మార్చి 13న హైకోర్టు ఏ నిర్ణయం ప్రకటిస్తుందోనని సర్వత్రా ఆసక్తి వ్యక్తం అవుతోంది.

స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం

యూకో బ్యాంక్ 'ఆరంభ్'



హైదరాబాద్: స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తోడ్పాటునందించేందుకు గాను యూకో బ్యాంక్.. ఆరంభ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, బయోనెస్ట్‌లో ఉన్న ఐకేపీ నాలెడ్జ్ పార్క్ భాగస్వామ్యంతో యూకో బ్యాంక్ దీన్ని నిర్వహించింది. స్టార్టప్స్, ఆర్థిక సంస్థల మధ్య ఉన్న అంతరాలను పూడ్చటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని యూకో బ్యాంక్ ఎంఎస్ఎంఈ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ ప్రేమ్ శంకర్ ఝా, బ్యాంక్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎన్ శ్రీకాంత్ వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలను బ్యాంక్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథం, ఆస్పైర్ బయోనెస్ట్ సీఓఓ అనిల్ కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి

సెన్సెక్స్ 15 పాయింట్లు డౌన్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో ప్రామాణిక సూచీలు ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో ఆరంభ లాభాలు ఆవిరై చివరికి అతిస్వల్ప నష్టాల్లో ముగిశాయి. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 15.44 పాయింట్ల నష్టంతో 73,142.80 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 4.75 పాయింట్ల తగ్గుదలతో 22,212.70 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో మాత్రం సూచీ 22,297.50 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. హెచ్‌సీఎల్ టెక్ 1.25 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం వరుసగా 0.25 శాతం, 0.53 శాతం మేర పెరిగాయి.

- ఈ నెల 9తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 524 కోట్ల డాలర్ల మేర తగ్గి 61,723 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ తెలిపింది.

జియో ఫైనాన్షియల్ @ రూ.2 లక్షల కోట్లు

మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక సేవల అనుబంధ విభాగమైన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.2 లక్షల కోట్లు దాటింది. బీఎస్ఈలో జేఎఫ్ఎస్ఎల్ షేరు ఇంట్రాడేలో 14.5 శాతం వృద్ధితో రూ.347 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం రూ.27,922 కోట్ల పెరుగుదలతో రూ.2,20,459 కోట్లకు చేరుకుంది. ఎక్స్ఛేంజీలో ట్రేడింగ్ నిలిచేసరికి, కంపెనీ షేరు ధర 10.62 శాతం లాభంతో రూ.335 వద్ద ముగిసింది. దాంతో సంస్థ మార్కెట్ క్యాప్ రూ.2.12 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, ఆర్ఐఎల్ షేరు కూడా ఒక శాతానికి పైగా పెరిగి రూ.2,996.15 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 0.78 శాతం లాభంతో రూ.2,986.35 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20.20 లక్షల కోట్లుగా నమోదైంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,730 ▲	57,600 ▲	76,000 ▼
ముంబై	62,008 ▼	56,799 ▼	69,653 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ		విజయవాడ	515
హైదరాబాద్	520	విశాఖపట్నం	525
24వ తేదీ		వరంగల్	522
చిత్తూరు	588		
గోదావరి	515	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

స్పోర్ట్స



జట్ల కెప్టెన్లతో షారుక్ చిందులు

ఉల్లాసంగా ఉత్సాహంగా..

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. తనదైన స్టైల్లో అందరికీ స్వాగతం పలికిన షారుక్.. వేదికపై ఐదు జట్ల కెప్టెన్లతో డ్యాన్స్ చేయించాడు. ఆ తర్వాత పలు పాటలకు స్టెప్పులేశాడు. షారుక్‌తోపాటు నటులు షాహిద్ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్, కార్తీక్ ఆర్యన్, టైగర్ ష్రాఫ్ కూడా తమదైన నృత్యాలతో అలరించారు.

ధీరజ్‌కు మూడో పతకం ఖాయం



బాగ్దాద్: ఆసియా ఆర్చరీ కప్ లెగ్-1 పోటీల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో తెలుగు ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఫైనల్ చేరి మూడో పతకం ఖాయం చేసుకున్నాడు. అతడు ఇప్పటికే టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్లలో ఫైనల్ చేరిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత విభాగం రికర్వ్ సెమీఫైనల్లో ధీరజ్ 7-1తో అమీర్‌ఖాన్ సడికోవ్ (ఉజ్బెకిస్థాన్) చిత్తుచేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన వెటరన్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల కాంపౌండ్ సెమీస్‌లో భారత ఆర్చర్ పర్నీత్ కౌర్ 148-147తో సహచర ఆర్చర్ అదితి గోపీచంద్‌ను ఓడించి ఫైనల్ చేరింది.

ఆఖరి బంతికి సిక్సర్

ముంబై సూపర్

హర్మన్, యాస్తిక అర్ధ శతకాలు

తొలి మ్యాచ్‌లో ఢిల్లీ ఓటమి



హర్మన్‌ప్రీత్ (55) యాస్తిక (57)

బెంగళూరు: ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సజన (6 నాటౌట్) ఆఖరి బంతికి సిక్స్ బాదడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్ బోణీ చేసింది. శుక్రవారం జరిగిన లీగ్ ఆరంభ మ్యాచ్‌లో ముంబై 4 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. అలిస్ క్యాప్సీ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 75), జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42) ధాటిగా ఆడారు. సివర్ బ్రంట్, అమేలియా కెర్ చెరో 2 వికెట్లు తీశారు. భారీ ఛేదనలో ముంబై ఓవర్లన్నీ ఆడి 173/6 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 55), యాస్తిక భాటియా (45 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57) అర్ధ శతకాలతో అదరగొట్టారు. అరుంధతి రెడ్డి, క్యాప్సీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. చివరి ఓవర్‌లో ముంబై విజయానికి 12 పరుగులు కావాలి. అయితే, తొలి 5 బంతుల్లో 7 పరుగులిచ్చిన క్యాప్సీ.. పూజా వస్త్రాకర్ (1), హర్మన్‌ను అవుట్ చేసి ఉత్కంఠ రేపింది. చివరి బంతికి 5 రన్స్ అవసరముగా.. సజన (6 నాటౌట్) స్టన్నింగ్ సిక్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. హర్మన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 171/5 (క్యాప్సీ 75, జెమీమా 42, లానింగ్ 31, బ్రంట్ 2/33, కెర్ 2/43).

ముంబై: 20 ఓవర్లలో 173/6 (యాస్తిక 57, హర్మన్‌ప్రీత్ 55, కెర్ 24, అరుంధతి 2/27, క్యాప్సీ 2/23).

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు X యూపీ

రాత్రి 7.30 గం. నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

ఆసీస్‌దే టీ20 సిరీస్

రెండో మ్యాచ్‌లోనూ కివీస్ ఓటమి

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన రెండో పోరులో ఆసీస్ 72 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. మొదట ఆసీస్.. హెడ్ (45), కమ్మిన్స్ (28), మార్ష్ (26) రాణించడంతో 19.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఫెర్గూసన్ 4 వికెట్లు తీశాడు. ఛేదనలో జంపా (4/34) సహా ఆసీస్ బౌలర్లంతా సమష్టిగా సత్తా చాటడంతో కివీస్ 17 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. గ్లెన్ ఫిలిప్స్ (42) ఒక్కడే ఫర్వాలేదనిపించాడు.

హైదరాబాద్‌లో సీసీఎల్

విద్యార్థులకు ఉచిత ప్రవేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): దేశ వ్యాప్తంగా సినీ ప్రముఖులు పాల్గొనే సెలబ్రెటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) రెండో అంచె పోటీలు వచ్చేనెల 1 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు తెలిపారు. ఈ మ్యాచ్‌లు తిలకించేందుకు విద్యార్థులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తిగల విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థుల పేర్లను హెచ్‌సీఏ మెయిల్ ఐడీ (hca.ccl2024@gmail.com)కి ఈనెల 27లోపు పంపాలన్నారు.

రూట్ నిలిచెన్



జో రూట్ (106 బ్యాటింగ్)

అజేయ శతకంతో అదుర్స్

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 302/7

ఆకాశ్‌కు మూడు వికెట్లు

భారత్‌తో నాలుగో టెస్టు



ఆకాశ్ దీప్ (3/70)

రాంచీ: సిరీస్ కోసం భారత్.. గెలిచి నిలిచేందుకు ఇంగ్లండ్.. ఈ రెండు జట్ల మధ్య నాలుగో టెస్టు ఆసక్తికరంగా ఆరంభమైంది. టీమిండియా పేసర్ ఆకాశ్ దీప్ (3/70) తన అరంగేట్రాన్ని చిరస్మరణీయం చేసుకున్న వేళ.. పర్యాటక జట్టు మొదటి సెషన్‌లోనే ఐదు వికెట్లు కోల్పోయిన తరుణాన.. రోజు ముగిసేలోగా రోహిత్ సేన బ్యాటింగ్ ఖాయమనిపించింది. కానీ వెటరన్ జో రూట్ (106 బ్యాటింగ్) బజ్‌బాల్‌ను పక్కనబెట్టి తన సహజశైలిని నమ్ముకుని క్రీజులో పాతుకుపోయాడు. అజేయ సెంచరీతో ఉన్న అతడికి బెన్ ఫోక్స్ (47), బెయిర్‌స్టో (38), రాబిన్సన్ (31 బ్యాటింగ్) సహకారమందించారు. ఫలితంగా తొలి రోజైన శుక్రవారం ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది.

ఆకాశ్ అదరహో..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను ఆకాశ్‌దీప్ తన పేస్‌తో బెంబేలెత్తించాడు. పది బంతుల వ్యవధిలోనే టాపార్డర్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో తొలి సెషన్ ముగిసేసరికే ఇంగ్లండ్ 112/5 స్కోరుతో కష్టాల్లో పడింది. నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ క్రాలే (42)ను ఆకాశ్ బౌల్డ్ చేసినా అది నోబ్‌గా తేలింది. అటు సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో క్రాలే 4,4,4,6తో 19 రన్స్ రాబట్టడంతో పరుగులు వేగంగా వచ్చాయి. పదో ఓవర్‌లో ఆకాశ్ అద్భుత బంతులతో విరుచుకుపడి డకెట్ (11), పోప్ (0) వికెట్లు తీశాడు. తన మరుసటి ఓవర్‌లోనే కచ్చితమైన లెంగ్త్‌తో విసిరిన బంతి క్రాలే బెయిల్స్‌ను ఎగరగొట్టడంతో తొలి గంటలోనే ఇంగ్లండ్ 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత బెయిర్‌స్టో వేగంగా ఆడాడు. నాలుగో వికెట్‌కు రూట్‌తో కలిసి 52 పరుగులు జోడించాక అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఇక జడేజా ఓవర్‌లో తక్కువ ఎత్తులో వచ్చిన బంతికి బెన్ స్టోక్స్ (3) ఎల్బీ కావడంతో జట్టు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

పాతుకుపోయాడు: తొలి సెషన్‌లో మన బౌలర్ల జోరు చూశాక ప్రత్యర్థి మిగిలిన ఐదు వికెట్లు నేలకూలేందుకు ఎంతో సమయం పట్టదనిపించింది. కానీ జరిగింది వేరు. సిరీస్‌లో తొలిసారిగా ఒక్క వికెట్ కోల్పోకుండా ఇంగ్లండ్ రెండో సెషన్‌ను ముగించగలిగింది. జో రూట్, ఫోక్స్ అత్యంత ఓపికతో అసలైన టెస్టు ఆటను ప్రదర్శిస్తూ అండగా నిలిచారు. స్పిన్, పేస్‌ను నింపాదిగా ఎదుర్కొంటూ బౌలర్లను విసిగించారు. ఈక్రమంలో ఆరో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆఖరి సెషన్‌లో స్వల్ప వ్యవధిలో ఫోక్స్, హార్ట్‌లీ (13)లను సిరాజ్ అవుట్ చేశాడు. కానీ రూట్‌కు రాబిన్సన్ జత కలువడంతో ఇంగ్లండ్ మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగించింది. అంతకుముందే రూట్ కెరీర్‌లో 31వ శతకం పూర్తి చేయడంతో పాటు జట్టు స్కోరును 300 దాటించాడు.

మూలాలకు కట్టుబడి..

29, 2, 5, 16, 18, 7.. ఆధునిక క్రికెట్ అత్యున్నత ఆటగాళ్లలో ఒకడిగా చెప్పుకొనే జో రూట్ బ్యాట్ నుంచి ఇటీవల వచ్చిన పరుగులు. ఆరు ఇన్నింగ్స్‌లో కేవలం 72 పరుగులతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వేళ.. అతడు తన మూలాలకు కట్టుబడి శతకం బాదేశాడు. వాస్తవానికి మెకల్లమ్ కోచ్‌గా వచ్చాక అతడి ఆట ఎత్తుపల్లాలను చూస్తోంది. బజ్‌బాల్ గేమ్ అతడి శైలికి ఏమాత్రం సరిపోదు. అటు భారత గడ్డపై ఆ వ్యూహాన్ని నమ్ముకుని ఇంగ్లండ్ దారుణంగా దెబ్బతింటోంది. నాలుగో టెస్టులోనూ తొలి సెషన్‌లోనే ఐదు వికెట్లు కోల్పోయిన గడ్డు పరిస్థితిలో జో రూట్ తన సంప్రదాయక ఆట తీరుతోనే జట్టు పరువు కాపాడాడు. 47/2 స్కోరు దగ్గర క్రీజులోకి వచ్చిన తను ఓవైపు వికెట్లు కోల్పోతున్నా ఏకాగ్రత తను చెదరనీయకుండా క్రీజులో పట్టుదలగా నిలిచాడు. తన కెరీర్‌లో మూడో నెమ్మదైన (219 బంతుల్లో) సెంచరీని పూర్తి చేసి.. తమ ఇన్నింగ్స్‌ను రెండో రోజుకు తీసుకెళ్లగలిగాడు. అందుకే శనివారం ఆటలో భారత్‌కు రూట్ వికెట్ అత్యంత కీలకం కానుంది.

1 భారత్‌పై ఎక్కువ టెస్టు సెంచరీ (10)లు చేసిన బ్యాటర్‌గా రూట్. స్టీవ్ స్మిత్ (9)ను అధిగమించాడు.

3 ప్రస్తుత తరంలో కోహ్లీ (80), వార్నర్ (49) తర్వాత అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ సెంచరీ (47)లు చేసిన మూడో బ్యాటర్‌గా రూట్. రోహిత్ కూడా ఇన్నే చేశాడు.

1 ఒకే జట్టుపై వెయ్యి పరుగులు+100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్.



స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (బి) ఆకాశ్ 42; డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ 11; పోప్ (ఎల్బీ) ఆకాశ్ 0; రూట్ (బ్యాటింగ్) 106; బెయిర్‌స్టో (ఎల్బీ) అశ్విన్ 38; స్టోక్స్ (ఎల్బీ) జడేజా 3; ఫోక్స్ (సి) జడేజా (బి) సిరాజ్ 47; హార్ట్‌లీ (బి) సిరాజ్ 13; రాబిన్సన్ (బ్యాటింగ్) 31; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 90 ఓవర్లలో 302/7. వికెట్ల పతనం:** 1-47, 2-47, 3-57, 4-109, 5-112, 6-225, 7-245. **బౌలింగ్:** సిరాజ్ 13-3-60-2; ఆకాశ్ దీప్ 17-0-70-3; జడేజా 27-7-55-1; అశ్విన్ 22-1-83-1; కుల్దీప్ 10-3-21-0; జైస్వాల్ 1-0-6-0.



అమ్మ ఆశీర్వాదం తీసుకొని..

జాతీయ జట్టుకు ఎంపికవడంతో గురువారం తల్లి లదుమా దేవికి ఫోన్ చేసిన ఆకాశ్.. 'నేను రేపు టెస్టులో అరంగేట్రం చేస్తున్నా. నువ్వు రావాల్సిందే' అని చెప్పడంతో ఆమె మ్యాచ్‌కు హాజరైంది. కోచ్ ద్రవిడ్ చేతుల మీదుగా క్యాప్‌ను అందుకొన్న ఆకాశ్.. తర్వాత తల్లికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నాడు. 'ఒకప్పుడు చాలా మంది నా కొడుకు ఎందుకూ పనికిరాడన్నారు. కానీ, ఈ రోజు మమ్మల్ని గర్వపడేలా చేశాడ'ని లదుమా సంతోషం వ్యక్తం చేసింది.

కష్టాలు దాటుకొని..

ఝుమ్రా గైర్హాజరీలో జట్టులోకి సర్రున దూసుకొచ్చిన ఆకాశ్ దీప్.. అరంగేట్ర టెస్టులోనే మూడు వికెట్లతో సత్తా చాటి టీమిండియా నయా పేస్ సంచలనంగా మారాడు. ఆర్థికంగా కష్టాలు, కుటుంబంలో వరుస విషాదాలతో మూడేళ్లు ఆటకు దూరమైన ఇతడు.. మళ్లీ బంతి పట్టి రంజీలు, ఆ తర్వాత ఐపీఎల్, ఇప్పుడు టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. బిహార్‌లోని బడ్డీ గ్రామానికి చెందిన ఆకాశ్ తండ్రి రామ్‌జీ సింగ్ ప్రభుత్వ పాఠశాల టీచర్. చదువుపైనే దృష్టి పెట్టాలంటూ నాన్న ఎంత నచ్చజెప్పినా, తనకిష్టమైన క్రికెట్‌పైనే ఆసక్తి కనబరిచిన ఆకాశ్ బంధువు సహకారంతో స్థానిక అకాడమీలో చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. కానీ, కుటుంబంలో జరిగిన వరుస విషాద ఘటనలతో మూడేళ్లపాటు ఆకాశ్ బంతి పట్టలేకపోయాడు. 2015లో నాన్న రామ్‌జీ పక్షవాతానికి గురై మరణించాడు. రెండునెలల తర్వాత అన్న ధీరజ్ కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆకాశ్ ఎంతగానో కుంగిపోయాడు. ఇదే సమయంలో ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో.. ఆదాయం కోసం ఇసుక రీచ్‌ల వద్ద ట్రక్కులు అద్దెకిచ్చే వ్యాపారం చేశాడు. ఇలా మూడేళ్లు గడిచిన తర్వాత మళ్లీ క్రికెట్‌పై దృష్టి సారించిన ఆకాశ్.. యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఆ తర్వాత బెంగాల్ అండర్-23 జట్టులో, అనంతరం రంజీల్లో మెరుగైన ప్రదర్శన చేసి ఐపీఎల్‌కు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో బెంగళూరు, పంజాబ్ జట్ల తరఫున ప్రతిభ చాటుకున్న 2022లో ఆసియా క్రీడల జట్టులో స్థానం దక్కించుకున్నాడు. రంజీల్లో నిలకడైన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఆడాలన్న తన కలను సాకారం చేసుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 24-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 310 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి పోటీ!



లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలంటున్న కాంగ్రెస్ నేత

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవికి రాజీనామా 9

10 రోజుల క్రితమే సీఎం రేవంత్‌కు లేఖ అందజేశా

ఎంపీ టికెట్‌కు పదవి అడ్డంకిగా మారితే ఆమోదించాలని కోరా

మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి వెల్లడి

ఇదే సీటుపై కన్నేసిన సంపత్ కుమార్, మందా జగన్నాథం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

ఔటర్ రింగురోడ్డుపై ఘోర ప్రమాదం

పటాన్‌చెరు సమీపంలో ముందున్న వాహనాన్ని రెయిలింగ్‌ను ఢీకొన్న కారు

లాస్య తల, ముఖానికి తీవ్రగాయాలు.. విరిగిన దంతాలు, ఛాతీ ఎముకలు.. అక్కడికక్కడే మృతి

తండ్రి సంవత్సరీకం ముగిసిన 4 రోజులకే కన్నుమూత.. అధికారలాంఛనాలతో అంత్యక్రియలు

పాడె మోసిన మాజీ మంత్రులు హరీశ్, తలసాని.. సీఎం రేవంత్, కేసీఆర్ సహా పలువురి నివాళులు





ప్రమాదంలో ధ్వంసమైన కారు; లాస్య నందిత(ఫైల్)

కారు నడిపిన పీఏ ఆకాశ్‌కు గాయాలు

అతడు నిద్రమత్తులోకి జారుకోవడంతోనే ప్రమాదం: ఎస్పీ వెల్లడి

పటాన్‌చెరు, సంగారెడ్డి క్రైమ్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే (కంటోన్మెంట్) లాస్య నందిత (37) ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శామీర్‌పేట నుంచి ముత్తంగి ఔటర్ జంక్షన్ వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ దాటిన తరువాత పటాన్‌చెరు శివారు ప్రాంతంలో కారు అతివేగంగా.. గుర్తుతెలియని వాహనాన్ని వెనక నుంచి ఢీకొని అదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపు దూసుకెళ్లి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదం తీవ్రతకు వాహనం ముందువైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లు విరిగిపోవడంతో ఆయన కారులోనే ఇరుక్కుపోయారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నందిత సీటు బెల్ట్ పెట్టుకున్నా, ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నా.. ఆమె తలకు, ముఖానికి, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి సదాశివపేట మండలం ఆరూర్‌లోని మిస్కిన్ షా దర్గాను సందర్శించారని.. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకునే క్రమంలో

మిగతా 11వ పేజీలో...

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీపై విజిలెన్స్

రాబోయే 15 రోజుల్లో దాడులు

ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు ఇంటికే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన

వారంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పెట్టుకోండి

హైదరాబాద్‌లో విలువైన ఆస్తుల జాబితా సమర్పించండి

ఆన్‌లైన్లో పెట్టకుండా భవనాలకు అనుమతులెలా!?

3500 చెరువుల డేటా ఆన్‌లైన్‌లో ఎందుకు తీసేస్తున్నారు?

చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

మునిసిపల్ కార్మికులకు ప్రమాద బీమాపై పరిశీలించండి

న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో ప్రకటనలు: సీఎం



మేడారంలో నిలువెత్తు బంగారం సమర్పిస్తున్న సీఎం రేవంత్; చిత్రంలో మంత్రులు సీతక్క, పొంగులేటి, సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో విలువైన ప్రభుత్వ ఆస్తుల జాబితాను సమర్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఏవైనా ప్రారంభోత్సవాలు ఉంటే వారం రోజుల్లో పెట్టుకోవాలని సూచించారు. మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. రాబోయే 15 రోజుల్లో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతాయని, ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారులు ఇంటికి పోతారని హెచ్చరించారు. వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖపై శుక్రవారం రాత్రి హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన సమీక్ష సమావేశంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. "జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో చాలా భవనాలకు సంబంధించి ఫైల్స్ కనిపించడం లేదు. ఆన్‌లైన్లో లేకుండా ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో లేకుండా ఇచ్చిన అనుమతుల జాబితా తయారు చేయాల్సిందే. బిల్డింగ్ పర్మిషన్ ఫైళ్లు క్లియర్‌గా ఉండాల్సిందే" అని తేల్చి చెప్పారు. హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచి చెరువుల ఆన్‌లైన్ డేటాను ఎందుకు తొలగిస్తున్నారని అధికారులను నిలదీశారు. హైదరాబాద్ పరిధిలో 3500 చెరువులు ఉన్నాయని, వాటి విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లకు సంబంధించిన వివరాలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. 3500 చెరువుల డేటా ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేనని నిర్దేశించారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా వాటి వద్ద తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలో పిల్లల కోసం క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన 85 మునిసిపాలిటీల్లో కమిషనర్లు లేకపోవడంపై సీఎం రేవంత్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్లో మాట్లాడి.. గ్రూప్ 1 అధికారులు

మిగతా 10వ పేజీలో...

నిందితురాలిగా కవిత!

ఢిల్లీ మద్యం కేసులో ఇప్పటిదాకా ఆమెను సాక్షిగా పరిగణించిన సీబీఐ

అప్రూవర్ రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారంతో నిందితురాలిగా మార్పు





41ఏ నిబంధన కింద తాజా నోటీసులు

26న విచారణకు హాజరు కావాలన్న సీబీఐ

ఇదే కేసులో త్వరలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే అవకాశం

అదే సమయంలో కవిత అరెస్టు కూడా?

బీఆర్ఎస్ పట్ల బీజేపీ వైఖరి మారిన దృష్ట్యానే ఈ పరిణామాలు!

కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవద్దని బెదిరించడానికే కేజ్రీవాల్ అరెస్టుకు చర్యలు

మా పొత్తును చూసి బీజేపీ వణికిపోతోంది

అరెస్టు చేసినా పొత్తు ఆగదు: ఆప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ నిందితురాలిగా చేర్చింది. గతంలో కవితను సాక్షిగానే ప్రశ్నించిన సీబీఐ.. తాజాగా 41 ఏ నిబంధన కింద నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 26న తమ ముందు విచారణకు హాజరు కావాలని సీబీఐ కవితకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మాగుంట రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారి దర్యాప్తు అధికారులకు వెల్లడించిన విషయాలే కవితను ఈ కేసులో నిందితురాలిగా చేర్చేందుకు వీలు కల్పించాయని భావిస్తున్నారు. రాఘవరెడ్డితో పాటు కవిత పీఏ అశోక్ కౌశిక్ వాంగ్మూలం కూడా సీబీఐ దర్యాప్తులో కీలకం కానున్నది. 2023 ఫిబ్రవరి 10న రాఘవరెడ్డిని ఈడీ అరెస్టు చేసిన తర్వాత ఆరు నెలలకు బెయిల్‌పై ఆయన విడుదలయ్యారు. అక్టోబరు 3న ఆయన అప్రూవర్‌గా మారి

మిగతా 11వ పేజీలో...

సరోగసీ నిబంధనల్లో సవరణలు 12

ఇకపై దాతల నుంచీ అండం, వీర్యం

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



విశ్రాంత ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ కన్నుమూత 7

కలెక్టరు నుంచి స్పెషల్ సీఎస్ వరకు..

ఉమ్మడి ఏపీలో వివిధ హోదాల్లో సేవ

ఫ్రీ విద్యుత్ స్కీం రూపకల్పనలో పాత్ర

కొన్నేళ్లుగా అల్జీమర్స్‌తో బాధపడుతున్న జన్నత్.. సూళ్లూరుపేటలో మృతి

జాగ్రత్త.. యుద్ధానికి దూరంగా ఉండండి

త్వరలోనే స్వదేశానికి రప్పిస్తాం

రష్యా-ఉక్రెయిన్ పోరులో చిక్కుకున్న భారతీయులకు కేంద్రం భరోసా

సైన్యంలో సహాయకుడి ఉద్యోగం పేరిట ఏజెంట్ల మోసం 12

బాధితుల్లో ఇద్దరు తెలంగాణ వాసులు



సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో నిండిన గద్దెల ప్రాంగణం

రుణమాఫీపై త్వరలో తీపికబురు

బ్యాంకర్లతో తుది దశకు చేరిన చర్చలు.. 27న ఫ్రీ విద్యుత్తు, సిలిండర్ పథకాలకు శ్రీకారం

ప్రియాంక చేతుల మీదుగా ప్రారంభిస్తాం.. 2న మరో 6000 కొలువులకు నోటిఫికేషన్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏడుచోట్ల, బీఆర్ఎస్ పదిచోట్ల పోటీకి ఒప్పందం!

కుంభమేళాకు రూ.కోట్లు ఖర్చు చేయట్లేదా!?.. మేడారానికి జాతీయ హోదా ఇస్తే తప్పేంటి?

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి.. మేడారంలో 'శాశ్వత అభివృద్ధి'కి కమిటీ 10

జాతరకు మోదీ, షా రావాలి: సీఎం.. వనదేవతలను దర్శించుకుని మొక్కుల సమర్పణ

గిరిజనుల అభ్యున్నతికి కృషి.. ఆదివాసీలను ప్రధాన స్రవంతిలోకి తెస్తా: తమిళిసై

మేడారంలో భక్తులకు అనారోగ్య సమస్యలు.. 4 రోజుల్లో 1.5 లక్షల మందికి మందులు

క్రైమ్ కథా చిత్రమ్..!



నిందితురాలు తృష్ణ

బాధితుడు ప్రణవ్

మ్యాట్రిమోనీ సైట్‌లో సైబర్ నేరగాడి ఫేక్ ప్రొఫైల్

ఫొటో నచ్చడంతో చాటింగ్ చేసిన యువతి

పెట్టుబడిగా అడిగితే పలు విడతల్లో రూ.40 లక్షలు

మోసపోయానని తెలియడంతో ఫొటోలోని యువకుడిని పట్టుకొని పెళ్లికి ప్రతిపాదన 9

అతను తిరస్కరించడంతో కిడ్నాప్

నిర్బంధించి ఐదు గంటల పాటు చిత్రహింసలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎట్టకేలకు సర్దుబాట్లు

అహంకారాలను పక్కనబెట్టి, అనుమానాలకు స్వస్తిచెప్పి, సీట్ల సర్దుబాటు విషయంలో ఇండియా కూటమి అడుగులువేయడం ఆరంభించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్–సమాజ్‌వాదీపార్టీ మధ్య ఎంతోకాలంగా నానుతున్న వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. ఎవరు రాజీపడ్డారో, ఎవరు లాభపడ్డారో తెలియదు కానీ, కాంగ్రెస్‌కు అఖిలేశ్ యాదవ్ దాదాపు నాలుగోవంతు స్థానాలు ఇచ్చి ఆనందింపచేశారు. ఢిల్లీ, మహారాష్ట్రలో కూడా చర్చలు జోరందుకున్నాయని, పోతేపొండి అని గర్జించిన బెంగాల్ మమతతో కూడా కాంగ్రెస్ మళ్ళీ మంతనాలు ఆరంభించిందని వార్తలు వస్తున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపి, ఇండియా కూటమిలో ఉంటున్న ప్రాంతీయ పార్టీలకు రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ శత్రువైనప్పుడు ఇచ్చిపుచ్చుకోవడం సహజంగానే మరీ కష్టం.

ప్రియాంకాగాంధీ రంగంలోకి దిగితే తప్ప యూపీలో లెక్కలు ఒక కొలిక్కిరాలేదట. యూపీలో 80 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 17 చోట్ల పోటీచేస్తుంది. ఆదినుంచీ అఖిలేశ్ అదే మాటమీద నిలబడిపోవడంతో మొదట్లో 20 స్థానాలకు పట్టుబట్టిన కాంగ్రెస్ మూడింటిని వదులుకుంది. ఇందుకు బదులుగా తాను బలంగా ఆశిస్తున్న కొన్ని స్థానాల విషయంలో అఖిలేశ్‌ను కాంగ్రెస్ ఒప్పించగలిగిందని అంటున్నారు. రాహుల్, అఖిలేశ్, ప్రియాంక మధ్య చర్చోపచర్చల తరువాత కుదిరిన ఈ ఒప్పందంతో పాటు, మధ్యప్రదేశ్ లెక్కలను సైతం రెండు పార్టీలు తేల్చుకున్నాయి. అక్కడ ఒక సీటు సమాజ్‌వాదీకి దక్కింది. ఇక, యూపీలో కాంగ్రెస్ పోటీచేయబోతున్న పదిహేడు స్థానాల్లో అది గత సార్వత్రక ఎన్నికల్లో ఓడిపోయినవి ఎన్నో బీజేపీ నాయకులు గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ఎక్కడెక్కడ, ఎన్ని ఓట్లు తెచ్చుకుందో వివరిస్తూ అఖిలేశ్ కాంగ్రెస్‌ను నిండాముంచాడని అంటున్నారు. కానీ, ఇప్పటిలెక్కలూ ఈసారి వ్యూహాలు వేరని ఎస్పీ–కాంగ్రెస్ గట్టిగా నమ్ముతున్నాయి. అసలే యోగి, ఆపైన అయోధ్యతో ఈ మారు పోటీ మరింత బలంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

ఢిల్లీలో కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ మధ్య ఇప్పటికే అవగాహన కుదిరిందని, నాలుగు సీట్లలో ఆప్, మిగతా మూడింటిలో కాంగ్రెస్ పోటీచేయబోతున్న ప్రకటన త్వరలోనే వెలువడుతుందని అంటున్నారు. ఈ రెండు పార్టీలూ గుజరాత్‌లో ఒక సీటు విషయంలో ఏర్పడిన వివాదాన్ని, హర్యానాలో వాటాలనూ కూడా పరిష్కరించుకున్నాయట. మహారాష్ట్రలో శరద్‌పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, ప్రకాష్ అంబేడ్కర్ మధ్య పంపకాలు, కాంగ్రెస్ వాటాలూ కోటాలూ ఇప్పటికే ఓ కొలిక్కివచ్చాయని, వారంలో తేలిపోతాయని అంటున్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్–తృణమూల్ మధ్య మళ్ళీ చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు ఆశ్చర్యకరమైనవే. రెండేరెండు సీట్లు అని మమత అనడం, కాంగ్రెస్ ఆగ్రహించడం, ఆ పైన మమత కాంగ్రెస్‌కు అహంకారం ఎక్కువంటూ రాహుల్ న్యాయ యాత్రను సైతం విమర్శించడం తెలిసినవే. మమత అంటేనే మండిపడే అధిర్‌రంజన్ నిత్యం ఆమెమీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూనే ఉంటారు. ఈ పరిస్థితుల్లో మళ్ళీ చర్చలు జరుగుతున్నా చివరకు కాంగ్రెస్ సర్దుకుపోవాల్సివస్తుందా, మమతే ఓ మెట్టుదిగుతారా అన్నది చూడాలి. తమిళనాడులో గతంలో మాదిరిగానే కాంగ్రెస్‌కు 9 స్థానాలు ఇవ్వడానికి డీఎంకె నిజానికి ఎప్పుడో సిద్ధపడింది. పోటీచేసినవాటిలో ఎనిమిదింటిని గెలుచుకున్న కాంగ్రెస్ ఈసారి అదనంగా మరికొన్నిటికోసం ప్రయత్నిస్తోంది.

నిజానికి మోదీ ఎప్పుడో సార్వత్రక యుద్ధం ఆరంభించేశారు. రామమందిరం, భారతరత్నలు, ప్రాజెక్టులతో సహా ప్రతీ అడుగూ ఎప్పటినుంచో ఆ దిశగానే పడుతోంది. దేశాన్ని ఇండియా కూటమి కులం ప్రాతిపదికన చీల్చాలని అనుకుంటోందని కులగణనమీద కూడా విమర్శలు చేస్తున్నారు. మరోపక్క పార్టీనేతలకు వందరోజుల కార్యాచరణ అందిస్తున్నారు. ఎన్నికల ప్రకటన దగ్గరపడుతున్న తరుణంలో ఇప్పటికి ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కివస్తున్నట్టుంది. కూటమికి పునాదులు వేసిన నితీశ్‌కుమార్ ఎన్డీయేలో చేరిపోవడం ఆదిలోనే దానికి తగిలిన పెద్ద ఎదురుదెబ్బ. ఆయన నిష్క్రమణతో బిహార్‌లో మహాగఠ్బంధన్‌కు మరింత ప్రయోజనం చేకూరుతుందన్న వాదనలు కూడా లేకపోలేదు. మిత్రపక్షాలతో ఇచ్చిపుచ్చుకొనే విషయంలో కాంగ్రెస్ తన భేషజాలు పక్కనబెట్టి సర్దుబాటు ధోరణి కనబరుస్తున్నందున పంపకాలు సాధ్యపడుతున్నప్పటికీ, ఎన్నికల చివరి అంకంవరకూ, ఓట్లసాధనలోనూ ఇదే సయోధ్య నిలబెట్టుకోవడం మరింత ముఖ్యం.

సార్థకం కాని స్వయం సంకీర్తనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిత్యం తనను తాను ఉత్తమ పురుషలో సూచించుకోవడం కద్దు. ఆయనకు గల ఈ విలక్షణ అలవాటు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో ధ్రువీకరించింది: నరేంద్ర మోదీయే భారత ప్రభుత్వం; ప్రభుత్వ మంచీ చెడుకు మోదీ మాత్రమే బాధ్యుడు మిగతా అందరూ– అమిత్ షా మినహా సుమా! – మంత్రులు, పార్టీ నాయకులు, ఎంపీలు, ముఖ్యమంత్రులు– అప్రధాన వ్యక్తులుగా తగ్గించివేయబడ్డారు. విచిత్రమేమిటంటే తాము అసంగత వ్యక్తులుగా మిగిలి పోవడంపట్ల వారు సంతోషంగా ఉన్నారు! కనుక మనం ఏ విజ్ఞప్తులనైనా గౌరవనీయ ప్రధానమంత్రికి మాత్రమే చేయాలి; ఏ విమర్శలు అయినా సరే మాన్యులు ప్రధానమంత్రిని ఉద్దేశించి మాత్రమే చేయాలి.

ప్రధానమంత్రి కొద్ది కాలం క్రితం ఒక కొత్త నినాదాన్ని సృష్టించి దేశం మీదకి వదిలారు. అదే 'వికసిత్ భారత్' లేదా అభివృద్ధి చెందిన భారత్. 'అచ్ఛే దిన్ ఆనేవాలే హై'తో ప్రారంభమైన నినాదాల పరంపరలో 'వికసిత్ భారత్' అనేది చివరిది అని నేను భావిస్తున్నాను. మోదీ సృష్టించిన చాలా నినాదాలు దారి పక్కన పడిపోయాయి. 'వికసిత్ భారత్' అనేది ఒక లక్ష్యం. 2047 నాటికి మనం ఆ లక్ష్యాన్ని సాధించాలని నరేంద్ర మోదీ నిర్దేశించారు. 2024–2047 మధ్య ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ భారత్ ప్రస్తుతానికంటే మరింత అభివృద్ధి చెందిన దేశంగా ఉంటుంది. 1947లో కంటే 2024లో భారత్ ఎంతగా అభివృద్ధి చెందిందో, ఇప్పటి కంటే 2047లో ఈ దేశం మరింత అభివృద్ధి చెందిన దేశంగా ఉండడం ఖాయం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

సరే, దేశం అభివృద్ధి చెందడమంటే ఏమిటి? 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందడమేనని నరేంద్ర మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని 2023–24 ఆర్థిక సంవత్సరాని కల్లా సాధించాలని మోదీ తొలుత నిర్దేశించారు. అయితే క్రమంగా ఆ లక్ష్య పరిపూర్తి గడువును 2027–28 ఆర్థిక సంవత్సరానికి తీసుకువెళ్లారు! 2023–24 ఆర్థిక సంవత్సరాంతానికి భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 172 లక్షల కోట్ల రూపాయలుగా ఉంటుంది. అది ప్రస్తుత మారకం రేటు ప్రకారం 3.57 ట్రిలియన్ డాలర్లకు సమానం. మారకం రేటు ప్రస్తుతమున్న విధంగానే ఉండిపోతే విభిన్న వృద్ధి రేట్లతో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్వప్నం విభిన్న సంవత్సరాలలో సాకారమవుతుంది 6 శాతం వృద్ధిరేటు సాధించడానికి ఆరు సంవత్సరాల వ్యవధి పడుతుంది. ఈ లక్ష్యాన్ని 2029–30 ఆర్థిక సంవత్సరంలో చేరగలుగుతాము. 7 శాతం వృద్ధిరేటును సాధించేందుకు ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ లక్ష్యాన్ని 2028–29 ఆర్థిక సంవత్సరంలో సాధించగలుగుతాము. 8 శాతం వృద్ధిరేటును నాలుగున్నర సంవత్సరాలలో సాధించగలుగుతాము. ఈ లక్ష్యం సెప్టెంబర్ 2028లో పరిపూర్తి కాగలదు. డాలర్ : రూపీ మారకం రేటు దిగసిల్లిపోతే లక్ష్య సాధన సంవత్సరం మరింత వెనక్కి వెళ్లుతుంది.

గత పదేళ్లుగా బీజేపీ/ ఎన్డీఏ ప్రభుత్వ పాలన స్ఫూర్తిదాయకంగా లేదు. నిజమైన అభివృద్ధికి దోహదం చేయలేదు. కొత్త లెక్కల ప్రకారం యూపీఏ పదేళ్ల పాలనలో సగటు వార్షిక వృద్ధిరేటు 6.7 శాతం కాగా (పాత లెక్కల ప్రకారం ఇది 7.5 శాతం) ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన సగటు వార్షిక వృద్ధిరేటు 5.9 శాతంగా మాత్రమే నమోదయింది. మరి బీజేపీ ప్రభుత్వం సగటు వృద్ధిరేటు పెరుగుదలను సాధించగలదా? ప్రభుత్వంలోని వారు గానీ, పార్టీలోని వారు గానీ ఈ ప్రశ్నకు సమాధానమివ్వలేకపోతున్నారు. వృద్ధిరేటు పెరుగుదల అనేది బాహ్య కారణాలతో పాటు ఆర్థిక వ్యవస్థను దేశీయంగా నిర్వహిస్తున్న తీరుతెన్నుల పైన ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో అనిశ్చితి ఎలా ఉన్నప్పటికీ నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి సార్వత్రక ఎన్నికలలో విజయం సాధించగలగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ 8 శాతం వార్షిక వృద్ధిరేటుతో మోదీ మూడో విడత పాలన ఆఖరి సంవత్సరంలో మాత్రమే భారత్ జీడీపీ 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరగలుగుతుంది.





2028–29లో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 150 కోట్ల జనాభాతో భారత్ తలసరి ఆదాయం 3333 డాలర్లుగా ఉంటుంది. ఆ తలసరి ఆదాయం భారత్‌ను దిగువ మధ్య స్థాయి ఆదాయ ఆర్థిక వ్యవస్థల శ్రేణిలో చేర్చుతుంది. 'అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ', 'ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ' ఇత్యాది ఆత్మ స్తుతులు సత్యదూరమైనవి.

2028–29 ఆర్థిక సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రియన్ డాలర్ల స్థాయికి చేరిందని అనుకుందాం. అప్పుడు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా పరిగణన పొందుతుందా? 2028–29లో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 150 కోట్ల జనాభాతో భారత్ తలసరి ఆదాయం 3333 డాలర్లుగా ఉంటుంది. ఆ తలసరి ఆదాయం భారత్‌ను దిగువ మధ్య స్థాయి ఆదాయ ఆర్థిక వ్యవస్థల శ్రేణిలో చేర్చుతుంది. ప్రపంచ దేశాలలో భారత్ ప్రస్తుతం 140వ స్థానంలో ఉన్నది. 2028–29లో కొంచెం మెరుగైన స్థానంలో భారత్ ఉండగలదు. ఇవన్నీ నేను ఎందుకు ఏకరువు పెడుతున్నాను? 'అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ', 'ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ' ఇత్యాది స్వయం సంకీర్తనలు సత్యదూరమైనవి. ఇవేవీ నన్ను ఏ మాత్రం ఉత్తేజపరచడం లేదు.

కొన్ని ఉపయుక్తమైన ప్రశ్నలను పాఠకుల ముందుంచదలిచాను. రాబోయే సార్వత్రక ఎన్నికలలో వాటిపై చర్చ జరిగి తీరాలి:

(1) 22 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే నివసిస్తుండడం భారత్ ప్రతిష్ఠకు తీరని కళంకం కాదా? ఈ కళంకాన్ని మన దేశం ఎప్పటికి తొలగించుకోగలుగుతుంది? యూఎన్‌డీపీ ప్రకారం 2005–15 సంవత్సరాల మధ్య 27 కోట్ల మంది భారత ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. మరి 22 కోట్ల మంది పేదలను దారిద్ర్యం నుంచి ఎప్పటికి విముక్తం చేస్తారు? (2) ప్రస్తుత నిరుద్యోగిత రేటు (8.7 శాతం) లక్షలాది ప్రజల బతుకులను అతలాకుతలం చేస్తోంది విద్యావంతులు, పాక్షిక నైపుణ్యాలు కలవారు వలస వెళ్ళే అగత్యాన్ని కలిగిస్తోంది. నేరాలు పెచ్చరిల్లి పోవడానికి కారణమవుతోంది. యువజనులు తమ అర్హతలకు తగ్గ ఉద్యోగాలను ఎప్పుడు పొందగలుగుతారు? వాచ్‌మాన్, రైల్వే గ్యాంగ్ మ్యాన్ ఉద్యోగాలకు పిహెచ్‌డి ఉన్నవారు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, దరఖాస్తు చేస్తున్న శోచనీయ స్థితి ఎప్పుడు తొలగిపోతుంది? (3) కార్మిక–జనాభా నిష్పత్తి (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) ఎప్పుడు 50 లేదా 60 శాతానికి పైగా పెరుగుతుంది? కార్మిక శ్రేణులలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుత 25 శాతం నుంచి మరింతగా ఎప్పుడు పెరుగుతుంది? (4) ప్రైవేట్ వినియోగం ఎప్పుడు పెరుగుతుంది? కుటుంబ అవసరాలకు సరిపడా తిండిగింజలను కొనుగోలు చేసుకోగలగడం పేదలకు ఎప్పటికి సాధ్యమవుతుంది? (5) నిజ వేతనాలు ఎప్పుడు పెరుగుతాయి?

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం మన దేశ ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న సమస్యలు. గౌరవనీయ ప్రధానమంత్రి ఆ సమస్యల గురించి చివరిసారి ఎప్పుడు మాట్లాడారో నాకు జ్ఞాపకం లేదు పైనా పైన, మణిపూర్ గురించి, రాజకీయ ఫిరాయింపుల గురించి, రాజకీయ పార్టీలను చీల్చడం గురించి, గోప్యత హక్కు గురించి, నైతిక పోలీసింగ్ గురించి బుల్డోజర్ న్యాయం గురించి ప్రధానమంత్రి చివరిసారి ఎప్పుడు మాట్లాడారో కూడా నాకు జ్ఞాపకం లేదు. రాజకీయ పార్టీలు ఈ సమస్యలను పదే పదే ప్రస్తావించాలి. బహిరంగ చర్చలు జరపాలి. ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఈ అంశాలపై తన ఉద్దేశపూర్వక మౌనాన్ని విడనాడేలా ప్రధానమంత్రిని బలవంత పెట్టాలి. భారతీయ జనతా పార్టీలో ప్రాధాన్యమున్న ఒకే ఒక్క నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే గనుక నేను లేవనెత్తిన అంశాలపై ఆయన తప్పక మాట్లాడాలి.

పెత్తందారీ కేంద్రంపై రాష్ట్రాల పోరు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని భారతీయ జనతాపార్టీ 2019లో మరింత మెజారిటీతో మళ్లీ అధికారానికి వచ్చినప్పటి నుంచీ కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల మధ్య ఘర్షణలు తీవ్రమయ్యాయి. ముఖ్యంగా మూడు రాష్ట్రాలు –పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ– ఈ ఘర్షణలకు కేంద్రంగా ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలలోను గవర్నర్లు కేంద్రంలోని అధికారపార్టీ తరఫున పక్షపాత దృక్పథంతో తమ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రం, మోదీ సర్కార్‌పై పలు ఆరోపణలు చేశారు. తమ రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన నిధులు రావడం లేదని, తమ రాష్ట్ర విలక్షణ, సమున్నత సంస్కృతి, అస్తిత్వాన్ని కేంద్రం అలక్ష్యం చేస్తోందని వారు విమర్శిస్తున్నారు.

బెంగాల్, కేరళ, తమిళనాడులోని బీజేపీయేతర ప్రభుత్వాలు–కేంద్రంలోని మోదీ సర్కార్ మధ్య పోరాటాలు కటువుగా ఉంటున్నాయి. ఏ పక్షమూ తన వాదనల నుంచి వెనక్కి తగ్గడం లేదు.

ఇటీవలి నెలల్లో మరో రెండు రాష్ట్రాలు కూడా మోదీ ధిక్కార కూటమిలో చేరాయి. అవి: ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఉన్న పంజాబ్, కాంగ్రెస్ పాలనలో ఉన్న కర్ణాటక. పంజాబ్ గవర్నర్ తరచు ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్‌తో ఘర్షిస్తున్నారు. గత మేలో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో అనేక అంశాలపై తీవ్రంగా విభేదిస్తూ వస్తోంది. పన్నుల ఆదాయంలో తమ రాష్ట్రానికి సహేతుకమైన వాటా ఇవ్వడంలో మోదీ సర్కార్ వివక్ష చూపుతున్నదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తరచు విమర్శిస్తున్నారు. కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా సిద్దరామయ్య, శివకుమార్‌లు ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ తరువాత కేరళ ముఖ్యమంత్రి సైతం అదే విధమైన నిరసన తెలిపారు.

కేంద్రం– మూడు రాష్ట్రాల ఘర్షణ గురించి పత్రికలలో వార్తలు వస్తున్నప్పటికీ వాటికి సరైన ప్రాధాన్యాన్ని ఇవ్వడం లేదు. కేరళ, తమిళనాడు బెంగాల్ ప్రజలు మొత్తంగా 30 కోట్ల మందికి పైగా ఉన్నారు. ఆ మూడు రాష్ట్రాల ప్రజలకు సొంత అస్తిత్వం, విలక్షణ సంస్కృతి, సమున్నత చరిత్ర ఉన్నది. తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ, పంజాబీ ప్రజలు తమ మాతృభాషను, సాహిత్య సంపదను, సాంస్కృతిక వారసత్వం సమున్నతమైనదిగా సహేతుకంగా గర్విస్తారు. ఈ వాస్తవాన్ని హిందీ, గుజరాతీ ప్రజలు అర్థం చేసుకోలేరు.

విద్య ఆరోగ్య సదుపాయాలు, జెండర్ సమానత్వం విషయంలో కేరళ, తమిళనాడులు దేశంలోనే అత్యంత ప్రగతిశీల, అగ్రగామి రాష్ట్రాలు. పారిశ్రామిక రంగంలో తమిళనాడు అద్వితీయమైన అభివృద్ధిని సాధించింది. వైజ్ఞానిక పరిశోధనలలో కర్ణాటక అగ్రగామిగా ఉన్నది. ఇటీవలి కాలంలో ఐటీ, బయో టెక్నాలజీ రంగాలలో ఆ రాష్ట్రం అద్భుతమైన పురోగతి సాధించింది. మన దేశం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నప్పుడు బెంగాల్ నుంచి మహోన్నత స్వాతంత్ర్య వీరులు, సంఘ సంస్కర్తలు, సాహితీవేత్తలు, వైజ్ఞానికులు ప్రభవించారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశ ఉత్కృష్ట సంగీతవేత్తలు, చలన చిత్ర స్రష్టలు, పండితులలో అత్యధికులు వంగ భూమి నుంచి వచ్చినవారే. పంజాబ్ భూమి పుత్రులు అయిన సిక్కులు దేశానికి ఆహార భద్రత కల్పించడంలో అనుపమాన సేవలు అందిస్తున్నారు. దేశ సాయుధ బలగాలలో అత్యధిక సంఖ్యలో ఉండడం ద్వారా భారతదేశ రక్షకులుగా వారు పేరు పొందారు.

పంజాబ్, బెంగాల్, కేరళ, కర్ణాటక, తమిళనాడులు గతంలోనూ, వర్తమానంలోనూ భారతదేశానికి వైవిధ్యపూరితమైన, విలక్షణమైన సేవలు అందించాయి. ఇప్పుడు ఈ ఐదు రాష్ట్రాలు ఐదు విభిన్న పార్టీల పాలనలో ఉన్నాయి. అవన్నీ బీజేపీయేతర పార్టీలు కావడం విశేషం. మరి ఈ ఐదు రాష్ట్రాలు, కేంద్రం మధ్య చోటు చేసుకుంటున్న ఘర్షణలు ఈ దేశ ప్రయోజనాలకు దోహదం చేస్తాయా?



> సమాఖ్య పాలన భవిష్యత్తు విషయమై ప్రజాస్వామ్య వివేచనా పరులు శ్రద్ధ చూపడం అవసరం. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మూడోసారి విజయం సాధిస్తే కేంద్రం–బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణలు మరింతగా తీవ్రమవుతాయి. ఇది మన రిపబ్లిక్ భవిష్యత్తుకు ఎంతమాత్రం మంచిదికాదు.

మరో కొత్త పరిణామం చూద్దాం. తదుపరి సార్వత్రక ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీకి వరుసగా మూడోసారి భారీ మెజార్టీని సమకూర్చేవిగా ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇటీవల ఆకాంక్షించారు. ఫిబ్రవరి తొలివారంలో రాష్ట్ర శాసనసభలో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలోకి వచ్చే రాజకీయ పక్షం ప్రభుత్వం ఏర్పాటుకు ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడినప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా' డిమాండ్ నెరవేరేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కొద్దిరోజుల అనంతరం రాష్ట్ర గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ జగన్ తన ఆకాంక్షను మరోసారి ఉద్ఘాటించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్నడూ నరేంద్రమోదీ, బీజేపీ, కేంద్ర ప్రభుత్వం పట్ల ఘర్షణాత్మక వైఖరిని అనుసరించలేదు. పూర్తివిధేయుడు కానప్పటికీ మోదీ, బీజేపీ, కేంద్రం నిర్దేశించినదాన్ని తుచ తప్పకుండా పాటించే వ్యక్తి. అధికరణ 370 రద్దు సహా చాలా నిర్ణయాలను ఆయన ఉత్సాహంగా సమర్థించారు. అసాధారణ పాలనాదక్షతను ప్రదర్శిస్తున్న నాయకుడుగా నరేంద్రమోదీని ప్రశంసించడంతో పాటు ఆయనను దార్శనికుడు అని కూడా జగన్ ప్రస్తుతించారు. ప్రధాని మోదీతో తనకు దృఢ సంబంధాలు ఉన్నాయని కూడా జగన్ చెప్పుకున్నారు. అదే జగన్ ఇప్పుడు మోదీ సర్కార్ వ్యవహారశైలిపట్ల కలవరం ప్రకటిస్తున్నారు. సమాఖ్య పాలనా విధానం సక్రమంగా అమలవ్వాలంటే కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఉండడం మంచిదన్న ఆయన అభిప్రాయం సహేతుకమైనది. గతంలో నేను ఇదే కాలమ్‌లో వాదించినట్టు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి, పత్రికా స్వేచ్ఛకు సంకీర్ణ ప్రభుత్వాలే మరింత సానుకూలంగా ఉంటాయి. సంకీర్ణ సర్కార్లు మాత్రమే సమతౌల్య ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతాయి.

కేంద్రం పట్ల జగన్‌రెడ్డి మృదువైఖరి, సానుకూల వ్యవహరణ ఇకపై సమరశీలంగా మారుతుందా అన్నది ఇదమిత్థంగా చెప్పలేం. అలాగే పన్నుల ఆదాయంలో మరింత వాటాను డిమాండ్ చేయడంలో తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటకలో అధికారంలో ఉన్న తమ పార్టీ సహచరులతో జట్టు కడతారా అనేదీ ఇప్పుడే స్పష్టంగా చెప్పలేం. ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు కేంద్రంతో ఘర్షణాత్మక వైఖరికి దూరంగా ఉన్నప్పటికీ బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న బెంగాల్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్‌ల మధ్య కొనసాగుతున్న విభేదాలు, ఘర్షణలు బాగా కలవరపరుస్తున్నాయి.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి ప్రకటనలు, చర్యలను నిశితంగా గమనిస్తే ప్రస్తావిత రాష్ట్రాల డిమాండ్లను బీజేపీ ఎంత మాత్రం అంగీకరించబోదనే విషయం స్పష్టమవుతుంది. బీజేపీయేతర పార్టీల పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలు, ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ ప్రాబల్యాన్ని, పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు బీజేపీ, మోదీ సర్కార్ మూడు ఎత్తుగడలకు పాల్పడే అవకాశమున్నది. వాటిలో మొదటిది ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరికే మోదీ ప్రభుత్వం మరింత దృఢంగా కట్టుబడి ఉండడం. అంటే బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల విన్నపాలను కేంద్రం రవ్వంత కూడా ఆలకించే అవకాశం ఉండదు. కొవిడ్ విలయం నాటి నుంచి రాజ్యాంగ విరుద్ధంగా స్వాధీనం చేసుకున్న రాష్ట్రాల అధికారాలను మరింతగా పెంచుకుని ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్రాలకు నిధుల పంపిణీని నిరాకరించడం, తద్వారా రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని మరింతగా కుదించివేయడం; రెండోది– 'డబుల్ ఇంజన్ సర్కార్'ను ఎన్నుకున్న రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం సకల సహాయ సహకారాలను అందిస్తుందని హామీ ఇవ్వడం; మూడోది కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడం ద్వారా ఇతర పార్టీల ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలా పురిగొల్పడం.

మోదీ ప్రభుత్వం ఈ మూడు పద్ధతులను తరచు సంయుక్తంగా అనుసరించడం జరిగింది, లక్ష్యసాధనలో చాలా వరకు సఫలమయింది కూడా. రెండు లేక అంతకంటే ఎక్కువ ప్రతిపక్షాలతో కూడిన సంకీర్ణ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను బీజేపీ కూల్చివేస్తుంది. 2019లో కర్ణాటకలో, 2022లో మహారాష్ట్రలో, ఇటీవల బిహార్‌లో ఇలానే జరిగింది. అయితే గణనీయమైన మెజారిటీతో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల (బెంగాల్, కేరళ, తమిళనాడులలో వలే)లో ప్రభుత్వాలను కూలగొట్టడంలో బీజేపీ పూర్తిగా విఫలమయింది. బెంగాల్, కేరళ, తమిళనాడులలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల పట్ల మోదీ ప్రభుత్వ స్పష్టమైన వ్యతిరేకత బెంగాలీలు, మలయాళీలు, తమిళులలో తీవ్ర మనస్తాపం కలిగిస్తోంది. బీజేపీ పట్ల ఆ రాష్ట్రాల ప్రజలలో వ్యతిరేకతను తీవ్రం చేస్తోంది.

భారతదేశ సమాఖ్య పాలనావ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళు, సమస్యల గురించి గోదీ మీడియా (ప్రభుత్వ అనుకూల పత్రికలు, ఛానెళ్ల)లో ఎలాంటి చర్చ జరగడం లేదు. సమాఖ్య పాలన భవిష్యత్తు విషయమై ప్రజాస్వామ్య వివేచనాపరులు తగుశ్రద్ధ చూపడం అవసరం. రాబోయే సార్వత్రక ఎన్నికలలో బీజేపీ మూడోసారి విజయం సాధిస్తే కేంద్రం–బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణలు కొనసాగడమే కాదు, మరింతగా తీవ్రమవుతాయి. ఇది మన రిపబ్లిక్ భవిష్యత్తుకు ఎంతమాత్రం మంచిదికాదు.

నిరంతర నిప్పుకణిక –ఈశ్వరీబాయి

"హరించివేయబడ్డ హక్కుల్ని బిక్షమెత్తి గాని, ప్రాధేయపడి గాని సాధించలేం. అలుపెరుగని పోరాటాల ద్వారానే సాధించగలం" అని భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేడ్కర్ చెప్పిన మాటల్ని నరనరాన జీర్ణించుకొని అంటరాని జాతులు, అణగారిన జాతులు యాచించేలా కాదు, శాసించేలా ఎదగాలని ఎలుగెత్తి చాటిన నాయకురాలు ఈశ్వరీబాయి. చెప్పడమే కాదు ఆచరణలో చూపించిన గొప్ప వ్యక్తి. ఆఖరి శ్వాస వరకు అంబేడ్కరిజాన్నే ఆయువుగా చేసుకొని అసామాన్యమైన నాయకురాలిగా ఎదిగిన మహోన్నత మహిళామూర్తి.

తెలుగు నేలపై 20వ శతాబ్దంలో జరిగిన ఆత్మగౌరవ పోరాటాలను, సామాజిక, రాజకీయ ఉద్యమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆమె అన్ని ఉద్యమాల్లో భాగస్వామ్యమయ్యారు. ఆ శతాబ్దంలో తాడిత, పీడిత, అంటరాని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన ముఖ్యుల్లో ముందు వరుసలో ఉండే అతి కొద్ది మంది నాయకుల్లో ఈశ్వరీబాయి ఒకరు. ఆమె తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, మరాఠీ భాషలలో ప్రావీణ్యం కలిగి ఉండడం వల్ల దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను వార్తాపత్రికల ద్వారా తెలుసుకునేవారు. ఆ ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు.



తెలుగు నేలపై మొట్టమొదటిసారిగా దళిత ఉద్యమానికి పునాదులు వేసి, ఆది భారతీయ, ఆది హిందూ, ఆది ద్రవిడ ఉద్యమ నిర్మాత, తెలంగాణ వైతాళికుడు, బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి బాలికల విద్యకు బాటలు వేసిన మాదరి భాగ్యరెడ్డి వర్మ ప్రభావం ఈశ్వరీబాయిపై స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన స్ఫూర్తితోనే ఆమె ఉద్యమాల్లో ఉవ్వెత్తున పాల్గొన్నారు. అనంతరం అంటరాని జాతుల విముక్తి ప్రదాత అంబేడ్కర్ అణగారిన జాతుల హక్కుల కోసం, మనిషి మౌలిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం కోసం, మనిషిని మనిషిగా చూడని మనుస్మృతికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా చేస్తున్న సామాజిక-, ఆర్థిక-, రాజకీయ-, సాంస్కృతిక ఉద్యమంలో ఉవ్వెత్తున పాల్గొన్నారు.

ఇవాళ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు, స్త్రీలు విద్య–ఉద్యోగాల్లో ఎంతో కొంత పురోగతి సాధించారు. సమాజంపై అవగాహన కలిగి, సామాజిక చైతన్యంతో ఉన్నారు. సోషల్ మీడియా ప్రభావం కూడా ఉంది. డబ్బులు ఖర్చు పెట్టేంత ఆర్థిక స్థోమత కలిగి ఉన్నా కూడా బహుజన నినాదంతో, రిపబ్లికన్ నినాదంతో పని చేస్తున్న అనేక పార్టీలు, వాటి నాయకులు కనీసం గ్రామ స్థాయిలో సర్పంచిగా కూడా గెలిచే పరిస్థితి లేదు. కానీ 1951లోనే అంటే దాదాపు 75 సంవత్సరాల క్రితమే హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పురపాలక సంఘం ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయరంగ ప్రవేశం చేసి ఈశ్వరీబాయి జయకేతనం ఎగురవేసింది. అక్కడితో ఆగిపోకుండా 1957లో బి.ఆర్. అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి 1967, 1972లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికవడం అసాధారణ విషయం. ఎన్నికల్లో అంబేడ్కర్ సిద్ధాంతం ఓట్లు రాల్చదు అనే అపనమ్మకంతో, నిరాశా, నిస్పృహలతో సహచర ఉద్యమకారులందరూ నిరుత్సాహపడుతున్నా, రాష్ట్రంతో పాటు దేశమంతా కాంగ్రెస్ గాలి వీస్తున్నా, తన వెంట మందీమార్బలం లేకున్నా, ఒంటరిగా ఎదురొడ్డి నిలబడి ఆమె సాధించిన విజయం చరిత్రాత్మకమైనది. ఒక నాయకురాలి మీద ఎంత విశ్వాసం ఉంటే జనం రెండుసార్లు తమ ప్రతినిధిగా ఆమెను అసెంబ్లీకి పంపించారనేది అర్థం చేసుకోవచ్చు.

1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ఆమె పాత్ర వెలకట్టలేనిది. ఆ ఉద్యమంలో పాల్గొన్న నాయకులంతా పదవులకు ఆశపడి ఉద్యమాన్ని వీడినా ఆమె ఉద్యమంలో ముందుకే సాగింది కానీ పదవుల కోసం పాకులాడలేదు. నిఖార్సైన తెలంగాణ ఉద్యమ నాయకురాలికి నిర్వచనంగా నిలిచిన ఆమెను నిజమైన తెలంగాణ తల్లిగా అభివర్ణించవచ్చు. బయట క్షేత్రస్థాయిలో జనం కోసం ఎంత పోరాటం చేసిందో అదే స్థాయిలో అసెంబ్లీలో కూడా నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల హక్కులు, అభ్యున్నతికి సంబంధించిన చర్చలు లేవనెత్తిన గ్రేట్ పార్లమెంటేరియన్ ఈశ్వరీబాయి. అసెంబ్లీలో ఆమె ప్రతిపక్ష నాయకురాలిగా నిర్వహించిన పాత్ర ప్రశంసనీయం. శాసనసభ సమావేశాల్లో దున్నేవారికే భూమి ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కార్మికులకు బంజరు భూములు కేటాయించి పట్టాలు అందించాలని, వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేసేవారు. బౌద్ధమతాన్ని స్వీకరించిన షెడ్యూల్డు కులాల వారికి సకల సౌకర్యాలు, రాయితీలు ఇవ్వాలనేవారు. ఇతర షెడ్యూల్డ్ కులాల వారితో వారికి సమానమైన మినహాయింపులు ఇవ్వాలని సలహాలిచ్చేవారు. మురికివాడలను నిర్మూలించి అక్కడ నివసించే మట్టి మనుషులకు నివాసయోగ్యమైన గృహాలు నిర్మించాలని పట్టుబట్టేవారు. బలహీన వర్గాలు, కార్మికులు, ఇతర నిరుపేద ప్రజలకు నిత్యావసర వస్తువులు ముఖ్యంగా ఆహారధాన్యాలు చౌక ధరలకు ఇవ్వాలని పట్టుబట్టేవారు. అస్పృశ్యతా నివారణా చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచి అస్పృశ్యతను పాటించేవారిపై చట్టప్రకారం శిక్షలు విధించాలని ఆమె డిమాండు చేసేవారు.

స్త్రీవిద్య, స్త్రీల అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, చేనేత కార్మికుల కష్టాల గురించి, జైళ్లలో అన్యాయంగా మగ్గిపోతున్న ఖైదీల గురించి, కార్మికుల సంక్షేమం, దళితులపై దాడులు, అత్యాచారాలు, మద్యపాన నిషేధం, మహిళా భద్రత వంటి అనేక సమస్యలను అసెంబ్లీలో చర్చకు తీసుకువచ్చి, పాలకులతో పట్టుబట్టి పరిష్కారం వచ్చే వరకు కలబడి నిలబడిన నిప్పుకణిక ఈశ్వరీబాయి. ప్రజా సంక్షేమమే పరమావధిగా జీవించి, తాడిత పీడితుల గొంతుకగా మారి హక్కుల కోసం నినదించి 1990 ఫిబ్రవరి 24న మహా పరినిర్వాణం చెందారు.

ఎవరి సహాయం లేకుండా ఆమె ఒక్కరే ఎంత రాత్రి అయినా, ఎంత దూరమైనా భయమన్నది లేకుండా ఒక కర్రను, కారంపొడిని తనతో తీసుకెళ్తూ ధైర్యంగా తిరిగేది. ఆమె నుండి నేటి మహిళలు స్ఫూర్తి పొందాలి. అందుకు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెట్టి "ఈశ్వరీబాయి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం"గా మార్చాలి. తెలంగాణ కోసం తెగించి కొట్లాడడమే కాకుండా, మహిళల్లో ధైర్యాన్ని నింపిన ఆమె ధైర్య సాహసాలకు గుర్తింపు దక్కినట్టు ఉంటుంది.

భారతీయ సమాజంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకుపోయిన వివక్షత, అంటరానితనం, అసమానతలు, అణిచివేతలు, అవమానాలకు వ్యతిరేకంగా తాడిత పీడిత ప్రజలు కొనసాగించే ప్రతి పోరాటంలో స్ఫూర్తిని రగిలించడానికి నిరంతరం మండే నిప్పు నిప్పుకణిక ఈశ్వరీబాయి. 35వ వర్ధంతి సందర్భంగా ఆమెకి నీలిపూల జోహార్లు.

■ --మంచాల లింగస్వామి
అధ్యాపకులు, ఉస్మానియా యూనివర్సిటీ

(నేడు ఈశ్వరీబాయి వర్ధంతి)

ఆత్మగౌరవ పతాక 'తెరవే'

రెండు దశాబ్దాలకు పైగా తెలంగాణ రచయితల వేదిక(తెరవే) తనదైన ఆత్మగౌరవ శైలిలో ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో సాహిత్య రంగంలో పనిచేస్తున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక రాష్ట్ర మహాసభలు, జిల్లా సమావేశాలు నిర్వహిస్తూ కవులు, రచయితలు, ప్రజలలో తెలంగాణ ప్రజాసాహిత్యాల స్ఫూర్తినీ కీర్తినీ పరివ్యాప్తం చేసింది. బావుటాగా ధరించి వినువీధుల్లో ఎగరవేసింది. తెరవే తన కార్యకలాపాలను విశేషంగా విస్తరిస్తున్న క్రమంలో అందులో పనిచేస్తున్న అనేకమంది కొత్త యువ కవులకు, సరికొత్త గాయకులకు తెలంగాణ సోయిని, భాషా సాహిత్య మూలాల పట్ల తెలివిడిని కలగజేసింది. వలసిన స్ఫూర్తిని అందించింది. కూడా వెంట తీసుకురాగలిగింది. ఒక దశలో తెలంగాణలో ప్రత్యామ్నాయ సాహిత్య వాతావరణాన్ని తన ప్రయాణంలో సృష్టించగలిగింది.



తెరవే ప్రస్థానంలో నాటి తెలంగాణ ఉద్యమ అవసరాల మేరకు అఖిల భారత తెలంగాణ రచయితల వేదికను నిర్మాణం చేసింది. రెండు మహాసభలు కూడా నిర్వహించింది. ఒక హిందీ కవితల అనువాద పుస్తకం ప్రచురించింది. కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని ముందు తీసుకు వస్తున్నాను. భారతదేశ వ్యాప్తంగా తెలంగాణ కవులు, రచయితలను టార్చ్‌లైట్ వేసి వెతికితే చాలా ఆశ్చర్యకరమైన విషయాలు అవగతమైనాయి. ఒక్క బాంబేలో కొంతమంది కార్మికవర్గం నుంచి ఎదిగొచ్చిన సాహిత్యకారులు కనబడ్డారు. ఎందుకు ఈ పరిస్థితి అని కార్య కారణాలను వెతికేసరికి తెలంగాణ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు, గల్ఫ్ దేశాలకు ఎక్కువగా కూలీల వలసలే ఉన్నాయి. కానీ మేధోపరమైన వలసలు చెప్పుకోదగ్గవి లేవు. అందువలన అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక కార్యక్రమాలు తీసుకోలేకపోయింది. విస్తరించలేకపోయింది. అయినా ఇక ముందు అఖిల భారత తెలంగాణ రచయితల వేదికను కొనసాగించాలంటే తెలంగాణలోనే విశ్వవిద్యాలయాల హిందీ, ఇంగ్లీష్ విభాగాల అధ్యాపకులనే కాక, ఇతర ప్రాంతంలోని ఇంగ్లీష్, హిందీ ఇతర ప్రాంతీయ భాషల అనువాదకులను సంస్థలో చేర్చుకోవాలి. తెలంగాణ సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి తీసుకుపోయేలా కృషిని వేగవంతం చేయాలి.


2008 ప్రారంభంలో పోలవరంలో మునిగిపోనున్న ప్రదేశాలలో పర్యటించింది. అప్పుడు బొమ్మలమ్మ గుట్ట గ్రానైట్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. దానికి వ్యతిరేకంగా తెరవే బొమ్మలమ్మ గుట్ట మీద జినవల్లభుడి కంద పద్యాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెరవే సభను ఏర్పాటుచేసి ప్రాచీన తెలుగు సాహిత్య చారిత్రక సంపద రక్షణ కోసం తన గొంతును వినిపించి, ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది. తద్వారా ఆ ప్రతిపాదనను ప్రాథమిక స్థాయిలోనే విరమించుకునేటట్లు చేసింది. మిడ్ మానేరు నిర్మాణమవుతున్నప్పుడు కట్టపైన నిర్వహించిన ముంపు గ్రామాల అధ్యయన పర్యటన సందర్భంగా తెరవే నిర్వహించిన సభ మైలురాయిగా నిలిచింది. అంతేగాక ఉమ్మడి కరీంనగర్ జిల్లా చందుర్తి మండలంలోని రుద్రంగి గ్రామంలో గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉండటంతో ఆ గ్రామాన్ని సందర్శించి, ఆయా కుటుంబాలతో ముఖాముఖి ఏర్పాటు చేసి వారి బాధలలో తెరవే ఒక భాగమైంది. జయధీర్ తిరుమల్ రావు అధ్యక్షతన తెరవే యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని చెంచుల పెంటలలో, ఆదివాసీ ప్రాంతాల పర్యటన చేసి, తనదైన గొంతుతో వ్యతిరేకతను వినిపించింది. తెలంగాణ చారిత్రక సాంస్కృతిక సంపదకు జీవన చిహ్నమైన రామప్ప పరిరక్షణ కోసం పర్యటించి, అక్కడ ఒక సభ నిర్వహించి తెరవే తనవంతుగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయింది.

ఇకపోతే తెరవే ప్రారంభం నుంచి 'సోయి' పేరున దాదాపు పది వరకు బులెటిన్లను తీసుకువచ్చి సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఇతోధికంగా కృషిచేసింది. ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక పత్రికను సజావుగా నడపలేకపోయింది. ఇప్పుడు ఉన్న తెరవే కార్యవర్గం భుజస్కంధాలపై తనదైన వ్యక్తిత్వాన్ని, చలనశీలతను ప్రజల వైపు నిలబడినతనాన్ని గుర్తు పెట్టుకొని ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఉంది. అంతేగాక అచ్చు పత్రికలు తీసుకురావడం వ్యయంతో కూడిన పని, కాబట్టి నెలనెలా ఒక డిజిటల్ సాహిత్య సాంస్కృతిక పత్రిక తీసుకురావాల్సిన అవసరం ఉన్నది.

తెలంగాణ వచ్చే వరకు తెరవేకు ఎంత బాధ్యత అయితే ఉందో, తెలంగాణ వచ్చిన తర్వాత అంతకు రెట్టింపు కర్తవ్యపూరితమైన బాధ్యత ఉంది. గత కార్యవర్గాలు తొవ్వ వేసిన దిశలో తన ప్రస్థానాన్ని నిరంతరంగా, నిర్భయంగా, ప్రత్యేకమైన శైలితో ప్రజల పక్షం వహిస్తూ ముందుకు సాగాలని బాధ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

– జూకంటి జగన్నాథం, తెరవే పూర్వ అధ్యక్షులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హైదరాబాద్
నగర వార్తలు
3
శనివారం 24 ఫిబ్రవరి 2024



శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7 కనిష్ఠం 21.2

గత రెండేళ్లలో (2022, 2023) ట్రై కమిషనరేట్ల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

కమిషనరేట్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
హైదరాబాద్	4476	555	3921
సైబరాబాద్	6378	1499	6276
రాచకొండ	6845	1387	6610
మొత్తం	17699	3441	16807


లాస్యనందిత అంతిమయాత్రలో జనం

అంతలోనే..

మొన్న ప్రచార ర్యాలీ.. నేడు అంతిమయాత్ర

- విషాదం నింపిన ఎమ్మెల్యే లాస్యనందిత మృతి
- ఎన్నికైన మూడు నెలల్లోపే కానరాని లోకాలకు..
- కన్నీరుమున్నీరుగా విలపించిన కంటోన్మెంట్ వాసులు
- సాయన్న కుటుంబానికి నగరంతో నాలుగు దశాబ్దాల అనుబంధం
- సంతాపం ప్రకటించిన స్పీకర్, ఎమ్మెల్యేలు, మంత్రులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 37 యేళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపు. అంతలోనే విధి వక్రించింది. తండ్రి ఆశయాల సాధనకు.. ఆయన చూపిన రాజకీయ మార్గంలో సాగుతున్న ఆమె పయనం అర్ధాంతరంగా ముగిసింది. ఔటర్ రింగ్ రోడ్డుపై కారు ప్రమాదం రూపంలో యువ ఎమ్మెల్యే లాస్యనందితను మృత్యువు కబళించింది. ఈ దుర్ఘటన విషయం తెలిసి శుక్రవారం తెల్లవారుఝామున నగరం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మూడు నెలల క్రితం ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న విషయం తెలిసి సిటీజనులు షాక్‌కు గురయ్యారు. యేడాది క్రితం మాజీ ఎమ్మెల్యే సాయన్న అకాల మరణాన్ని మరవక ముందే అదే కుటుంబానికి చెందిన ఆడపడుచు అనంతలోకాలకు చేరుకోవడం పలువురిని కంటతడి పెట్టించింది.

నవంబర్‌లో తనకు ఓటు వేసి గెలిపించాలని కంటోన్మెంట్ ప్రాంతాల్లో పర్యటించిన లాస్య.. విగతజీవిగా అదే ప్రాంతానికి రావడం చూసి స్థానికులు బోరున విలపించారు. నాడు నాయకులు, కార్యకర్తలతో ప్రచార ర్యాలీలు నిర్వహించిన ఆమె అంతిమయాత్ర అక్కడి రోడ్లపై సాగుతుండడం చూసిన ప్రజలు తట్టుకోలేకపోయారు. అయ్యో.. నీకు ఎట్లా న్యాయమైతది దేవుడా అంటూ కొందరు మహిళలు కంటికి ధారలా విలపించారు. ఎన్నుకున్న మూడు నెలలకు ఎమ్మెల్యే దూరమవడం ఆమె అనుచరులు, స్థానికులు తట్టుకోలేకపోయారు.

తండ్రి తరహాలోనే ప్రజల్లోకి..

మహానగర రాజకీయాల్లో దివంగత సాయన్న కుటుంబానిది ప్రత్యేక స్థానం. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సాయన్న నగర రాజకీయాల్లో కొనసాగారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, నగర టీడీపీ అధ్యక్షుడిగా పని చేసిన ఆయనకు అన్ని నియోజకవర్గాల్లోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలతో సత్సంబంధాలున్నాయి. జిల్లాలోని ఏకైక రిజర్వ్‌డ్ (ఎస్సీ) నియోజకవర్గం నుంచి ఐదు సార్లు శాసన సభ్యుడిగా గెలిచి రికార్డు సృష్టించారు. టీడీపీ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయన 2009లో మాజీ మంత్రి శంకర్‌రావు

మిగతా 6వ పేజీలో..

ప్రమాదం జరిగినప్పటి నుంచి అంత్యక్రియలు ముగిసే వరకు..

సమయం	ఘటన
5:10	ఔటర్‌పై రోడ్డు ప్రమాదం
5:15	ఫోన్ ద్వారా ప్రమాద వార్త కుటుంబ సభ్యులకు తెలిపిన పీఏ ఆకాష్
6:00	ఘటనా స్థలానికి చేరుకున్న పటాన్‌చెరు పోలీసులు
6:30	గాయాలతో ఉన్న ఆకాష్ ఆసుపత్రికి తరలింపు
7:00	లాస్య నందిత మృతదేహాన్ని పటాన్‌చెరు ఆసుపత్రికి తరలింపు
10:50	పటాన్‌చెరు నుంచి లాస్యనందిత డెడ్‌బాడీని గాంధీ మార్చురీకి తరలింపు
10:55	గాంధీకి చేరుకున్న హరీశ్‌రావు, తలసాని, పల్లారాజేశ్వరరెడ్డి, మంత్రి కోమటిరెడ్డి
11:30	పోస్టుమార్టం పూర్తి
11:45	కార్ఖానా గృహలక్ష్మి కాలనీలోని నివాసానికి చేరుకున్న మృతదేహం
13:20	మాజీ సీఎం కేసీఆర్ రాక, భౌతికకాయానికి నివాళి
17:08	లాస్యనందిత పార్థివ దేహానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళి
17:20	అంతిమయాత్ర ప్రారంభం
18:40	మారేడుపల్లి శ్మశానవాటికకు చేరుకున్న మృతదేహం
19:10	ప్రభుత్వ లాంచనాల్లో భాగంగా గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు
19:27	చితికి నిప్పంటించిన సోదరుడు (పిన్ని కొడుకు) పీయూష్ రాఘవ్

అతివేగం.. నిర్లక్ష్యం.. మద్యం మత్తు



ప్రమాదాలకు కారణాలివే..

- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- రెండేళ్లలో ట్రై కమిషనరేట్‌లలో 3,441 మంది మృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటా రోడ్డు ప్రమాదాల బారినపడి వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని వేల మంది క్షతగాత్రులు దివ్యాంగులుగా మారి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి పోలీసులు, ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల్లో మార్పు రావడంలేదు. పోలీస్ ఉన్నతాధికారులు రహదారి భద్రతకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటిస్తున్నా.. ఆ దిశగా ప్రయత్నాలు జరగడంలేదు. దానికి తోడు వాహనదారుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ అమాయకుల పాలిట శాపంగా మారుతోంది. శుక్రవారం తెల్లవారుజామున పటాన్‌చెరు సమీపంలో ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డుప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం చెందడంతో నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ నిద్రమత్తులో నిర్లక్ష్యంగా కారు నడిపినందువల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

రెండేళ్లలో 3,441 మంది మృత్యువాత..

గత రెండేళ్లలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 17,699 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 3,441 మంది మృతి చెందారు. 16,807 మంది గాయాలపాలయ్యారు. వారిలో వందలాది మంది దివ్యాంగులుగా మారి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. అధిక శాతం ప్రమాదాలు డ్రంకెన్ డ్రైవింగ్, అతివేగం, మైనర్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగినట్లు పోలీసులు తేల్చారు.

ఓఆర్ఆర్‌పై నిర్లక్ష్యం..

నగర రోడ్లపై ట్రాఫిక్‌తో విసిగిపోయిన కొంతమంది వాహనదారులు ఓఆర్ఆర్ ఎక్కగానే డ్రైవింగ్‌లో తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. అతిపెద్ద రోడ్లు విశాలంగా ఉండటం, ట్రాఫిక్ సమస్య అసలే లేకపోవడంతో ఓవర్ స్పీడుతో దూసుకుపోతున్నారు. లారీలు, భారీ వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఉంచడం వాహనదారుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. రోడ్లపై లైటింగ్ సరిగా విస్తరించకపోవడంతో ఆగి ఉన్న వాహనాలను గుర్తించక లేక ఢీ కొంటున్నాయి. దాంతో జాతీయ రహదారులు, ఓఆర్ఆర్ సహా చాలా రోడ్లు రక్తమోడుతున్నాయి. వాహనాలు ఏదైనా మరమ్మతులకు గురైనప్పుడు లేక ఇతర అవసరాల కోసమైనా రోడ్డు మీద నిలిపేటప్పుడు చాలా మంది డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. వెనకాల వచ్చే వాహనాలు గుర్తించేలా ఎల్లో సిగ్నల్స్‌ను, రెడ్ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం లేదు. కనీసం ఆగిపోయిన వాహనాన్ని గుర్తించేలా చెట్లకొమ్మలు కూడా ఏర్పాటు చేయడంలేదు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనం కింద పడుకొని కొంతమంది మెకానిక్‌లు, డ్రైవర్లు మరమ్మతు పనులు చేస్తుంటారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు వారుసైతం మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా రాచకొండ, సైబరాబాద్ ఉన్నతాధికారులు స్పందించి ఓఆర్ఆర్, జాతీయ రహదారుల పైన, ఓఆర్ఆర్ నుంచి కనెక్టివిటీ ఉన్న రోడ్ల చుట్టుపక్కల లారీలు, భారీ వాహనాలు నిలుపకుండా చూడాల్సిన అవసరముంది.

స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల సంతాపం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతిపట్ల స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మూడు నెలలు నిండకుండానే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. లాస్యనందిత మృతిపట్ల మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేష్‌కుమార్ గౌడ్, జగ్గారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి. నిరంజన్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. లాస్యనందిత మరణం బాధకరమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.


లాస్యనందిత భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, సబితారెడ్డి, మల్లారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, దేవీప్రసాద్

వేగ నియంత్రణలు బేఖాతరు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అతివేగాన్ని కట్టడి చేసేలా పోలీసులు వేగ నియంత్రణలను రూపొందించారు. ఓఆర్ఆర్‌పై ఉండే లేన్ 1, 2 (లైట్ మోటార్ వెహికల్స్)లో కనిష్ఠ వేగం గంటకు 80కి.మీ., గరిష్ఠం 120 కి.మీ. లేన్ 3, 4 (భారీ వాహనాలు నడిచే మార్గం)లో కనిష్ఠ వేగం గంటకు 40 కి.మీ., గరిష్ఠం గంటకు 80కి.మీ. గా పోలీసులు నిర్ధారించారు. నగరం లోపలి రహదారులపై కనిష్ఠ వేగం గంటకు 30కి.మీ., గరిష్ఠ వేగం గంటకు 50 కి.మీ.లుగా నిర్ణయించారు. అయితే, చాలామంది వాహనదారులు పోలీసులు నిర్ధారించిన వేగ నియంత్రణ నియమాలను పట్టించుకోకుండా అతివేగంతో వెళ్తుండడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఓఆర్ఆర్‌పై అతివేగంతో దూసుకెళ్తున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారులు ఏ మాత్రం లెక్కచేయని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రమాదాల్లో ప్రముఖుల కుటుంబీకులు

- 2003 అక్టోబర్ 13న ప్రముఖ సినీ నటుడు బాబుమోహన్ కుమారుడు పవన్‌కుమార్ (26) బైక్‌పై వస్తూ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలో డివైడర్ ఢీకొని మృతిచెందారు.
- 2010 జూన్ 1న ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు తనయుడు కోట ప్రసాద్ (39) తన 1000 సీసీ బైక్‌పై వెళ్తూ.. ఏపీ పోలీసు అకాడమీ (ప్రస్తుత అప్పా జంక్షన్) వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనాన్ని ఢీకొని మరణించారు.
- 2011 సెప్టెంబర్ 16న మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కుమారుడు అయాజుద్దీన్ (19) తన 1000 సీసీ బైక్‌పై ఔటర్ మార్గంలో వేగంగా వెళ్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. 5 రోజులపాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరకు తుదిశ్వాస విడిచాడు.
- 2011 డిసెంబర్ 20న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనయుడు ప్రతీక్‌రెడ్డి (19) నార్సింగ్-పటాన్‌చెరు మార్గమధ్యలో, కొల్లూరు గ్రామ పరిధిలో జరిగిన కారు ప్రమాదంలో మృతిచెందాడు.
- 2017 మే 10న నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణ కుమారుడు నిషిత్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి మాదాపూర్‌కు బెంజ్‌కారులో వెళ్తూ ప్రమాదవశాత్తు మెట్రో పిల్లర్‌ను ఢీకొని మృతిచెందాడు.
- 2017 జూన్ 25న ప్రముఖ సినీనటుడు రవితేజ సోదరుడు భరత్‌రాజ్ (45) ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దాదాపు 150 కిలోమీటర్ల స్పీడుతో దూసుకెళ్తున్న ఆయన కారు రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనక నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. డ్రైవింగ్ సీటులో ఉన్న భరత్ అక్కడికక్కడే మృతిచెందాడు.

సేఫ్టీ ఫీచర్లపై అవగాహన లేకనే..

కార్లలో ప్రయాణించేవారు తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారి భద్రతకు ప్రభుత్వం ఇటీవలి కాలంలో అసాధారణ ప్రాధాన్యం ఇస్తుండటంతో పాటుగా నియమాలను కఠినతరం చేయడంతో కార్ల కంపెనీలు ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్ లాంటివి తెరపైకి తెచ్చారు. అయినప్పటికీ, ప్రజల్లో వాటిపై అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. ఫీచర్ల గురించి తెలిసినా నిర్లక్ష్యం వహించడం వల్ల కూడా మృత్యువాత పడుతున్నారన్నది ఆటో మేకర్ల భావన. చాలామంది కారు కొనుగోలు సమయంలో భద్రత కంటే మైలేజీకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చని పేర్కొంటున్నారు.

భద్రతకు ప్రాధాన్యం తక్కువే..

కారు కొనుగోలు సమయంలో తొలుత బడ్జెట్, బ్రాండ్, మైలేజీ, సౌకర్యం, లెగ్ రూమ్, బూట్ స్పేస్, ఆడియో సిస్టమ్, రూఫ్‌టాప్, ఫ్యామిలీకి సరిపోతుందా అంటూ చూసుకుని చివరి ప్రయారిటీగా ఎయిర్‌బ్యాగ్స్, ఏబీఎస్ లాంటి ఫీచర్ల గురించి ఆలోచిస్తారు. మిగిలిన అంశాలకు ప్రాధాన్యం తక్కువే ఇస్తుంటారు.

- ఆటోమొబైల్ డీలర్ల మాట

సీట్‌బెల్ట్ విధిగా ధరించాలి..

ప్రతి కారులోనూ సీట్ బెల్టులు ఉంటాయి. ముందు కూర్చున్న వారు మాత్రమే సీటు బెల్టులు ధరిస్తారు. అది కూడా పోలీసులను చూసో లేదంటే కాస్త అవగాహన కలిగో. వెనుక సీట్లలో కూర్చున్న వారు మాత్రం అసలు సీటు బెల్టు ఊసే ఎత్తరు. నిజానికి వీరి వల్లే ముందున్న వారికి కూడా ప్రమాదమే. ఎందుకంటే, ప్రమాదం జరిగినప్పుడు వీరు ముందుకు పడి ప్రమాద తీవ్రత పెరుగుతుంది.

- హై ఎండ్ కార్ డీలర్ ప్రతినిధి

భద్రతా పరంగా చూడాల్సిన అంశాలు..

ఎయిర్‌బ్యాగ్‌లు: ప్రమాదం జరిగినప్పుడు ఆటోమేటిక్‌గా తెరుచుకునే ఎయిర్ బ్యాగ్‌ల వల్ల ప్రాణాపాయ పరిస్థితిని కొంత మేరకు నివారించవచ్చు. ఎక్కువ ఎయిర్ బ్యాగ్‌లు, ఎక్కువ రక్షణ అని నమ్మొచ్చు.

ఏబీఎస్ (యాంటీ బ్రేకింగ్ సిస్టమ్): స్కిడ్డింగ్‌ను నివారించే ఈ ఫీచర్‌తో చాలా వరకూ ప్రమాదాలను నివారించవచ్చు. అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా ఏదైనా వచ్చినప్పుడు బ్రేక్ వేసే సమయంలో స్కిడ్ కాకుండా కాపాడుతుంది.

ఈబీడీ (ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్): ఏబీఎస్‌కు ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్‌గా చెప్పొచ్చు. కారులో ప్రతి చక్రమూ తగినంతగా ఫోర్స్ అందుకునేలా ఇది తోడ్పడుతుంది. దీనిలో స్పీడ్ సెన్సార్లు, ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్, బ్రేక్ ఫోర్స్ మాడ్యులేటర్లు

మిగతా 6వ పేజీలో..

కంటోన్మెంట్ ఉప ఎన్నికపై చర్చ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సభ్యులెవరైనా మరణిస్తే ఆరు నెలల్లోపు ఉప ఎన్నిక నిర్వహించాలని నిబంధన ఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మరో 15 రోజుల్లో వెలువడనున్నదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వాటితోపాటే కంటోన్మెంట్ ఉపఎన్నిక నిర్వహణ సాధ్యమా, కాదా.. అనే విషయమై స్థానికంగా తర్జనభర్జనలు పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈపాటికే అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించిన సంగతి విదితమే. ఇప్పటికిప్పుడే అసెంబ్లీ స్పీకర్ నుంచి రాష్ట్ర సీఈఓకు కంటోన్మెంట్ సీటు ఖాళీ అయ్యిందంటూ అధికారికంగా సమాచారం పంపడం, అక్కడి నుంచి కేంద్ర ఎన్నికల కార్యాలయానికి ఈ సమాచారం అందవలసి ఉంటుందని తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తయితే లోక్‌సభ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉపఎన్నిక సాధ్యమవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సంబంధించి ప్రత్యేక షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆవేదన కలిగిస్తోంది..

తండ్రి మృతి చెందిన ఏడాదిలోనే కుమార్తె మృతి చెందడం ఆవేదన కలిగిస్తోంది. ఆ కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బాధగా ఉంది..

ఎంతో భవిష్యత్ ఉన్న ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మికంగా మృతి చెందగా బాధగా ఉంది. ఆమె మరణం తనను ఆవేదనకు గురిచేసింది.

-తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి

ఎంతో భవిష్యత్ ఉన్న అమ్మాయి..



సాయన్న వారసురాలిగా రాజకీయాల్లో రాణిస్తుందని అనుకున్నా. ఎంతో భవిష్యత్ ఉన్న లాస్య నందిత అకాల మరణం బాధగా ఉంది. ఈ సంఘటన ఆవేదన కలిగిస్తోంది.

- డాక్టర్ శంకర్‌రావు, మాజీ మంత్రి

విచారకరం

ఎంతో భవిష్యత్ ఉన్న కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే మరణం కలిచివేసింది. లాస్య తండ్రి సాయన్నతో తనకు మంచి అనుబంధం ఉంది. యేడాది వ్యవధిలో తండ్రి, కుమార్తె మరణించడం ఆ కుటుంబానిక తీరని లోటు. లాస్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి.

- అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే

పార్టీ చేసుకుందామని అనుకున్నాం.. ఇంతలోనే



చిన్నప్పటి నుంచి ఇద్దరి మంచి స్నేహితులం. సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 4 నుంచి 10వ తరగతి వరకు క్లాస్‌మేట్. లాస్య నందిత ఎమ్మెల్యేగా గెలవడంతో శుభాకాంక్షలు చెప్పాను. పార్టీ చేసుకుందామని అనుకున్నాం. కాల్ చేస్తే.. మొదటిసారి గెలిచాను కదా.. కలుద్దాములే అని చెప్పింది.

- కావ్య, కడియం శ్రీహరి కుమార్తె

ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి..

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి విషాదాన్ని నింపింది. భవిష్యత్ ఉన్న యువ నాయకురాలు చిన్న వయస్సులో మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

-మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

సింక్రోనీలో ముగిసిన

రోబోటిక్ హ్యాకథాన్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సోహమ్ అకాడమీతో కలిసి ప్రీమియర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీకి చెందిన సిటిజన్‌షిప్ టీమ్ మాదాపూర్‌లోని సింక్రోని కంపెనీలో నిర్వహించిన రోబోటిక్స్ హ్యాకథాన్ ముగిసింది. హైదరాబాద్‌తోపాటుగా చుట్టుపక్కల జిల్లాల్లోని 10 పాఠశాలలకు చెందిన 7-8 తరగతుల విద్యార్థులు 30 మంది ఈ హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. సంప్రదాయ స్కూల్ ప్రాజెక్టులకు భిన్నంగా జరిగిన ఈ హ్యాకథాన్‌లో 3డీ ప్రింటెడ్ కంపోనెంట్స్ డిజైన్ సాంకేతికతలను విద్యార్థులు ఉపయోగించే అవకాశం కల్పించారు. డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ ఉత్తర కుమారి, జేఎన్‌టీయూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఫణిశ్రీ, సింక్రోనీ టెక్నాలజీ టీమ్‌కు చెందిన ప్రశాంత్ తివారీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి హ్యాకథాన్ విజేతలను ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జానంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ పిల్లలు సాంకేతికతతో వాస్తవ ప్రపంచంలో ఏ విధంగా మార్పు తీసుకురాగలరో హ్యాకథాన్ చూపిందని సింక్రోనీ వైస్‌ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ కామేశ్వరి గంగాధరభట్ల అన్నారు.

దేశంలోనే మొదటి ఆన్‌లైన్

మిషన్ టూల్స్ ఎక్స్‌పో

26న ప్రారంభించనున్న ఎస్ఎంబీఎక్స్ఎల్



సీఓఓ ప్రీతి ఉబాలే

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిన్న, సూక్ష్మ సంస్థల అభివృద్ధికి సహకారంలో భాగంగా దేశంలోనే తొలిసారిగా ఆన్‌లైన్ మిషన్ టూల్స్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్నామని ఎస్ఎంబీఎక్స్ఎల్(స్మాల్ అండ్ మీడియం బిజినెస్ ఎక్సలెన్స్) సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) ప్రీతి ఉబాలే తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా నిర్వహించే ఈ ఎక్స్‌పో ఈనెల 26 నుంచి మార్చి 10 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 1200 సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయన్నారు. కటింగ్, ఫార్మింగ్, త్రెడ్ కటింగ్, వెల్డింగ్, టర్నింగ్, లేత్, సీఎన్‌సీ మిల్లింగ్, 3డీ ప్రింటింగ్, డ్రిల్లింగ్, బ్రోచింగ్, రోబోటిక్ టూల్స్ తదితర ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల నిర్వాహకులు తమకు అవసరమైన మిషన్ టూల్స్‌ను ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసుకోవచ్చన్నారు. దీనికోసం ఎలాంటి నిర్వహణ రుసుమూ తీసుకోవడం లేదని, ఆసక్తి ఉన్న సంస్థల నిర్వాహకులు మార్కెట్ సెంట్రల్ సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కోసం www.marketcentral.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలపై విచారణ ఏదీ ?

కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం: మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై సీబీఐ విచారణ చేయిస్తానన్న రేవంత్ రెడ్డి, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి మూడు నెలలు కావస్తున్నా ఎందుకు జాప్యం చేస్తున్నారని, సీబీఐ విచారణ ఏదీ అని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. నాలుగో రోజు బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర విజయవంతంపై రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలోని కాటేదాన్‌లోని టీఎల్ఎం గార్డెన్స్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై వారు విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి, మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని వారన్నారు. ప్రస్తుత సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఈసారి విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలుపించుకోవాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రజలు అవినీతి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాల మీద, కుంబకోణాల మీద సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి గత ప్రభుత్వంలో చేసిన అన్యాయాలు, అక్రమాలు, కబ్జాలు అన్ని ఆధారాలతో సహ నిరూపిస్తామన్నారు. 'షేక్‌పేట్‌లో నాలుగు ఎకరాల్లో గుడిని కూలగొట్టి దేవుడి భూములను కూడా వదలని నువ్వు.. విశ్వేశ్వర్‌రెడ్డి మీద బురద చల్లడం హాస్యాస్పదమని అన్నారు. మొక్క జొన్నల కొనుగోళ్ల కుంభకోణం, వందల ఎకరాలను మింగిన మీకు అవినీతి మీద మాట్లాడే అర్హత లేదని' రంజిత్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు.

విశ్వేశ్వర్‌రెడ్డి మీద అనుచిత వాఖ్యలు చేస్తే బొందపెడతామని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకక పట్నం సునీతను అభ్యర్థిగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నదని దుయ్యబట్టారు. భర్త బీఆర్ఎస్‌లో ఉండగా, భార్యకు కాంగ్రెస్‌లో టిక్కెట్ ఇస్తున్నారని, అంటే ఆ రెండు పార్టీల రహస్య ఎజెండా అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి గండిపేట్ మండలంలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవీ, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్, ఆ పార్టీ నాయకులు డాక్టర్ ప్రేంరాజ్, వై.శ్రీధర్, ఎస్.మల్లారెడ్డి, పి.మల్లేశ్ యాదవ్, బొక్క బాల్‌రెడ్డి, ఎం.కొమురయ్య, కాడెం సుదాకర్, బి.బాబురావు, అడికె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర

సీసీ కెమెరాలు పెట్టి వేధిస్తున్నాడని పోలీసులకు మహిళ ఫిర్యాదు

నార్సింగ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు పెట్టి వేధిస్తున్నాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హైదర్షాకోట్‌కు చెందిన మహిళ.. సీసీ కెమెరాల్లో తన కదలికలను గమనిస్తూ మానసికంగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా రాజకీయ నాయకుడిపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఈ విషయంపై నార్సింగ్ ఇన్‌స్పెక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఆ మహిళకు.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వ్యక్తి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని, వారంతా బంధువులు అని వివరించారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి... తప్పుచేసినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అధిక లాభాలంటూ రూ. 2.48 కోట్ల మోసం

● యువకుడిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడికి అధిక లాభాలంటూ నమ్మించి, పలువురి నుంచి రూ.2.48 కోట్లు కాజేసిన మోసగాడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాచిగూడ నింబోలిఅడ్డాకు చెందిన శ్రీనాథ్ రాఠి(25), పలువురు చార్టెడ్ అకౌంటెంట్లతో పరిచయం పెంచుకున్నాడు. పెట్టుబడికి అధిక లాభాలు అంటూ నమ్మించాడు. ముందుగా తీసుకున్న మొత్తానికి లాభాలు కలిపి ఇస్తుండటంతో నమ్మకం పెరిగి రూ. 2.48 కోట్లు ఇచ్చారు. డబ్బులు ఖాతాలో పడిన తర్వాత శ్రీకాంత్ స్పందించడం మానేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.


శ్రీనాథ్ రాఠి


మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు తదితరులు

గ్రంథాలయాలను బలోపేతం చేయాలి

చార్మినార్ ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని గ్రంథాయాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చేగోని రవికుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో వారు కలిశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నూతనంగా గ్రంథాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. మూడు దశాబ్దాలుగా గ్రంథ పాలకుల నియామకం చేపట్టకపోవడంతో వాటి నిర్వహణ ఇబ్బందిగా మారిందని మంత్రికి వివరించారు. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం సభ్యులు డాక్టర్ లక్‌పతి నాయక్, డాక్టర్ మల్లికార్జున్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ గోల్డెన్ హైట్స్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే రూ.48లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోల్డెన్‌హైట్స్ కాలనీతోపాటు డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానన్నారు. గోల్డెన్ హైట్స్ కాలనీ, జనచైతన్య కాలనీలో రెండు కమ్యూనిటీ హాల్స్, మంచినీటి పైపులైన్‌లు వేయించాలని, రోడ్లు వేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, ఈఈ నాగేందర్, డీఈ బద్రునాయక్, ఏఈ వెంకోబా, వాటర్‌వర్క్స్ అధికారులు శ్రావ్యరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.


గోల్డెన్ హైట్స్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తదితరులు

లాస్యనందిత మృతి బాధాకరం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతదేహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సందర్శించారు. ఆమె మృతదేహంపై పుష్పగుచ్ఛం పెట్టి నివాళులర్పించారు. అనంతరం లాస్య నందిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎదిగిన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం మణికొండలోని రంగారెడ్డి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల రవాణాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ కార్యాలయాలలోని హెల్ప్‌డెస్క్‌లను మరింత పటిష్టం చేయాలని, టీ యాప్ ఫోలియో ద్వారా జరిగే ఆన్‌లైన్ సేవలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాల వారీగా, ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్)ల పనితీరు, ఇప్పటి వరకు సాధించిన ఆదాయ లక్ష్యాలను ఆయన సమీక్షించారు. రోడ్లపై అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు కొనసాగించాలని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సమావేశాని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల అధికారులు వెంకటరెడ్డి, రఘునందన్ గౌడ్, వాణి, సుభాష్ చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.


సమీక్షిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్

అంధులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

మదీన, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంధులు చీకటిని తలుచుకుని ఆందోళన చెందడం కన్నా, మనోధైర్యంతో ముందుకు సాగాలని ఐడియల్ స్కూల్ ఫర్ డిజేబుల్డ్(ఐఎస్‌డీ) సంస్థ ఛైర్మన్ డాక్టర్ ముబాషిర్ సూచించారు. పాతబస్తీలోని ఐఎస్‌డీ స్కూల్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అంధ విద్యార్థులకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. కంటి చూపు లేకపోయినా కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఐఎస్‌డీ స్కూల్‌లో మూగ, చెవిటి, అంధ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెటు ప్రదానం చేస్తున్న సంస్థ ఛైర్మన్ డాక్టర్ ముబాషిర్

సదరన్ ఇండియన్ రీజినల్ కౌన్సిల్ హైదరాబాద్ ఆఫీస్ బేరర్ల ఎన్నిక

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సదరన్ ఇండియన్ రీజినల్ కౌన్సిల్ హైదరాబాద్ బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆఫీస్ బేరర్లుగా సభ్యులను ఎన్నుకుంది. శుక్రవారం నాంపల్లిలోని తమ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఛైర్మన్‌గా సీఏ పొనుగోటి రవిశంకరరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా సీఏ చిన్న సీతారామిరెడ్డి, కార్యదర్శిగా సీఏ గిర్ధారిలాల్ లోష్విల్, కోశాధికారి, కో ఛైర్మన్‌గా సీఏ ఉప్పలపాటి శరణ్‌కుమార్‌ను ఎన్నుకొన్నారు. హైదరాబాద్ బ్రాంచ్ సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్‌గా దీపక్ లడ్డా ఎన్నికయ్యారు. సమావేశానికి ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఏ దయానివాస్‌శర్మ, శ్రీధర్ ముప్పాల, చెంగల్ రెడ్డి, సునీల్ మండవ, నరేష్ చంద్ర, రాజాంబాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రతినిధులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను సత్కరించారు.


నూతన కమిటీ సభ్యులతో నిర్వాహకులు


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా డివిజన్ కృష్ణారెడ్డినగర్‌లో కమ్యూనిటీహాల్ పనులను శుక్రవారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకున్నదని బస్తీవాసులు తన దృష్టికి తీసుకురాగా, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రూ.18లక్షల నిధులు మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు సురేశ్, ప్రకాశ్, విజయ్‌కుమార్, సోని, సంగీత, స్వరూప, జ్యోతి, లక్ష్మీ, బీజేపీ నాయకులు జె.చిరంజీవి, ఎ.పండరినాథ్, పొన్న శ్రీనివాస్‌రావు, ఈ. సుమన్‌కుమార్, జి.రఘుకాంత్, కె.రాజ్‌కుమార్, జె.అశోక్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు ఖాయం

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు ఖాయంగా వస్తాయని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ షేక్ జహంగీర్ ధీమా వ్యక్తంచేశారు. ఎంపీ ఎన్నికల్లో మరోసారి బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను నట్టేట ముంచాయన్నారు. శుక్రవారం ఆయన జల్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి రాష్ట్రాన్ని దోచుకున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల అవినీతి ఒక్కొక్కటి బయటకు వస్తాయని అన్నారు.


జహంగీర్

అయోధ్యకు..



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరాన్ని దర్శించుకునేందుకు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని దాదాపు 2 వేల మంది భక్తులు ప్రత్యేక రైలులో బయలుదేరి వెళ్లారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి రైలును బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ ప్రారంభించారు.

అఫ్జల్‌గంజ్ (ఆంధ్రజ్యోతి)

ఆ ప్రొఫెసర్‌పై విచారణకు కమిటీ

● ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీజీ విద్యార్థినులతో అనుచితంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌పై విచారణకు ఆదేశిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులుగా ఉన్న ప్రొఫెసర్లు కృష్ణమోహనరావు, సుప్రీతి, రజిని, మంజులవాణి పాల్గొన్నారు. ప్రొఫెసర్‌పై ఆరోపణలు చేసిన విద్యార్థుల్లో కొందరిని పిలిపించిన కమిటీ సభ్యులు వారు ఇచ్చిన ఆధారాలను పరిశీలించినట్లు తెలిసింది. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ వ్యక్తిగత సెలవులో ఉన్నందున, సోమవారం తర్వాత మరోమారు సమావేశం కావాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు.

మనూ పీహెచ్‌డీ ప్రవేశాల గడువు పొడిగింపు

● మార్చి 8 వరకు అవకాశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలోని పీహెచ్‌డీ పార్ట్‌టైం కోర్సుల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మార్చి 8 వరకు పొడిగించినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ, జర్నలిజం కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు గడువు ఫిబ్రవరి 25న ముగుస్తున్న తరుణంలో పలు విజ్ఞప్తుల అనంతరం గడువును పెంచామని పేర్కొన్నారు. వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ లేదా 62077 28673లో సంప్రదించాలని ఆమె సూచించారు.

27న గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సమావేశం

నల్లకుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులు హాజరవుతారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వెయ్యిమంది జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జర్నలిస్టులు 15ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

నిలోఫర్‌లో నర్సులకు ఓరియంటేషన్ శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రిలో కొత్తగా విధుల్లో చేరిన నర్సులకు ఓరియంటేషన్ శిక్షణను శుక్రవారం నిర్వహించారు. దాదాపు 192 మంది నర్సులు కొత్తగా ఆస్పత్రిలో చేరినట్లు సూపరింటెండెంట్ ఉషారాణి తెలిపారు. రోగులకు అందించాల్సిన సేవలు, చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, పీడియాట్రిక్ నర్సింగ్ కేర్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, నర్సింగ్ అధికారి స్వరూప, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వాణిజ్య సంస్థలపై దాడులు

● 156 చోట్ల తనిఖీలు, 221 సిలిండర్ల స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ ఏడు సర్కిళ్ల అధికారులు వాణిజ్య సంస్థలపై శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేశారు. నగరంలోని 156 చోట్ల తనిఖీలు నిర్వహించి 221 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్ఓ రమేష్ తెలిపారు. మలక్‌పేటలో ఏడుచోట్ల తనిఖీలు నిర్వహించి 14 సిలిండర్లు, యాకుత్‌పురాలో 30 చోట్ల తనిఖీలు.. 30 సిలిండర్లు, చార్మినార్‌లో 11 చోట్ల తనిఖీలు.. 20 సిలిండర్లు, నాంపల్లి, మెహిదీపట్నం ఏరియాల్లో 28 చోట్ల తనిఖీలు.. 41 సిలిండర్లు, అంబర్‌పేటలో 20 చోట్ల తనిఖీలు.. 37 సిలిండర్లు, ఖైరతాబాద్‌లో 27 చోట్ల తనిఖీలు.. 32 సిలిండర్లు, బేగంపేటలో 18 చోట్ల తనిఖీలు.. 23 సిలిండర్లు, సికింద్రాబాద్‌లో 15 చోట్ల తనిఖీలు నిర్వహించి 24 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్ఓ తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధిస్తున్న యువకుడిపై అత్తాపూర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... పాతబస్తీలో నివాసముండే ఓ మైనర్‌ను చాలాకాలంగా అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ అలీ(19) వేధిస్తున్నాడు. దాంతో బాలిక కుటుంబసభ్యులు పాతబస్తీ నుంచి అత్తాపూర్‌కు తమ నివాసాన్ని మార్చారు. అయినా మహమ్మద్ అలీ అత్తాపూర్‌కు వచ్చి మరీ వేధిస్తున్నాడు. ప్రేమించమని ఒత్తిడి తెస్తున్నాడు. బాలిక కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహమ్మద్ అలీని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను వాయిదా వేయండి

● జేఎన్‌టీయూ వీసీకి కాలేజీ యాజమాన్యాల వినతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ, ఎంఫార్మసీ గ్రాడ్యుయేట్లకు ఇండస్ట్రీల్లో డిమాండ్ ఎక్కువగా ఉన్నందున, తమ కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పలు ఫార్మసీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలతో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కళాశాలల ఛైర్మన్లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించుకునేందుకు మరో రెండువారాల గడువు ఇవ్వాలని, నియామకాలు పూర్తయ్యే వరకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలను వాయిదా వేయాలని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. వీసీ మాట్లాడుతూ.. యాజమాన్యాల సూచనలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సమావేశంలో యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆడిట్ సెల్ అధికారులు తారాకళ్యాణి, రవీంద్రరెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tLg6Oyk లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

ఆరాంఘర్ చౌరస్తాలో బస్ టెర్మినల్ ఏర్పాటు చేయాలి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆరాంఘర్ చౌరస్తాలో మినీ బస్‌టెర్మినల్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వి. జైపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరాంఘర్ చౌరస్తాలో మినీబస్ టెర్మినల్‌తోపాటు బస్టాండ్ నిర్మించాలన్నారు. 2017లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రఘునందన్‌రావు కాటేదాన్ సర్వేనెంబర్ 54, 55లో ఏడెకరాల 22 గుంటల ప్రభుత్వ భూమిని సర్వే చేయించగా, 2018లో అప్పటి కలెక్టర్ లోకేశ్‌కుమార్ ఆ స్థలాన్ని ఆర్టీసీకి ఇస్తున్నట్లు జీవో విడుదల చేశారన్నారు.

బుల్లితెర కార్మికుల కోసం ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్ శిబిరం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పేద బుల్లితెర కార్మికుల కోసం యాంకర్ సుమ కనకాల, తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్, వర్కర్స్ ఫెడరేషన్, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో శుక్రవారం ఉచిత నేత్ర కాటరాక్ట్ వైద్య శిబిరాన్ని సినీనటుడు అలీ ప్రారంభించారు. చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వైద్య బృందం కార్మికులకు పరీక్షలు నిర్వహించి, కళ్ల అద్దాలు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కాటరాక్ట్ సమస్య ఉన్న వారిని చెన్నైకి తీసుకెళ్లి ఆపరేషన్‌లు నిర్వహించనున్నారు.

సన్మానం

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ నాయకుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

- (పహడిషరీఫ్ ఆంధ్రజ్యోతి)





పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ వి.హనుమంత్ రావును తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్మెన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్వరంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. శుక్రవారం గాంధీ భవన్ నుంచి వారు అంబర్‌పేటలోని సీజన్ ఆస్పత్రికి వెళ్లారు. హనుమంతరావు ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు.

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

కనులపండువగా సమ్మక్క సారలమ్మ జాతర


బోనాలు తీసుకువస్తున్న భక్తులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిన్న మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతర కనులపండువగా సాగింది. రాజేంద్రనగర్ మానసహిల్స్‌లో ఉన్న సమ్మక్క, సారలమ్మ దేవాలయంలో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సమ్మక్క, సారలమ్మలు గద్దెప్రవేశం చేశారు. భక్తులు కుంకుమ భరణీలకు పూజలు చేశారు. పూజా కార్యక్రమాలలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల సంగారెడ్డి, సాగర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. శనివారం ఎదుర్కోలు పూజలు నిర్వస్తారు.


సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మెట్రో రైళ్లు కిటకిట

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ఒక్కో రైలులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు వెళ్తుండడంతో ఊపిరాడని పరిస్థితి నెలకొంటున్నది. మేడారం మహాజాతర నేపథ్యంలో ఆర్టీసీ గ్రేటర్ నుంచి 1,800 బస్సులను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు పంపించింది. దీంతో నగరంలో నాలుగు రోజులుగా బస్సుల కొరత ఏర్పడింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసులు, కాలేజీలకు వెళ్లే సమయంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు మెట్రో రైళ్లను ఆశ్రయిస్తుండడంతో స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. బుధ, గురు, శుక్రవారాల్లో రోజుకు 5 లక్షల మంది ప్రయాణించినట్లు మెట్రో వర్గాలు చెబుతున్నాయి. జాతర కోసం జిల్లాలకు వెళ్లిన బస్సులు తిరిగి నగరానికి వచ్చే వరకు మెట్రో ప్రయాణం తప్పదని ఉద్యోగులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సతీష్ కులకర్ణి

మార్చి 4 నుంచి డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్

పంజాగుట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెయిరీ అసోసియేషన్(ఐడీఏ) సౌత్‌జోన్ చాప్టర్ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6 వరకు మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్, ఎక్స్‌పో జరగనుంది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియన్ డెయిరీ అసోసియేషన్(ఐడీఏ) సౌత్‌జోన్ చాప్టర్ ఛైర్మన్ సతీష్ కులకర్ణి, ఐడీఏ తెలంగాణ చాప్టర్ ఛైర్మన్ సీహెచ్.రాజేశ్వరరావు, దొడ్ల డెయిరీ లిమిటెడ్ సీఈఓ బీవీకే.రెడ్డి సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఇండియన్ డెయిరీయింగ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ థీమ్‌తో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పాడి పరిశ్రమ రంగంలో వస్తున్న మార్పులను రైతులకు వివరించేందుకు సదస్సు ఎంతగా దోహదపడుతుందన్నారు. సదస్సులో చర్చా గోష్ఠిలు, సమావేశాలు, పేపర్ ప్రజెంటేషన్స్ ఉంటాయన్నారు. సమావేశంలో తెలంగాణ చాప్టర్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కేఆర్.రావు, సభ్యులు పాల్గొన్నారు.

వాయుకాలుష్యంతో సోరియాసిస్ కేసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరాల్లో వాయుకాలుష్యం వల్ల సోరియాసిస్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైటెక్స్‌లో శుక్రవారం డెర్మాకాన్ 2024 సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ రుమటాలజిస్టులు, చర్మవ్యాధి నిపుణులు హాజరయ్యారు. ఒత్తిడి, నిద్రలేకపోవడం వ్యాధిపై ప్రభావం చూపుతుందన్నారు. స్కిన్ సాగా డైరెక్టర్ డాక్టర్ అసీమ్ శర్మ మాట్లాడుతూ.. ఒత్తిడి శ్వాసకోశ వ్యవస్థను మాత్రమే కాకుండా చర్మ సంబంధిత వ్యాధులను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ స్కిన్ హెయిర్ లేజర్ క్లినిక్ డెర్మటాలజిస్టు డాక్టర్ ఎస్.కిరణ్ మాట్లాడుతూ.. సోరియాసిస్‌తో చర్మంపై ఎరుపు లేదా తెలుపు రంగులో మచ్చలు వస్తాయని, ఇది ఒక ఆటో-ఇమ్యూన్ వ్యాధి అని, విస్మరిస్తే సోరియాటిక్ ఆర్థ్రైటిస్‌కి దారితీస్తుందన్నారు. దేశంలో ఏటా సుమారు 10 మిలియన్ల సోరియాసిస్ కేసులు నమోదవుతున్నాయన్నారు. డాక్టర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంతి చికిత్స, నోటి మందులు, బయోలాజికల్ థెరపీ వంటి అనేక ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వాహనం తయారు కాకముందే చలానా

● కొనుగోలు 2023లో.. జరిమానా 2020లో..


పోలీసులు విధించిన చలానా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనం తయారు కాకముందే నిబంధనల ఉల్లంఘన పేరిట చలానా వేశారు. ఇది ట్రాఫిక్ పోలీసుల అతి తెలివికి పరాకాష్టగా మారింది. 2023 డిసెంబర్ 22న ఓ వ్యక్తి వాహనం కొనుగోలు చేశాడు. 2024 జనవరి 6న రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 2020 డిసెంబర్ 14న నిబంధనలు ఉల్లంఘించినట్లు ట్రాఫిక్ పోలీసులు చలానా వేశారు. నంబర్ ప్లేట్ సక్రమంగా లేదని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు చలానా విధించి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు..మూడేళ్ల క్రితం వాహనం, నంబర్ ఎక్కడ ఉందని వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కారు యజమాని స్నేహితుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరుకు అద్దం పడుతున్న ఈ సంఘటనపై అధికారులు ఏం సమాధానం చెబుతారో చూడాలి.

భద్రతా పరంగా చూడాల్సిన అంశాలు..

(3వ పేజీ తరువాయి)

వంటివి ప్రతి చక్రమూ తగినంత ఫోర్స్ పొందేలా చేస్తాయి.

ఈడీఎల్ (ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్): స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్‌తోపాటుగా ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్(ఈడీఎల్) పనిచేస్తుంది. మలుపుల వేళ కారు రోడ్డుపై పట్టుకోల్పోకుండా అడ్డుకోవడంలో ఇది తోడ్పడుతుంది.

టీపీఎంఎస్: టైర్ ప్రెజర్ మానిటర్ సిస్టమ్(టీపీఎంఎస్)గా చెబుతుంటారు. దీనితో రియల్ టైమ్‌లో టైర్ ప్రెషర్ ఎంత ఉందో తెలుస్తుంది. ఒక టైర్‌లో ప్రెషర్ తగ్గినా హెచ్చరిక ఇస్తుంది. ప్రమాదాలు జరగకుండా నివారించడంలో టీపీఎంఎస్ పాత్ర కీలకమని, టైర్ ప్రెషర్ సరిగా లేకపోతే వాహన నియంత్రణ కష్టమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ఈఎస్‌సీ: కారుపై నియంత్రణ కోల్పోయినప్పుడు స్టెబిలైజ్ చేయడంలో ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) తోడ్పడుతుంది.

ఇవిగాక రియర్ కెమెరాలు, మల్టీ కొలిజన్ బ్రేకింగ్, హిల్ డీసెంట్ కంట్రోల్, డ్రైవర్ నీ ఎయిర్‌బ్యాగ్ వంటివి భద్రత పరంగా తోడ్పడతాయి.

మద్యం తాగితే ప్రాణ ముప్పు ఎక్కువ



మద్యం తాగిన వారు ప్రమాదాలకు గురైతే వారికి ప్రాణముప్పు అధికంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా వెన్ను, ఎముకలు, తలకు సంబంధించిన గాయాలే ఉంటాయి. తలకు బలమైన దెబ్బ తగిలితే పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుంది. ఎక్కువగా మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారు ప్రమాదానికి గురైతే వారికి మెదడు, వెన్నుపై ఆల్కహాల్ తీవ్ర ప్రభావం చూపుతుంది. కింద పడినప్పుడు స్పైన్‌కు ఎక్కువ గాయాలయ్యే ముప్పు ఉంటుంది. మద్యం వల్ల గుండె స్పందనలు, బీపీ పెరిగి హార్ట్ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదముంది. కడుపునొప్పి, రక్తపు వాంతులు జరిగే అవకాశముంది. అతి మద్యం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశముంది.

- డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, న్యూరో, స్పైన్ సర్జన్, మెడికవర్ ఆస్పత్రి

అంతలోనే..

(3వ పేజీ తరువాయి)

చేతిలో ఓటమి పాలయ్యారు. అనారోగ్యంతో గతేడాది మరణించడంతో ఆయన కుటుంబం నుంచే సాయన్న రాజకీయ వారసురాలిగా ఉన్న లాస్యనందిత ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. అంతకుముందు కవాడిగూడ కార్పొరేటర్‌గా ఉన్న లాస్య.. తండ్రి తరహాలోనే ప్రజల్లో ఉండేవారు. సమస్య ఉందని తన వద్దకు ఎవరు వెళ్లినా పరిష్కారానికి ప్రయత్నం చేసేవారు. ఏదైనా కార్యక్రమం ఉందని ఆహ్వానించినా తప్పకుండా హాజరయ్యేవారని ప్రజలు చెబుతున్నారు. లాస్య కవాడిగూడ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికై తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చారు. డివిజన్ అభివృద్ధికి ఆమె తన వంతు కృషి చేశారు. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రెండోసారి కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె పరాజయం పాలయ్యారు. తండ్రి మరణంతో అవకాశం దక్కడంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కంటోన్మెంట్, ముషీరాబాద్ నియోజకవర్గాల ప్రజలతో సాయన్న కుటుంబం, లాస్యనందితకు ప్రత్యేక అనుబంధం ఉంది. లాస్య మృతిపై నగరంలోని పలువురు ఎమ్మెల్యేలు సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మొదటి ఎమ్మెల్యే..

నగర రాజకీయ చరిత్రలో రోడ్డు ప్రమాదం బారిన పడి మృతిచెందిన తొలి ఎమ్మెల్యే లాస్యనందిత కావడం అన్ని వర్గాల ప్రజలను కలిచి వేసింది. సాయన్న వారసురాలిగా, ఆయన ఆశయాలను నెరవేర్చే క్రమంలో, అర్ధాంతరంగా ఆమె తనువు చాలించడం విచారకరమని పలువురు పేర్కొన్నారు.

ఓయూలో పదోన్నతుల్లో అక్రమాలు

యూజీసీ గుర్తించిన జర్నల్స్‌లో ప్రచురణలు కరువు ● సీనియర్ ప్రొఫెసర్లుగా పలువురికి అందలం



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయి.యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కుతూ పలుకుబడి కలిగిన ప్రొఫెసర్లకే సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఒక్కరిద్దరు కాదు.. పది మంది ఉన్నతస్థాయి వ్యక్తులకే పదోన్నతులు దక్కాయి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొందరు ప్రొఫెసర్లు వక్రబుద్ధికి పాల్పడ్డారు. పదోన్నతుల కోసం ఏర్పాటు చేసిన కమిటీని ప్రభావితం చేసి అర్హత లేకపోయినా పలువురు అందలమెక్కారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీల వీసీల నియమాకం కోసం నోటిఫికేషన్ వేయగా అక్రమాలకు పాల్పడి పదోన్నతులు పొందిన వారే ముందు వరుసలో ఉండడం గమనార్హం.

ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ 26 మందిని సెలక్షన్ కమిటీ ఎంపిక చేయగా, సంబంధిత జాబితాను 2022 మేలో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదించింది. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్ సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే పది రీసెర్చ్ ఆర్టికల్స్ కలిగి ఉండాలి. అవి కూడా యూజీసీ కేర్ లిస్ట్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ లాంటి రీసెర్చ్ జర్నల్స్‌లో పబ్లిష్ చేయాలి. అంతేకాకుండా ఆ ప్రొఫెసర్ కింద ఇద్దరు పీహెచ్‌డీ అవార్డ్ పొందిన విద్యార్థులు ఉండాలి.

కానీ ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సెలక్షన్ కమిటీ మాత్రం యూజీసీ నిబంధనలేవీ పాటించలేదు. కేవలం పదేళ్లకు పైగా ప్రొఫెసర్‌గా పని చేసిన అనుభవంతోపాటు పరిశోధన అనుభవం ఆధారంగా సీనియర్ ప్రొఫెసర్లను ఎంపిక చేయడం గమనార్హం. సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన 26 మందిలో పది మంది అర్హతలేని వారే ఉన్నారు. యూజీసీ గుర్తించిన జర్నల్స్‌లో రెండు, మూడు మాత్రమే ప్రచురణలు ఉన్న కొందరి ప్రొఫెసర్లకు అవకాశం కల్పించారు. పీహెచ్‌డీ అవార్డు పొందిన అభ్యర్థులు ఒక్కరే ఉన్నా.. మరికొందరి ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించారు. అర్హత ఉన్న పలువురికి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించలేదు. కేవలం పలుకుబడి కలిగినవారికి మాత్రమే పదోన్నతులు కల్పించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

అక్రమాలకు పాల్పడినవారు వీసీలుగా వద్దు



ఉస్మానియా యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి. అక్రమాలకు పాల్పడిన వారిని వీసీగా నియమించొద్దని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, యూజీసీ ఛైర్మన్ జగదీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాం. అవకతవకలకు పాల్పడిన ప్రొఫెసర్ల అక్రమాల ఆధారాలను అందజేశాం. పదోన్నతుల ద్వారా ఆర్జించిన జీతాన్ని యూనివర్సిటీ రికవర్ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలి. లేదంటే విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తాం.

- నెల్లి సత్య, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి

యువత కొత్త ఆవిష్కరణలతో ముందుకురావాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


వెంకయ్యనాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రొఫెసర్ యోగిశ్వరి

జవహర్‌నగర్, ఫిబ్రవరిరి, 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి యువత కొత్త ఆవిష్కరణలతో ముందుకురావాలని పద్మవిభూషణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. బిట్స్‌పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన లాంచ్‌ప్యాడ్-2024 కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. పారిశ్రామిక, వాణిజ్య రంగంలో అడుగుపెట్టాలనుకుంటున్న ఔత్సాహికులకు అటల్ ఇన్నోవేటివ్ మిషన్, మేడిన్ ఇండియా వంటివి తోడ్పాటునందిస్తున్నాయన్నారు. భారతదేశంలో ప్రతిభావంతులకు కొదవలేదని, సిలికాన్‌వ్యాలీ నుంచి వాల్‌స్ట్రీట్ వరకు, దుబాయ్ నుంచి షాంగాయ్ వరకు ఉన్న ప్రముఖ కంపెనీల్లో సీఈవోలుగా 50 మందికిపైగా భారత దేశానికి చెందినవారే ఉన్నారని గుర్తు చేశారు. చదువు కేవలం విజ్ఞాన సముపార్జన కోసం కాదని మంచి నడవడిక, విలువలు, సమాజం పట్ల బాధ్యత, దేశంపట్ల గౌరవం పెంచే సాధనంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. భారతదేశం సంపన్న దేశంగా మారాలంటే యువత కలలు కనాలని, వాటిని నెరవేర్చుకోవాలన్నారు. కష్టపడకుండా ఏదీ సాదించలేమన్నారు. యువత ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకోడంతోపాటు యోగాసనాలు చేయటం అలవాటు చేసుకోవాలన్నారు. భారతదేశ అభివృద్ధి కోసమే యువత ఆలోచనలు ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బిట్స్ మాజీ డైరెక్టర్ సుందర్, డీన్ యోగిశ్వరి, ప్రొఫెసర్‌లు కన్నన్ రామస్వామి, పరీక్షిత్ సాహి తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో పోలీస్ జాగిలాల పాత్ర కీలకం

● డీజీపీ రవిగుప్తా


పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమైందని డీజీపీ రవిగుప్తా అన్నారు. 23వ పోలీస్ జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్ మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ(ఐటీఏ)లో శుక్రవారం జరిగింది. డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రకమైన షరతులు లేని ప్రేమకు జాగిలాలు నిదర్శనమన్నారు. జాగిలాలు ఆప్యాయత, ప్రేమకు ప్రతీకలుగా డీజీపీ అభివర్ణించారు. పలు కీలక కేసుల్లో జాగిలాలు నిందితులను పట్టుకోవడంతో పోలీస్‌లకు సహకరించాయని తెలిపారు. పాసింగ్ ఔట్ పరేడ్‌లో జాగిలాలు కనబరుస్తున్న ప్రతిభ, క్రమశిక్షణ ఎంతగానో ఆకట్టుకున్నాయని రవిగుప్తా చెప్పారు. ఐఐటీఏ జాగిలాలకు అందిస్తున్న శిక్షణకు దేశంలోనే ఎంతో పేరు ఉందన్నారు. ఆయా రాష్ట్రాల పోలీస్ అధికారులు తమ రాష్ట్ర జాగిలాలకు శిక్షణ ఇప్పించాలని కోరుతున్నారని చెప్పారు. ఐఐటీఏలో ఇప్పటికే పలు రాష్ట్రాల పోలీస్ జాగిలాలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఇటీవల జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించడం అభినందనీయమని డీజీపీ రవిగుప్తా అన్నారు. జాతీయ స్థాయిలో పోలీస్ శాఖ సాధించిన విజయాల్లో పోలీస్ జాగిలాలు ప్రశంసాపూర్వక పాత్ర పోషించాయని ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో ఐఐటీఏ సిబ్బంది మరిన్ని విజయాలు సాధించాలన్నారు. బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రతోపాటు మరికొన్ని రాష్ట్రాల పోలీస్ జాగిలాలకు ఐఐటీఏలో శిక్షణ ఇస్తున్నామని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్ వివరించారు. 2004లో 11 జాగిలాలతో ప్రారంభమై... ఇప్పటి వరకు 771 జాగిలాలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన జాగిలాలు, వాటి హ్యాండ్లర్లకు బహుమతులు అందజేశారు. ఆయా విభాగాల్లో శిక్షణ పొందిన జాగిలాలు నిర్వహించిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ ఎం. రమేష్ ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం!

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపక్షపాతి, విప్లవ శ్రేయోభిలాషి అరికట్ల రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం సంతాపసభ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనురాధ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, విరసం నాయకురాలు విమల, సామాజిక విశ్లేషకులు కాకర్ల సజయ, ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ సమున్నత, రామకృష్ణారెడ్డి సోదరి జానకి, రామకృష్ణారెడ్డి జీవిత సహచరి, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ ఈ.సంధ్య, ప్రజా రచయిత జీవన్ తదితరులు రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి చిన్నతనం నుంచే ప్రజా విప్లవ నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని విప్లవ విద్యార్థి సంఘాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ విప్లవ రాజకీయాల వైపు దృఢంగా నిలబడ్డారని తెలిపారు. ఆయన మరణం ప్రగతిశీల, ప్రజాస్వామిక, సామాజిక, విప్లవోద్యమాలకు తీరని లోటుగా పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల పక్షపాతిగా, విప్లవ శ్రేయోభిలాషిగా, ప్రెస్ నిర్వాహకుడిగా, ఉత్తమ పబ్లిషర్‌గా రామకృష్ణారెడ్డి చేసిన కృషి, సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు.

నగరానికి అదనపు జలాలు

● ఎమర్జెన్సీ పంపింగ్‌నకు ఏర్పాట్లు
● డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు
● వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి


మాట్లాడుతున్న వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగర అవసరాలకు అనుగుణంగా అదనపు జలాలను తరలించడానికి ఎమర్జెన్సీ పంపింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండ్‌ను అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని, సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రచించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఖైరతాబాద్‌లో వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే ఐదు నెలలకు తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్రస్థాయిలో మైక్రో లెవల్ ప్లాన్స్ రూపొందించుకోవాలని, ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. నీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, ఏవైనా ఇబ్బందులుంటే ముందుగా ప్రజలకు సమాచారమివ్వాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నీటి కొరత, లోప్రెషర్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పరిష్కారానికి ప్రత్యేక బృందాలను సీజీఎంల ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలని, విద్యుత్ కోత ఉంటే.. ఇతర సమయాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. చేతి పంపులు, బోర్‌వెల్స్ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో లైన్‌మెన్లు గైర్హాజరైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలుషిత నీటి సరఫరా, లీకేజీలు జరిగితే 24 గంటల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంతమంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు వస్తున్నాయని.. వీటిని నివారించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్.ప్రవీణ్ కుమార్, స్వామి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్ రెడ్డి, జీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

సాహితీ ఇన్‌ఫ్రా కేసులో..
సీసీఎస్ పోలీసుల దర్యాప్తు ముమ్మరం

● ఏపీలో కోట్ల విలువైన భూముల గుర్తింపు.. స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ పేరుతో హైదరాబాద్ నగరంలో దాదాపు 3 వేల మందిని మోసం చేసిన సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాహితీ ఇన్‌ఫ్రా యజమాని బూదాటి లక్ష్మీనారాయణ నగరంలోనే కాకుండా ఏపీలోని గుంటూరులో కూడా ఇదే తరహాలో మోసం చేసినట్లు సీసీఎస్ అధికారులు గుర్తించారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కాజ గ్రామంలో సుమారు 56 మంది రైతులకు సంబంధించిన 24 ఎకరాలు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయించుకున్నారు. ఈ స్థలంలో భారీ భవనాలు, ఐటీ పార్కులు, విల్లాల నిర్మాణం చేస్తానని ప్రచారం చేసుకున్నారు. తర్వాత ప్రీ లాంచింగ్ ఆఫర్ పేరుతో పలువురి నుంచి కోట్లు వసూలు చేసి, ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దర్యాప్తులో భాగంగా ఈ విషయాన్ని గుర్తించిన సీసీఎస్ పోలీసులు సదరు భూమిని అటాచ్ చేయించారు. ఇదే తరహాలో మోసాలు జరగకుండా ఉండేందుకు డీసీపీ శ్వేతారెడ్డి ఓ బృందాన్ని పంపి స్వాధీనం చేసుకున్న స్థలంలో నోటీసు బోర్డులు పెట్టించారు. ప్రీ లాంచ్ పేరుతో బూదాటి లక్ష్మీనారాయణ చేతిలో మోసపోయిన వారు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులను సంప్రదించాలని శ్వేతారెడ్డి కోరారు.

ఇంటి విషయమై ఘర్షణ

● గుండెపోటుతో ఒకరి మృతి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి విషయమై జరిగిన గొడవలో ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతిచెందాడు. కృష్ణానగర్‌కు చెందిన దశరథ్ (60) స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. 2005లో కూకట్‌పల్లికి చెందిన బాలపుల్లయ్య వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఈ నేపథ్యంలో దశరథ్‌కు చెందిన ఇంటి పత్రాలను బాల పుల్లయ్య బ్యాంకులో తనఖా పెట్టి డబ్బు తీసుకున్నాడు. అందులో కొంత మొత్తం దశరథ్‌కు ఇచ్చాడు. కొంత కాలం తర్వాత బాలపుల్లయ్య బ్యాంకు నుంచి ఇంటి పత్రాలు విడిపించాడు. గతంలో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమని ఆయన కోరగా.. దశరథ్ నిరాకరించాడు. అప్పటినుంచి ఇంటి పత్రాలను బాలపుల్లయ్య తనవద్దే ఉంచుకున్నాడు. దీనికి సంబంధించి ఇద్దరి మధ్య వివాదం జరుగుతోంది. దశరథ్ డబ్బు ఇవ్వకపోవడంతో బాలపుల్లయ్య ఇటీవల అశ్విని అనే మహిళ పేరుతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఆమె గురువారం రోహిత్‌రెడ్డి, మరో పదిమందిని తీసుకొని కృష్ణానగర్ వెళ్లింది. ఇల్లు ఖాళీ చేయాలని కోరగా దశరథ్ అంగీకరించలేదు. వారి మధ్య వాగ్వాదం జరగగా గుండెపోటుతో దశరథ్ మృతి చెందాడు. తండ్రి మరణానికి రోహిత్‌రెడ్డి, అశ్వినీలే కారణమని దశరథ్ కుమారుడు శ్రీకాంత్ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రోహిత్‌రెడ్డి, అతడి అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

'డబుల్' ఆశ చూపి కిడ్నాప్

● వృద్ధురాలిని బెదిరించి బంగారు నగలు లాక్కొని పరార్

ఉప్పల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలిని టార్గెట్ చేసింది ఓ ముఠా. ప్రభుత్వ పథకాలు ఎరవేసి కిడ్నాప్ చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమసాయినగర్‌లో రమాదేవి(62) ఒంటరిగా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోంది. డబుల్ బెడ్‌రూం కోసం దరఖాస్తు చేసుకుంది. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇంటికి వెళ్లి జీహెచ్ఎంసీ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు వచ్చిందని చెప్పారు. విచారణ చేయాలని తీసుకెళ్లారు. కారులో నాగోల్ వరకు తీసుకెళ్లి కత్తులతో బెదిరించి పుస్తెలతాడు, చెవి కమ్మలు, చేతి రింగు లాక్కుని పారిపోయారు. 8 తులాల బంగారు నగలు దోచుకున్నారని బాధితురాలు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యకు కారణమైన
తల్లీకొడుకులకు ఏడేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: మహిళ, ఆమె భర్తపై దాడి చేసి, దుర్భాషలాడి ఆమె ఆత్మహత్యకు కారణమైన ఇద్దరికి న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న పావురం జంగమ్మ, ఆమె భర్తపై 2017 మే 10న పొరుగున ఉంటున్న శ్రీధర్, అతడి తల్లి దాడిచేసి దుర్భాషలాడారు. మనస్తాపం చెందిన జంగమ్మ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాలుగవ సహాయ సెషన్స్ కోర్టు న్యాయాధికారి నాగరాజు నిందితులిద్దరికీ ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో హద్దు మీరుతున్న జంటలు

● షీటీమ్స్ డెకాయ్ ఆపరేషన్.. జరిమానా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలు, పార్కుల్లో హద్దులు మీరుతున్న జంటలపై షీటీమ్స్ దృష్టి పెట్టింది. బహిరంగ ప్రదేశాల్లో వీరి చేష్టలపై పలువురు ఫిర్యాదులు చేయడంతో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో హద్దుమీరి ప్రవర్తిస్తున్న జంటలను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారు. సాక్ష్యంగా వారు సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియో రికార్డ్ చేశారు. 12 మందికి రూ. 50 జరిమానా, మరో జంటకు రూ. 1,250 జరిమానా విధించినట్లు షీటీమ్స్ అధికారులు తెలిపారు.

బీటలు వారిన గాంధీ ఆస్పత్రి

● చూస్తే బాధేస్తుంది : మంత్రి కోమటిరెడ్డి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి పరిస్థితి చూస్తే బాధేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త తెలుసుకొని గాంధీ ఆస్పత్రికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీటలు వారిన ఆస్పత్రి గోడలు, డ్రైనేజీ లీకేజీ చూస్తే రోగులు ఎంత ఇబ్బందులు పడుతున్నారో తెలుస్తుందన్నారు. అవసరమైతే గాంధీ ఆస్పత్రి మరమ్మతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉస్మానియా ఆస్పత్రిని బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

చెరువు ఎఫ్‌టీఎల్‌లో కళాశాలల నిర్మాణాలు

గుర్తించిన అధికారులు ● కూల్చివేతల జోలికి వెళ్లని వైనం


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్


ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు

దుండిగల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీఎం అండ్ ఫార్మసీ కళాశాలలకు చెందిన షెడ్లు, కొన్ని బిల్డింగ్‌లు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనే ఉన్నాయని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చారు. నిర్మాణాలను తొలగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మూడు రోజుల క్రితం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజులుగా ఒక షెడ్డును మాత్రమే కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్‌లో వేసిన రోడ్డును తవ్వి మట్టిని తరలించే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. రెండు కాలేజీలకు సంబంధించిన క్యాంటీన్‌లు, పార్కింగ్ స్థలాలు, షెడ్లను అధికారులు శుక్రవారం కూడా ముట్టుకోలేదు. ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి మార్కింగ్ చేశారు. ఆ ప్రాంతంలో నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. కాని వాటిని ఎందుకు కూల్చడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వచ్చి చూసి వెళ్లారు. మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి సిబ్బందితో మట్టి తరలించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే అధీనంలో ఈ కళాశాలలు 20 ఏళ్ల నుంచి కొనసాగుతున్నాయి. చెరువును కొంతభాగం పూడ్చి శిఖం భూముల్లో బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. నోటీసులిచ్చి భవనాలు కూల్చివేస్తామని అధికారులు చెబుతున్నారు.




గద్దెల వద్ద బంగారం(బెల్లం) కోసం ఎగబడుతున్న జనం, సమ్మక్కకు మొక్కులు చెల్లిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గిరిజనుల అభ్యున్నతికి కృషి

ఆదివాసీలను ప్రధాన స్రవంతిలోకి తెస్తా: తమిళిసై.. జాతరలో సమ్మక్క, సారలమ్మకు నిలువెత్తు బంగారం

- మేడారం చరిత్ర ప్రతి ఆదివాసీ తెలుసుకోవాలి
- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా
- మేడారంలో భక్తులకు అనారోగ్య సమస్యలు
- 4 రోజుల్లో 1.5 లక్షల మందికి మందులు



సమ్మక్క తల్లికి మొక్కుతున్న గవర్నర్ తమిళిసై, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, మంత్రి సీతక్క

మేడారం బృందం, ఫిబ్రవరి 23: ఆదివాసీ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు గవర్నర్ తమిళిసై అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మలను శుక్రవారం ఆమె దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాతో కలిసి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గవర్నర్ మేడారానికి చేరుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద తమిళిసై మాట్లాడారు. తాను గవర్నర్‌గా ఆరు గిరిజన గ్రామాలను దత్తత తీసుకున్నానని.. ఆదివాసీలు ఇంకా చాలా రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారిని ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ కుంభమేళాగా మేడారం మహాజాతర కీర్తి పొందిందని, దేశంలోని గిరిజనులు ఈ జాతరను గొప్పగా జరుపుకొంటారని చెప్పారు. జాతరకు తరలివచ్చిన లక్షలాది మంది భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కాగా దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలంతా మేడారం మహాజాతరకు వచ్చి జాతర విశిష్టతను తెలుసుకుని అమ్మవార్ల ఆశీస్సులు తీసుకోవాలని కేంద్ర మంత్రి అర్జున్ ముండా అన్నారు. గవర్నర్ తమిళిసైతో కలిసి అమ్మవార్లకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. దేశ వ్యాప్తంగా 10 కోట్ల మంది ఆదివాసీ గిరిజనులు ఉన్నారని, వారంతా దేశ అభ్యున్నతికి పాటుపడుతున్నారని ఈ సందర్భంగా అర్జున్ ముండా చెప్పారు. మేడారం మహాజాతర గురించి ప్రతి ఆదివాసీ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేవలం ఒకటి రెండు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు మహాజాతరకు తరలివచ్చి తల్లుల ఆశీర్వాదం పొందాలని సూచించారు. గద్దెలపై నలుగురు వనదేవతలు ఆసీనులవ్వడంతో శుక్రవారం భక్తుల తాకిడి మరింత పెరిగింది. వీఐపీలూ బాగాగే వచ్చారు. గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి అర్జున్ ముండాతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, యశస్వినీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, సీఎస్ శాంతాకుమారి విచ్చేసి తల్లులను దర్శించుకున్నారు. కాగా శుక్రవారం జాతర క్యూలైన్‌లో హిజ్రాలు చొచ్చుకొని రావడంతో మహిళలు వారితో గొడవ పడ్డారు. ఇక వీఐపీలు వచ్చిన ప్రతిసారి అరగంట నుంచి గంటదాకా పలుమార్లు దర్శనాన్ని నిలిపివేయడంతో భక్తులు అసహనంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



ఆస్పత్రితో పాటు శిబిరాలు ఫుల్

మేడారం జాతర నుంచి తిరిగి వెళుతుండగా బస్టాండ్ వద్ద లక్ష్మి (68) గుండెపోటుతో మృతిచెందింది. ములుగు జిల్లా వాజేడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మహాజాతర సందర్భంగా భక్తుల్లో కొందరికి జలుబు, దగ్గు, జ్వరం లాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. 20వ తేదీ నుంచి శుక్రవారం వరకు 1.49 లక్షలమంది అనారోగ్య సమస్యలతో మందులు తీసుకున్నారు. వారిలో కొందరు ఇన్ పేషంట్లుగా చేరారు. గద్దెల ప్రాంతంలో 30పడకల ఆస్పత్రితో పాటు మేడారంలోని పలు ప్రాంతాల్లో 30 వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో శ్వాస సంబంధ సమస్యలతో 3432 మంది, జ్వరంతో 2448 మంది, గాయాలైన 507 మందికి వైద్యసేవలు అందించామని సిబ్బంది తెలిపారు.. 86మంది తేలు కాటుకు గురయ్యారని, 23మంది గుండెపోటుకు గురవగా వారిలో ముగ్గురు మృతి చెందారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అల్లం అప్పయ్య తెలిపారు. 2700 మంది భక్తులను శిబిరాలు, ఆస్పత్రిలో చేర్చి వైద్యం అందిస్తున్నామన్నారు.



రోగులతో నిండిపోయిన మేడారం 30 పడకల ఆస్పత్రి

దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లోనే కరెంటు కనెక్షన్

- మెట్రోపాలిటన్ నగరాల్లో గడువు ఇది
- మున్సిపాలిటీల్లో వారం, గ్రామాల్లో 15 రోజులు
- కేంద్ర విద్యుత్తు శాఖ కొత్త రూల్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొత్త కరెంటు కనెక్షన్ (లేదా) పాత కనెక్షన్‌లో మార్పు కోసం దరఖాస్తు చేసుకుంటే మెట్రోపాలిటన్ నగరాల్లో అయితే 3 రోజుల్లోగా, మున్సిపల్ ప్రాంతాల్లో అయితే 7 రోజుల్లోగా, గ్రామాల్లో అయితే 15 రోజుల్లోగా కనెక్షన్ ఇవ్వాలని, సమస్యను పరిష్కరించాలని కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యుత్తు వినియోగదారుల హక్కులు, నిబంధనలను సవరించింది. కొత్త రూల్స్‌ను శుక్రవారం విడుదల చేసింది. కొండ ప్రాంతాల్లో ఇలాంటి దరఖాస్తులుంటే 30రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని నిర్దేశించింది. కొత్త కనెక్షన్ల కోసం విద్యుత్తు పంపిణీ వ్యవస్థల విస్తరణ, కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటే.. 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకొని కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించింది. గ్రూప్ హౌసింగ్ సొసైటీ కిందే అన్ని ఇళ్లకు కరెంట్ కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉంటే.. సొసైటీకి సింగిల్ పాయింట్ కనెక్షన్(ఒకే కనెక్షన్) ఇవ్వాలని పేర్కొంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. మెట్రోపాలిటన్ నగరాల్లో కొత్త కరెంటు కనెక్షన్ కోసం ఏడు రోజులు, మున్సిపాలిటీల్లో 15రోజులు, గ్రామాల్లో అయితే 30 రోజులు ఆగాల్సి వచ్చేది. ఇంకా కేంద్ర విద్యుత్తు శాఖ తాజాగా విడుదల చేసిన రూల్స్‌లో ఏమున్నాయంటే..

1సొసైటీల్లో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కోసం ప్రత్యేకంగా కనెక్షన్ కావాలంటే జారీ చేయాలి 1మీటర్‌లో లోపాలు, కాలిపోవడం వంటి అంశాలపై దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లోపు కొత్త మీటర్ బిగించాలి. మీటర్ రీడింగ్‌లో లోపాలు ఉన్నట్లు గుర్తించి ఫిర్యాదు చేస్తే కొత్త మీటర్‌ను ఐదు రోజుల్లోగా బిగించడమే కాకుండా తప్పుడు బిల్లింగ్‌పై ఫిర్యాదును మూడు నెలల్లోపు పరిష్కరించాలి.

'ప్రజావాణి'కి 1203 దరఖాస్తులు

బేగంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 1203 దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె వారికి భరోసా ఇచ్చారు. గురుకులాల్లో చేపట్టిన నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని అభ్యర్థులు 'ప్రజావాణి'లో దివ్య దేవరాజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ నియామకాల్లో అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోందని, మొదటగా పై స్థాయి(డీఎల్, జేఎల్) నుంచి క్రింది స్థాయి (పీజీటీ, టీజీటీ) వరకు ఉద్యోగాలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా అభ్యర్థులు దివ్య దేవరాజన్‌ను కోరారు. అవరోహణ విధానం అమలు చేస్తూ అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం వెంటనే జీఆర్ఎల్ విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు ధరణి సమస్యతో భూములు కోల్పోయిన వారు, పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్‌ల బదిలీ

- శైలజా రామయ్యర్‌కు దేవదాయ శాఖ అదనపు బాధ్యతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌కు దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కలెక్టర్ పాటిల్ ప్రశాంత్ జీవన్‌ను సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్‌ను జనగామ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. కామారెడ్డి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) మిక్కిలినేని మను చౌదరిని బదిలీ చేసి సిద్దిపేట కలెక్టర్‌గా నియమించింది. జనగామ కలెక్టర్‌గా ఉన్న సీహెచ్ శివలింగయ్యను బదిలీ చేసి సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఇప్పటివరకు దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహించిన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది.

విశ్రాంత ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ కన్నుమూత

- ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో సేవలు
- సూళ్లూరుపేట నివాసంలో కన్నుమూత



సూళ్లూరుపేట/నెల్లూరు, ఫిబ్రవరి 23: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జన్నత్ హుస్సేన్(73) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కొన్నేళ్లుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కీర్తి ఎన్‌క్లేవ్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. 1977 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన.. ఉత్తరప్రదేశ్‌లో లఖ్‌నవూ సమీపాన ఓ కుగ్రామంలో 1951లో రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచి సామాన్య జీవితం గడిపిన ఆయన 1977లో ఐఏఎస్ సాధించి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాల్లో పనిచేశారు. నిజాయితీపరుడిగా, నిగర్విగా, అందరికీ అండగా ఉంటూ మంచిపేరు తెచ్చుకున్నారు. 1985-87లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్‌గా, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సేవలందించారు. సాంఘిక సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖలకు ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించారు. ఎక్సైజ్ కమిషనర్‌గా ఉన్నప్పుడు మంచి పేరు తెచ్చుకున్నారు. అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయినప్పుడు ఆయన్ను సీఎంవోలోకి తీసుకున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం విధివిధానాల రూపకల్పనలో జన్నత్ ముఖ్య పాత్ర పోషించారు. 2010 డిసెంబరు 31న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో రిటైరయ్యారు. అనంతరం రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. రిటైరయ్యాక తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఆయన స్థిరపడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ విదేశాల్లో ఉండగా.. కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. మృతదేహాన్ని బంధువులు హైదరాబాద్‌కు తరలించారు. శనివారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సీఎం సంతాపం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐఏయస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉత్తర డిస్కమ్‌లో 'సెస్' విలీనం!

- రాష్ట్ర ప్రభుత్వానికి టీఎస్ఈఆర్సీ సిఫారసు
- 94.88కోట్ల రెవెన్యూ లీకేజీ గుర్తింపుతో నిర్ణయం

హైదరాబాద్, సిరిసిల్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సొసైటీ(సెస్)ని ఉత్తర డిస్కమ్(టీఎస్ఎన్పీడీసీఎల్-వరంగల్)లో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ ఈఆర్సీ) ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు తెలంగాణ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి శుక్రవారం ఓ లేఖ పంపింది. సెస్‌లో భారీ అక్రమాలు జరిగినట్టు గుర్తించడంతో ఈ ప్రతిపాదన చేసినట్టు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ సరఫరా టారిఫ్‌లు నిర్ణయించేందుకు ఈఆర్సీ ఇటీవల సిరిసిల్లలో బహిరంగ విచారణ నిర్వహించింది. సెస్‌లో జరుగుతున్న వివిధ అవకతవకలపై ఈ కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో సెస్‌లో భారీగా అక్రమాలు జరిగినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించింది. దీంతో 2014-22 మధ్య కాలానికి సెస్ కార్యకలాపాలపై ఈఆర్సీ ఆడిట్ చేయించగా రూ.94.88 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం జరిగినట్టు తేలింది. ఉత్తర డిస్కమ్ నుంచి విద్యుత్ తీసుకుని వినియోగదారులకు సరఫరా చేస్తున్న సెస్ అందుకు తగిన విధంగా బిల్లులు వసూలు చేయడం లేదని గుర్తించింది. ఉత్తర డిస్కమ్‌కు సెస్ రూ. 558.44 కోట్లు బకాయిలు ఉన్నట్టు ఆడిట్‌లో తేలింది. ఆడిట్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని 2024 జనవరి 10న సెస్ ఎండీని ఈఆర్సీ ఆదేశించింది. కానీ, చర్యలు తీసుకోలేదు. దీంతో సెస్‌ను రద్దు చేసి ఉత్తర డిస్కమ్‌లో విలీనం చేయాలని ఈఆర్సీ సిఫారసు చేసింది. అంతేకాక, బిల్లింగ్ లోపాలను గుర్తించేందుకు హైటెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్లపై ఆడిట్ చేయాలని ఉత్తర డిస్కమ్‌ను కోరింది. ఒకే ప్రాంగణానికి సెస్ ఒకటికి మించి లోటెన్షన్(ఎల్‌టీ) కనెక్షన్లు జారీ చేయగా వాటిని ఇతర అవసరాలకు వాడుతున్నారని కమిషన్ గుర్తించింది. ఎల్‌టీ కనెక్షన్‌లను పారిశ్రామిక, వాణిజ్య వినియోగానికి వాడుతున్నారని స్పష్టం చేసింది. అలాగే, ఆడిటింగ్ ద్వారా గుర్తించిన పలు అక్రమాలను కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది. కాగా, 1970లో ఏర్పాటైన సెస్‌కు ఈ ఏడాది జనవరి నాటికి రూ.714.57 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రావాల్సినవే రూ.624.92 కోట్లు దాకా ఉన్నాయి. సెస్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ విధుల్లో ఉన్న ఇద్దరు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవిత తరఫున ఎన్నికల ప్రచారం చేశారని పేర్కొంటూ నమోదైన క్రిమినల్ కేసుపై హైకోర్టు స్టే విధించింది. - హైదరాబాద్

పిల్లబచ్చాలు మా సినిమాకు రావొద్దు



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ 'తంత్ర'. ధనుష్ రఘుముద్రి కథానాయకుడు. సలోనీ కీలక పాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవిచైతన్య నిర్మిస్తున్నారు. తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' టీమ్ వినూత్నంగా స్పందించింది. 'మా సినిమాకు పిల్లబచ్చాలు రావొద్దు' అని పేర్కొంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. హారర్ ఎలిమెంట్స్‌తో తమ సినిమా థ్రిల్ చేస్తుందనీ, త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్‌ఆర్ ధ్రువన్. సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల.

బ్యాడ్‌బాయ్స్ లవ్‌స్టోరీ



వినూత్న ప్రేమకథా చిత్రం 'వుయ్ లవ్ బ్యాడ్‌బాయ్స్'. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనక దుర్గారావు నిర్మించారు. ఇటీవలే సెన్సార్ పూర్తయిన ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వశిష్ఠ విడుదల చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. అలీ, సప్తగిరి, భద్రం ప్రధాన తారాగణం. నేటి ట్రెండ్‌కు తగినట్లు కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. రఘు కుంచెతో కలసి భూషణ్ జాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వీకే రామరాజు.

దుబాయ్‌లో గామా అవార్డుల వేడుక



తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా మార్చి 3న దుబాయ్‌లో 'గామా' అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. జ్యూరీ చైర్మన్, సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు... నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకుడు వీఎన్ ఆదిత్య తదితరులు శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన ట్రోఫీని ఆవిష్కరించారు. పలు విభాగాల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తామనీ, పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారనీ కోటి తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి త్రిమూర్తులు నిర్వహిస్తున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని డీవీవీ దానయ్య, వీఎన్ ఆదిత్య చెప్పారు.

మార్కెట్‌లో మహాలక్ష్మి సందడి



'కేరింత' ఫేం పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. "మార్కెట్ మహాలక్ష్మి' టీజర్‌లో హీరో హీరోయిన్ పాత్రలు ఫన్నీగా అనిపించాయి. పార్వతీశం కామెడీ టైమింగ్ బావుంది. దర్శకుడి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. 'ఆకట్టుకునే ప్రేమకథతో పాటు కుటుంబ అనుబంధాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.


ప్రపంచ సినిమాకు పెద్దన్నయ్య లాంటి హాలీవుడ్ నుంచి అగ్ర కథానాయకుల చిత్రాలతో పాటు ప్రేక్షకుల మది దోచిన పలు భారీ యాక్షన్ చిత్రాలు మార్చిలో విడుదలకు క్యూ కడుతున్నాయి.ఈ మండు వేసవిలో అలరించడానికి సిద్ధమవుతున్న ఈ చిత్రాల్లో ఎక్కువ శాతం సీక్వెల్స్ ఉండటం గమనార్హం. ఆ చిత్రాల వివరాలపై ఓ లుక్ వేద్దాం

మార్చిలో హాలీవుడ్ చిత్రాల సందడే సందడి













డ్యూన్ పార్ట్ 2: అరాకిస్ అనే వింత ప్రపంచపు నేపథ్యంలో రూపొందిన డ్యూన్ పార్ట్-1 అటు విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను కొల్లగొట్టింది. దీనికి కొనసాగింపుగా తెరకెక్కిన రెండో భాగం మార్చి 15న విడుదలవుతోంది. ఇసుక ఎడారుల్లో ఎదురైన ఊహించని ప్రమాదాలని జయించి చిత్ర కథానాయకుడు పాల్ అట్రిడిస్ (తిమోథీ చాల్మెట్) ఎలా తమ కుటుంబ వారసత్వాన్ని, ప్రజల భవిష్యత్తును రక్షిస్తాడో ఇందులో చూపించనున్నారు. ఈ చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెనేయు బ్లేడ్ రన్నర్ 2049, అరైవల్, ఎనిమీ, ప్రిజనర్స్ లాంటి విభిన్నమైన చిత్రాలతో భారతీయులకు పరిచయస్తుడే.

కుంగ్ ఫూ పాండా 4: అబాలగోపాలాన్ని ఆకట్టుకునే చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. ఆ కోవలోకే చెందిన ఈ సిరీస్ విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఇందులోని మొదటి మూడు భాగాల్లో కథానాయకుడు 'పో' (పాండా) చేసే విన్యాసాలు చూడ్డానికి ఎంతో గమ్మత్తుగా ఉంటాయి. తన గురువు షిఫూ బోధించే తాత్వికత ఆలోచింపజేస్తుంది. ప్రతినాయకుడు టై లుంగ్ (టైగర్) ఆగడాలను అడ్డుకోవడం లెక్కకు మించిన పనే అయినా పో ఎలా తనని అడ్డుకుంటాడనేది ఆద్యంతం ఆసక్తికరంగా, వినోదదాయకంగా మలిచారు. చిత్ర నాలుగో భాగంలో పో తాత్విక గురువుగా మారడం, ఆ క్రమంలో ఎదురయ్యే సవాళ్ల చుట్టూ కథనం సాగుతుంది. మైక్ మిచెల్, స్టెఫెనీ మా స్టెయిన్ సంయుక్తంగా దీనికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం కూడా మార్చి 15నే ప్రేక్షకుల్ని పలకరించనుంది.



ఆర్థర్ ది కింగ్: పెంపుడు జంతువులతో మనుషుల స్నేహం ఆధారంగా గతంలో ఎన్నో చిత్రాలు వచ్చి ప్రేక్షకులని భావోద్వేగానికి లోను చేసి కంటతడి పెట్టించాయి. సెల్మాన్ జోన్స్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మార్క్ వాల్‌బర్గ్ నటిస్తున్నాడు. అడ్వెంచర్ రేసర్ పాత్ర పోషించే హీరో ఇందులో తన జీవితంలో ఆఖరి సారి చేసే రేసు కోసం ఓ వీధి కుక్కను(ఆర్థర్) జట్టులో చేర్చుకుంటాడు. 700 కిలోమీటర్లు.. 10 రోజుల పాటూ జరిగే ఈ రేసులో విభిన్న దశలను దాటి హీరో, ఆర్థర్‌తో ఎలా విజయ తీరాలకు చేరుతాడనేదే కథ. భావోద్వేగభరితంగా సాగే ఈ చిత్రం మానవాళికి చిరకాల మిత్రుడైన కుక్కతో ఉండే స్నేహాన్ని మరోసారి హృద్యంగా ఆవిష్కరించనుంది. ఈ సినిమా మార్చి 15న ప్రేక్షకుల హృదయాలను బరువెక్కించనుంది.

గాడ్జిల్లా x కాంగ్ - ది న్యూ ఎంపైర్: గాడ్జిల్లా, కింగ్ కాంగ్ తెలియని ప్రేక్షకులుండరంటే అతిశయోక్తి కాదు. మూడేళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సొంతం చేసుకున్న గాడ్జిల్లా వర్సెస్ కాంగ్‌కు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతోంది. 2021 విడుదలైన ఈ చిత్రంలో గాడ్జిల్లా, కాంగ్ మధ్య పోరాటం ఎంతో రసవత్తరంగా, ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటుంది. ఈ సారి గాడ్జిల్లా, కాంగ్ కలిసి మానవాళి రక్షణ కోసం వింత జీవుల పని పట్టడం ఈ చిత్ర కథాంశం. ఇందులో ఉండే పోరాట ఘట్టాలు ఊహలకతీతంగా ఉంటూ.. ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తాయని ట్రైలర్‌తోనే చిత్ర బృందం హింటిచ్చింది. అదమ్ విన్‌గార్డ్ ఈ చిత్రానికి దర్శకుడు. భారీ విజువల్ ఎఫెక్ట్స్, స్పెషల్ ఎఫెక్ట్స్, థ్రిల్లింగ్ యాక్షన్ ఎలిమెంట్స్. ఇలా ఎన్నో ప్రత్యేక హంగులతో నిండిన ఈ చిత్రం మార్చి 29న రిలీజ్ అవుతోంది.

రోడ్ హౌస్: విలక్షణ నటుడు జేక్ గిల్లెన్హాల్ నటించిన ఈ చిత్రం 1989లో ఇదే పేరుతో వచ్చిన సినిమాకు ఓ రకంగా సీక్వెల్ అనే చెప్పాలి. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రం మార్చి 21న విడుదలవుతోంది.

రికీ స్టానికీ: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) ద్వారా యువతరానికి సుపరిచితుడైన నటుడు జాన్ సెనా ఇందులో నటిస్తున్నాడు. కామెడీ ఫ్యాంటసీ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రానికి పీటర్ ఫ్యారెల్లీ దర్శకుడు. ఈ చిత్రం మార్చి 7న విడుదలవుతోంది.

మరోసారి క్వీన్ రాక



కంగనా రనౌత్‌కు కథానాయికగా విశిష్ఠ గుర్తింపు తెచ్చిన బాలీవుడ్ చిత్రం 'క్వీన్'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. చాలాకాలంగా ప్రేక్షకులు 'క్వీన్'కు సీక్వెల్ చేయాలని కంగనను కోరుతున్నారు. వారి కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. 'క్వీన్ 2' చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు దర్శకుడు వికాస్ బహల్ తెలిపారు. సీక్వెల్‌లోనూ కంగన రనౌత్ రాణీగా లీడ్ రోల్ లో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించి, ఆగస్టు కల్లా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తామని వికాస్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి పోటీ!

» లోక్‌సభకు చాన్స్ ఇవ్వాలంటున్న కాంగ్రెస్ నేత




హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)/జడ్చర్ల: "నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేస్తా. అందుకే నేను ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా చేశా. రాజీనామా పత్రాన్ని పది రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశా" అని మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రతినిధి పదవిని తనకు అప్పగించిన సందర్భంలోనే నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేసే అంశంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చానని తెలిపారు. ఢిల్లీ పదవి ఎంపీ టికెట్‌కు అడ్డంకిగా ఉన్నట్లయితే.. తన రాజీనామాను ఆమోదించాలని కోరానని పేర్కొన్నారు. పార్టీ టికెట్ కేటాయింపు అంశంపై నిర్వహించే సర్వేలలో తనకే మద్దతుగా ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఒకవేళ తనకు కాకుండా ఇతరులకు టికెట్ కేటాయించాల్సి వస్తే, ఎందుకు కేటాయించాల్సి వచ్చిందనే వివరాలను తనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు తెలియజేయాలని కోరినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి బరిలో ఉంటానని ముఖ్యమంత్రితో పాటు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా దీప్‌దాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్సూర్ అలీఖాన్, రోహిత్‌చౌదరి, విష్ణునాథ్‌లకు చెప్పానన్నారు. రెండు పదవులను నిర్వహించే శక్తి తనకు ఉన్నదని, అయితే ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం రెండు పదవులు ఉండకూడదన్న నిర్ణయాన్ని గౌరవించి రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు ఆయన చెప్పారు.

నాగర్‌కర్నూల్ కోసం పోటా పోటీ!

నాగర్‌కర్నూల్ లోకసభ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఓవైపు మల్లు రవి పోటీకి సిద్ధంగా ఉండగా.. మరోవైపు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సైతం ఈ సీటును ఆశిస్తున్నారు. ఈయన గత అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్‌నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వీరిద్దరి మధ్య పోటీ ఇలా ఉండగానే.. జనవరి 20న తెలంగాణ ప్రభుత్వం మల్లు రవిని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించింది. ఈ నియామకంతో ఇక మల్లు రవికి నాగర్‌కర్నూల్ నుంచి అవకాశం లేకపోవచ్చని అనుకున్నారు. లాభదాయక పదవిలో ఉంటే ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఉండదన్న అంచనానే దానికి కారణం. అయితే ప్రత్యేక ప్రతినిధిగా జీతం తీసుకోకుండా ఉంటే.. ఎంపీగా పోటీ చేసేందుకు ఇబ్బంది ఉండదని మల్లు రవి తన సన్నిహితులతో చెప్పేవారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కేవీపీ రామచంద్రరావు కూడా ఒకవైపు రాజ్యసభ సభ్యుడిగా, మరోవైపు ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పనిచేశారని పేర్కొనేవారు. ఏదేమైనా నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేయడమే తనకు ప్రధానం అని మల్లు రవి కొన్నిరోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చెప్పారు. సీటు రేసులో మరింత బలంగా ఉండేందుకే ఆయన ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. మరోవైపు మాజీ ఎంపీ మందా జగన్నాథం సైతం ఇదే స్థానం నుంచి టికెట్ రేసులో ఉన్నారు.

లోకం తీరు



సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ దారుణ హత్య

చేవెళ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషనులో విధులు నిర్వహిస్తున్న ఓ ఆపరేటర్‌ను ఇద్దరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూర్ సబ్‌స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శంకర్‌పల్లి మండలం మోకిలతండాకు చెందిన హర్యా నాయక్(40) రెండేళ్లుగా ఆలూర్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆలూర్‌లోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గురువారం అర్ధరాత్రి సబ్‌స్టేషనుకు వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ హర్యా నాయక్‌తో గొడవపడ్డారు. అనంతరం హర్యాను కర్రలతో విచక్షణా రహితంగా కొట్టి బండరాయి తలపై వేసి హత్య చేసి పారిపోయారు. అయితే అంతకుముందే గ్రామ వాటర్‌మెన్‌కు ఫోన్ చేసి సబ్‌స్టేషనుకు రమ్మని హర్యా చెప్పాడు. వాటర్‌మెన్ వచ్చి రక్తపుమడుగులో పడి ఉన్న హర్యానాయక్‌ను చూసి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల పనిచేసే ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

షణ్ముక్ జశ్వంత్‌కు బెయిల్

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో అదుపులోకి తీసుకున్న యూట్యూబర్ షణ్ముక్ జశ్వంత్‌ను పోలీసులు విడుదల చేశారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 41ఏ కింద నోటీసులిచ్చారు. మరోవైపు, షణ్ముక్ సోదరుడు సంపత్ వినయ్‌ను అత్యాచారం కేసులో చర్లపల్లి జైలుకు తరలించారు. విశాఖపట్నానికి చెందిన వైద్యురాలిని పెళ్లి చేసుకుంటానని చెప్పి పలుమార్లు అత్యాచారం చేసిన కేసులో సంపత్ వినయ్ నిందితుడు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు గురువారం వినయ్ ఉంటున్న ఫ్లాట్‌లో తనిఖీ చేయగా అక్కడ గంజాయి దొరికింది. దీంతో, వినయ్‌తో పాటే ఉంటున్న షణ్ముక్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, అత్యాచారం, డ్రగ్స్.. ఈ రెండింటిపైనా దర్యాప్తు జరుగుతోందని నార్సింగ్ పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో 'భగీరథ'ఆపరేటర్ ఆత్మహత్య

తిప్పర్తి, ఫిబ్రవరి 23: అప్పుల బాధ భరించలేక మిషన్ భగీరథ పంప్ హౌస్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. గడ్డికొండారం గ్రామానికి చెందిన కస్పరాజు నవీన్(27) మిషన్ భగీరథ పంపుహౌస్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం ఖాజీరామారం గ్రామానికి చెందిన శివానితో వివాహమైంది. నవీన్ తనకున్న అయిదెకరాలకు తోడు మరో అయిదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఇందుకోసం రూ. 4 లక్షల మేర అప్పు చేశాడు. ఈ సీజన్‌లో భూగర్భ జలాలు ఒక్కసారిగా తగ్గి బోర్లు పొయ్యకపోవడంతో 7 ఎకరాలకు పైగా పైరు ఎండిపోయింది. దాంతో మనస్తాపానికి గురైన నవీన్ శుక్రవారం తాను విధులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ పంపుహౌస్ లోపల మెట్లకు ఉరివేసుకున్నాడు. నవీన్ మృతి చాలీచాలని జీతాలే కారణమని అతడి సహచర కార్మికులు ఆరోపించారు.

ప్రతి 48 గంటలకు ఒకరు..

అవినీతి కేసుల్లో ఏసీబీకి పట్టుబడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

» ఈ ఏడాది 53 రోజుల్లో 28 కేసులు

» లంచావతారాలపై ఏసీబీకి ఫిర్యాదులు

» సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టాక అధికారులకు ఫ్రీ హ్యాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భూమి పట్టా మార్పిడికి లంచం.. మెస్ బిల్లులు మంజూరుకూ లంచం.. టెండర్ ఓకే చేసేందుకూ లంచం..! ఇదీ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో అవినీతి విశ్వరూపం. ప్రతి శాఖలో.. చిన్న పనికైనా అధికారుల చేయి తడపనిదే ఫైలు ముందుకు కదలడం లేదు. నేరుగా లంచం తీసుకునేవారు కొందరైతే.., 'ఏదైనా ఉంటే చూసుకుంటా' అని ప్రజలు స్వయంగా చెప్పేవరకు ఫైలు నానబెట్టే అధికారులు మరికొందరు. ఇలాంటి లంచావతారాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో కేసుల సంఖ్య అమాంతంగా పెరిగింది. నిరుడు రాష్ట్రంలో 94 నమోదవగా.. ఇపుడు మొదటి 53 రోజుల్లోనే 28 కేసులు నమోదయ్యాయి. అంటే.. సగటున ప్రతి 48 గంటలకు ఒకటి అన్నట్లు. కాగా, అవినీతి అధికారుల ఇళ్లలో తనిఖీ చేస్తే గుట్టలకొద్దీ నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు బయటపడుతున్నాయి. కొందరైతే రూ.వందల కోట్లకు ఎగబాకారు. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ ఇంటిపైన చెత్త మాటున రూ.లక్షలు దాచారు. ఈ కేసులో వచ్చే వారం ఐఏఎస్ అధికారిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నట్లు తెలిసింది. గిరిజన, సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ జగజ్యోతి కేసులో దిండు కవర్‌లోనూ డబ్బులు బయటపడ్డాయి.

టాప్ 3లో రెవెన్యూ, పోలీస్

సామాన్య ప్రజలకు ఎక్కువ అవసరాలుండే రెవెన్యూ మున్సిపల్, పట్టణాభివృద్ధి, పోలీస్ శాఖల్లోనే అవినీతి ఎక్కువగా ఉంది. హోటల్, ఇల్లు, కార్యాలయం అక్కడా, ఇక్కడ అనే తేడా లేకుండా లంచం డిమాండ్ చేస్తున్నారు. కేసులో ఇరికించకుండా ఉండేందుకు, కేసు నుంచి పేరు తొలగించేందుకు, ఇలా కారణం ఏదైనా ఖాకీలు వసూల్ రాజాలుగా మారుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏసీబీ చీఫ్‌గా సీవీ ఆనంద్‌ను నియమించింది. వరుసగా సమీక్షలు నిర్వహించిన ఆయన.. ఏ స్థాయి అధికారిపై అయినా అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే మరో ఆలోచన లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్వేచ్ఛ ఇచ్చారు. కీలక కేసుల్లో కేవలం వాట్సాప్‌తోనే ఏసీబీ చీఫ్‌నకు సమాచారం ఇచ్చి అవినీతి అధికారులను ట్రాప్ చేసిన సందర్భాలు ఉన్నాయి.

ప్రతి పనికీ పైసలే.. 73% బాధితులే

ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందేందుకు లంచం ఇవ్వక తప్పలేదని 73% సామాన్య ప్రజలు వెల్లడించినట్లు ఓ జాతీయ సంస్థ సర్వేలో తేలింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్‌లో రవాణా, రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్యం తదితర 11 శాఖలపై సర్వే చేసింది.

బినామీలపై కఠిన చర్యలు..

అవినీతి కేసుల్లో పట్టుబడకుండా, దొరికినా ఇబ్బంది లేకుండా అధికారులు బినామీలను ఏర్పాటు చేసుకున్నారు. వీరిని గుర్తించడంతోపాటు బినామీల చట్టప్రకారం చర్యలకు ఏసీబీ సిద్ధమైంది. కీలకమైన కేసుల్లో బినామీలను గుర్తించి.. బినామీ ట్రాన్సాక్షన్ రిపోర్టును ఐటీ విభాగానికి పంపిస్తోంది. అక్కడ కేసులు నమోదు చేసి ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చు. అక్రమార్కులు సాంకేతిక పరిజ్ఞానంతో తప్పించుకుంటుండడంతో.. పాస్‌వర్డ్ లేకుండా కంప్యూటర్, ఫోన్ తెరవడం, డిలీటెడ్ సమాచారాన్ని రాబట్టేలా సీబీఐ సహకారంతో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు చేశారు.

ఫిర్యాదు చేసేందుకు మార్గాలు ఇవి..

వెబ్‌సైట్ : www.acb.telangana.gov.in
ఫేస్‌బుక్: http//www.facebook.com/ACBTelanagana,
వాట్సాప్ : 9440446106 టోల్ ఫ్రీ నెం - 1064

ఇటీవల ఏసీబీకి చిక్కిన పెద్ద చేపలివే

- మెస్ బిల్లు చెల్లించేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ కాకతీయ వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఏసీబీకి చిక్కాడు.
- ఔషధాల టెండర్ కోసం రూ.3 లక్షలు తీసుకుంటూ నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్ పట్టుబడ్డారు.
- బిల్లుల మంజూరుకు రూ.84 వేలు తీసుకుంటూ గిరిజన, సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ) కె. జగజ్యోతి అడ్డంగా దొరికిపోయారు.
- హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో రూ.వందల కోట్ల అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.
- పట్టాదారుపాస్ బుక్ కోసం రైతు నుంచి రూ.40 లక్షలు లంచం డిమాండ్ చేసిరూ రూ.10 లక్షలు తీసుకుంటూ శామీర్‌పేట్ తహసీల్దార్ సత్యనారాయణ ఏసీబీకి చిక్కాడు.

ఏపీ ఓకే అంటేనే ఆర్ అండ్ బీలో పదోన్నతులు

» సీనియారిటీ జాబితాతో ఏపీకి లంకె

» దశాబ్దాలుగా.. ఆర్ అండ్ బీలో కానరాని సీనియారిటీ లిస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రం సిద్ధించి పదేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఆర్ అండ్ బీ శాఖలో పదోన్నతులకు అడ్డంకులు తీరలేదు. అందుక్కారణం.. ఆ శాఖ అధికారుల సీనియారిటీ లిస్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపాల్సి ఉండడమే..! ఫలితంగా పదోన్నతులతోపాటు.. కొత్త నియామకాల అంశం పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఆర్ అండ్ బీతోపాటు మరికొన్ని శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా 200 ఏఈఈ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అవ్వగా.. సీనియారిటీ జాబితా వచ్చేదాకా.. ఎటూ తేల్చలేని పరిస్థితి నెలకొంది. ఆర్ అండ్ బీ శాఖలో 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారి సీనియారిటీ జాబితాను రూపొందించినా.. అప్పట్లో పలు కారణాలతో హైకోర్టు దాన్ని రద్దు చేసింది. 2014లో రాష్ట్రం విడిపోయాక.. సీనియారిటీ జాబితాను ఏపీ తేల్చలేదు. 2018లో ప్రభుత్వం కొత్త సర్వీస్ రూల్స్‌ను రూపొందించినా.. ఆర్ అండ్ బీలో ఈఈ, ఎస్ఈ, సీఈ స్థాయి పోస్టులన్నీ ఇన్‌చార్జులతోనే కొనసాగుతున్నాయి.

రమేశ్ రాథోడ్ నిర్దోషి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ, బీజేపీ నేత రమేశ్ రాథోడ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. అటవీ అధికారులను అడ్డుకున్నారని.. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ 2006లో నమోదైన కేసులో జిల్లా కోర్టులు విధించిన శిక్షను రద్దు చేస్తూ జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ కనుమరుగు

» బీజేపీకి పెరుగుతున్న మద్దతు: కిషన్ రెడ్డి

» కుటుంబ పార్టీలకు గుణపాఠం: కేంద్ర మంత్రి అశ్విన్‌కుమార్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో కాంగ్రెస్ పార్టీలు ఉండవని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, కాగజ్‌నగర్ బీజేపీ విజయ సంకల్ప యాత్ర సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో చేసిందేమి లేదని, ఇసుక మాఫియా, భూకబ్జాలు, లిక్కర్ మాఫియాలు రాజ్యమేలాయని ఆరోపించారు. దీన్ని సహించని తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు భవిష్యత్‌లేకుండా చేశారని పేర్కొన్నారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కుంభకోణాలు వెలుగు చూశాయన్నారు. అవినీతి లేని నాయకుడు ప్రధాని మోదీ అని, అవినీతి రహిత పార్టీ బీజేపీ అని చెప్పారు. దేశంలోని అన్నివర్గాల నుంచి బీజేపీకి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అవినీతిలో కూరుకుపోయి ప్రజల చేత తిరస్కరింపబడిన కుటుంబ పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని కేంద్ర మంత్రి అశ్విన్‌కుమార్‌చౌబే అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సభలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాన్ని నడుపుతున్న ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికా రం చేజిక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని జోస్యం చెప్పారు. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరోసారి బలపర్చడానికి సిద్ధంగా ఉన్నారనీ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చెయడానికి నానా తంటాలు పడిందని, అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ఏవిధంగా చేస్తుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అవినీతికి కాంగ్రెస్ గ్యారెంటీ: లక్ష్మణ్

అవినీతికి కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలు, వంశపారపర్య రాజకీయాలు, కుటుంబ రాజకీయాలు, మైనారిటీ బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలు, హిందువుల మనోభావాలను దెబ్బతీసే రాజకీయాలు అని దుయ్యబట్టారు.

2న రాష్ట్రానికి అమిత్‌షా!

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వచ్చేనెల 2వ తేదీన రాష్ట్ర పర్యటనకు రానున్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారీ రోడ్డు షోతో పాటు బహిరంగసభ నిర్వహించాలన్న చర్చ పార్టీ ముఖ్యనేతల్లో జరుగుతోంది. అమిత్ షా పర్యటన సందర్భంగా వినూత్నరీతిలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. రెండు, మూడురోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

26 నుంచి సంజయ్ మలివిడత పాదయాత్ర

బీజేపీ ఎంపీ బండి సంజయ్ మలివిడత ప్రజాహిత పాదయాత్ర ఈనెల 26నుంచి ప్రారంభం కానుంది. హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహెడ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్ర రోజూ కనీసం 10 గ్రామాల్లో కొనసాగేలా రూట్‌మ్యాప్ రూపొందించారు. వచ్చేనెల 2నాటికి హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో సంజయ్ పాదయాత్ర పూర్తిచేయనున్నారని పార్టీనేతలు తెలిపారు.

క్రైమ్ కథా చిత్రమ్..!

మ్యాట్రిమోనీ సైట్‌లో సైబర్ నేరగాడి ఫేక్ ప్రొఫైల్

» ఫొటో నచ్చడంతో చాటింగ్ చేసిన యువతి

» పెట్టుబడిగా అడిగితే పలు విడతల్లో 40 లక్షలు

» మోసపోయానని తెలియడంతో ఫొటోలోని

» యువకుడిని పట్టుకొని పెళ్లికి ప్రతిపాదన

» అతను తిరస్కరించడంతో కిడ్నాప్

» నిర్బంధించి ఐదు గంటల పాటు చిత్రహింసలు



వివరాలు వెల్లడిస్తున్న మల్కాజిగిరి ఏసీపీ పురుషోత్తం రెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆమె నుంచి అతడు పైసా తీసుకోలేదు! ఆమెతో అసలు పరిచయం కూడా లేదు. ఆమె మాత్రం మనుషులను పెట్టి మరీ అతడిని కిడ్నాప్ చేయించింది. ఇస్తే రూ.40 లక్షలైనా ఇవ్వు, లేదంటే తనను పెళ్లయినా చేసుకో అంటూ హెచ్చరించింది. నోరెళ్లబెట్టిన అతడు.. నేనెందుకు డబ్బివ్వాలి? అయినా ఈ పెళ్లి గోల ఏమిటి? అని ప్రశ్నించడంతో కిడ్నాప్ చేయించిన మనుషులతోనే యువకుడిని చితగ్గొట్టించింది. ఆ చెర నుంచి ఎలాగోలా బయటపడ్డ బాధితుడు ఆ యువతి నుంచి తనను కాపాడాలంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఉప్పల్ పరిధిలో ఈ ఘటన వెలుగు చూసింది. మరి.. తానివ్వని డబ్బు కోసం అతడిని ఆ యువతి ఎందుకు వేధించింది? పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఎందుకు ఒత్తిడి తెచ్చింది? ఈ అనుమానాలు తీరాలంటే ఓ థ్రిల్లింగ్ సినిమా తరహాలో జరిగిన 'ఫ్లాష్ బ్లాక్' లోకి వెళ్లాల్సిందే!! ఏసీపీ పురుషోత్తం రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన బోగిరెడ్డి తృష్ణ (31) అక్కడే ఓ డిజిటల్ సంస్థను నిర్వహిస్తోంది. ఈమెకు గతంలోనే పెళ్లయినా భర్త నుంచి విడాకులు తీసుకొని దూరంగా ఉంటోంది. మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకొని మ్యాట్రిమోనీ సైట్లలో వరుడి కోసం వెతకడం మొదలుపెట్టింది. భారత్ మ్యాట్రిమోనీ సైట్‌లో చైతన్య రెడ్డి పేరుతో ఓ ప్రొఫైల్‌ను చూసింది. అయితే అది ఓ ఫేక్ ప్రొఫైల్! ఎవరైనా సంప్రదిస్తే.. మాయమాటలతో అందినకాడికి వసూళ్లు చేయాలనే పక్కా పథకంతో ఓ సైబర్ నేరగాడు ఆ ప్రొఫైల్ పెట్టాడు. వరుడి ఫొటోగా ఉప్పల్‌లోని న్యూ భరత్‌నగర్‌లో నివసిస్తున్న ప్రణవ్ శిష్టా (27) అనే యువకుడి ఫొటోను పెట్టాడు. ఇవేమీ తెలియని తృష్ణకు చైతన్య రెడ్డి పేరుతో ఉన్న ఆ ఫొటో ప్రొఫైల్ నచ్చడంతో చాటింగ్ మొదలు పెట్టింది. చాటింగ్ ద్వారా అవలి వైపు 'వ్యక్తి' భావాలు కూడా నచ్చడంతో అతడినే పెళ్లి చేసుకోవాలనుకుంది. ఇదే మాటను చాటింగ్‌లో భాగంగా వ్యక్తీకరిస్తే ఆవలి వైపు నుంచి ఓకే అనే మెసేజ్ వచ్చింది. అయితే తానో సైబర్ నేరగాడితో చాటింగ్ చేస్తున్నానే విషయం తెలియని తృష్ణ.. లేని చైతన్య రెడ్డితో అనుబంధాన్ని పెంచుకుంది! ఇక్కడే తృష్ణ బలహీనతను గుర్తించిన ఆ సైబర్ నేరగాడు ఆమెకు మాయమాటలు చెప్పి వసూళ్లకు తెరతీశాడు. తన వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలని.. లాభాల్లో ఎక్కువ వాటా ఇస్తానని చెప్పడంతో తృష్ణ ఇట్టే నమ్మేసింది. తన ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.40 లక్షలను అతడి ఖాతాకు బదిలీ చేసింది. కొన్నాళ్ల తర్వాత తన డబ్బులు ఇవ్వాలని ఆమె అడిగితే.. ఆవలి వైపు నుంచి స్పందన రాలేదు. ఫలితంగా తాను మోసపోయానని తెలుసుకున్న తృష్ణ.. 'మ్యాట్రిమోనీలోని ఫొటో' సాయంతో ఆ యువకుడు ఎవరనేది తెలుసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆ ఫొటో ప్రణవ్ శిష్టాది అని తెలుసుకుంది. అతడి ఫోన్ నంబరూ సంపాదించింది. అతడితో మాట్లాడింది. ఆ ఫొటో తనదేనని.. అయితే డబ్బులు తీసుకుంది మాత్రం తాను కాదని ఆమెకు ప్రణవ్ చెప్పాడు. కంగుతిన్న ఆమె, తనకు ఎదురైన అనుభవాన్ని పూర్తిగా అతడికి చెప్పింది. వెంటనే ప్రణవ్, సదరు మ్యాట్రిమోనీ సైట్‌పై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇది జరిగాక.. ప్రణవ్‌తో తృష్ణ పరిచయం పెంచుకుంది. అతడితో తరచూ మాట్లాడేది. అప్పటికే ప్రణవ్ ఫొటోను చూసి అనుబంధాన్ని పెంచుకోవడం, అతడినే పెళ్లి చేసుకోవాలని అనుకోవడంతో ఇదే మాటను ప్రణవ్‌తో చెప్పింది. ఆమె పెళ్లి ప్రతిపాదనను ప్రణవ్ తిరస్కరించాడు. ఆమెను దూరం పెట్టాడు. ఆమె నంబరునూ బ్లాక్ చేశాడు. ఎలాగైనా ప్రణవ్‌నే పెళ్లి చేసుకోవాలని అనుకున్న తృష్ణ, అతడిని కిడ్నాప్‌కు ప్రణాళిక వేసింది. అతడి కారుకు ఓ ట్రాకర్‌ను అమర్చి కదలికలపై నిఘా పెట్టింది. ప్రణవ్‌ను కిడ్నాప్ చేసేందుకు తమ సంస్థలో పనిచేస్తున్న వ్యక్తిని పురమాయించింది. ఇందుకు అతడికి రూ. 50 వేలు ఇచ్చింది. ప్రణవ్ కదలికలపై నిఘా పెట్టిన సదరు వ్యక్తి మరో నలుగురితో కలిసి ఈనెల 11న ఆఫీసు నుంచి ఇంటికి వెళుతున్న ప్రణవ్‌ను అడ్డగించి కిడ్నాప్ చేశాడు. మాదాపూర్‌లో ఉన్న తృష్ణ కార్యాలయానికి తరలించి ఐదు గంటల పాటు తీవ్రంగా కొట్టారు. చివరకు బాధితుడు ప్రణవ్, తృష్ణ ఫోన్ కాల్స్‌కు స్పందిస్తానని చెప్పడంతో వదిలేశారు. వెంటనే ఈ ఘటనపై ప్రణవ్, ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితురాలు తృష్ణను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తృష్ణ వద్ద నుంచి సెల్‌ఫోన్‌తోపాటు బాధితుడి కారుకు అమర్చిన ట్రాకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ చేసేందుకు తృష్ణకు సహకరించిన నిందితులు పరారీలో ఉన్నారని ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు.


నిందితురాలు త్రిష్ణ


బాధితుడు ప్రణవ్

యాసంగి ధాన్యం టెండర్లు ఖరారు!

» 12 లాట్లను దక్కించుకున్న నాలుగు ఏజెన్సీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గతేడాది యాసంగి ధాన్యం టెండర్లను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎట్టకేలకు ఖరారు చేసింది. ఈ మేరకు అత్యధిక బిడ్డింగ్ కోట్ చేసిన హెచ్-1 బిడ్డర్లకు శుక్రవారం రాత్రి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించింది. క్వింటాలు ధాన్యానికి రూ.1,920 నుంచి రూ.1,960 చొప్పున దాఖలు చేసిన బిడ్డర్లను ఖరారు చేసినట్లు సమాచారం. గతేడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలవగా 30 బిడ్లు దాఖలయ్యాయి. మొత్తం ఏడు ఏజెన్సీలు పోటీలో నిలిచాయి. ఇందులో హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్(హాకా) దాఖలు చేసిన బిడ్లను పరిగణనలోకి తీసుకోలేదు. ఏడాదికి రూ.200 కోట్ల వార్షిక టర్నోవర్ లేకపోవడంతో హాకాను టెండర్ల ప్రక్రియ నుంచి తప్పించారు. ఆరు ఏజెన్సీలు దాఖలు చేసిన బిడ్డింగ్‌లను పరిగణనలోకి తీసుకోగా.. కేంద్రీయ భండార్, న్యాకాఫ్, మంచుకొండ ఆగ్రోటెక్, హిందుస్థాన్ ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీలు క్వింటాలుకు రూ.1,920 నుంచి రూ.1,960 చొప్పున బిడ్డింగ్ దాఖలు చేసి టెండర్లు దక్కించుకున్నట్లు సమాచారం. మరో రెండు ఏజెన్సీలు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ లలిత ఇండస్ట్రీస్, పట్టాభి ఆగ్రోఫుడ్స్ దాఖలు చేసిన బిడ్డింగ్ విలువ తక్కువ ఉండటంతో వీటిని తప్పించినట్లు తెలిసింది. వాస్తవానికి తాజాగా టెక్నికల్ బిడ్లు, ఫైనాన్షియల్ బిడ్లను తెరిచినప్పటికీ.. ఎలాంటి వివరాలను బయటికి వెల్లడించలేదు. వారం రోజులుగా గోప్యంగా ఉంచి విధివిధానాలు రూపొందించి టెండర్లు ఖరారు చేశారు.

వైద్య కాలేజీల్లో కాంట్రాక్టు పోస్టుల భర్తీ!

» 1100 అధ్యాపక పోస్టుల భర్తీకి నేడో, రేపో సర్కారు గ్రీన్‌సిగ్నల్

» ఆ వెంటనే నోటిఫికేషన్ జారీ



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. మరోవైపు జాతీయ వైద్య కమిషన్ తనిఖీలకు రానుంది. ఈ నేపథ్యంలో సుమారు 1,100 అధ్యాపకుల పోస్టుల భర్తీపై సర్కారు దృష్టి సారించింది. ఆ పోస్టులన్నిటిని కాంట్రాక్టు పద్ధతిలో తక్షణమే భర్తీ చేసేందుకు సిద్ధమైంది. రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేలోపు తాత్కాలికంగా నియమించాలని వైద్య శాఖ నిర్ణయానికి వచ్చింది. అధ్యాపకులు లేకపోతే కళాశాలల్లో సీట్లకు కోత పడే అవకాశం ఉంది. తాత్కాలిక పద్ధతిలో పోస్టుల భర్తీకి వైద్యవిద్య సంచాలకులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 1,100కు పైగా పోస్టులు అవసరమని పేర్కొన్నారు. వాటికి నేడో, రేపో ఆర్థికశాఖ ఆమోదం తెలిపే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాలు వెల్లడించాయి. ఆర్థికశాఖ ఆమోదం తర్వాత వెంటనే కళాశాల వారీగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు వైద్యశాఖ సిద్ధం అయింది. ఈ 1,100 పోస్టుల్లో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టులున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన కళాశాలలతో పాటు కొత్తగా ఏర్పాటు చేయనున్న కళాశాలల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైద్య కళాశాలల్లో అధ్యాపకుల హాజరు శాతం తక్కువగా ఉందని అన్ని సర్కారీ కళాశాలలకు జాతీయ వైద్య కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ షోకాజ్ నోటీసులకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానమివ్వాల్సి వుంది. ఇలావుంటే రెగ్యులర్ పోస్టుల భర్తీకి సంబంధించి 500 పోస్టులు అవసరమని, వాటి నియామక ప్రక్రియకు ఆమోదం తెలపాలని వైద్యఆరోగ్యశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఆమోదం రాగానే మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయనున్నారు.

త్వరలో పునరుద్ధరణీయ ఇంధన పాలసీ

» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే పునరుద్ధరణీయ ఇంధన వనరుల పాలసీని తీసుకురానున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనికోసం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే భారీ, మధ్యతరహా సాగు నీటి జలాశయాల్లో ఫ్లోటింగ్ (తేలియాడే) సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులు, కేంద్రం, ఇతర సంస్థల నుంచి అందుతున్న ఆర్థిక సహాయాన్ని పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణీయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. పునరుద్ధరణీయ ఇంధన వనరులపై తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) అధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జలాశయాలను గుర్తించి వాటిలో సోలార్ ప్లాంట్లు నెలకొల్పేందుకు ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి ఏ మేరకు జరుగుతోందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'మన ఊరు-మన బడి' కింద 1,521 పాఠశాల్లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా, ఎన్ని ఏర్పాటు చేశారని ఆరా తీశారు. సమావేశంలో రెడ్‌కో సీఎండీ జానయ్య, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా!

» నేడు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా ఒకటి రెండు రోజుల్లో వెలువడనుంది. శనివారం జరగనున్న బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా తదితరుల ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ పాల్గొంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో కనీసం ఎంపీ 10 సీట్లు గెలవాలని అధిష్ఠానం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపాయి. సిటింగ్‌లతోపాటు మహబూబ్‌నగర్, జహీరాబాద్, భువనగిరి, చేవెళ్ల, వరంగల్ ఉన్నట్లు, ఈ స్థానాల్లో గెలుపునకు తీవ్రంగా ప్రయత్నించేలా వ్యూహరచన చేసినట్లు సమాచారం. కాగా, తొలి జాబితాలో కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బండి సంజయ్, డి.అరవింద్, శ్రీరామ్ వెదిరె లేదా బూరనర్సయ్యగౌడ్, డీకే అరుణ తదితరుల పేర్లు ఉండవచ్చునని ప్రచారం జరుగుతోంది.

మా సమస్యలు పరిష్కరించండి: వీఆర్వోలు

తమ సమస్యలు పరిష్కరించాలంటూ పూర్వ వీఆర్వో జేఏసీ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను నిర్వీర్యం చేసింది. రీడిప్లాయ్‌మెంట్ (పునర్నియామకం) పేరుతో వీఆర్వోలను బలవంతంగా ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. దీంతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. 5,138 మంది పూర్వ వీఆర్వోల ఉద్యోగ జీవితాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచగా.. 2024 మార్చి 31 నుంచి పూర్వ వీఆర్వోల్లో కొందరు పదవీ విరమణ చేయనున్నారు. వారికి సంబంధిత ఆర్థిక ప్రయోజనాలు అందే అవకాశంలేదు" అని పూర్వ వీఆర్వో జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. తమ సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని కోరింది.

మూసీ ప్రక్షాళనకు కేంద్ర సాయాన్ని కోరాలి

» సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

మూసీని ప్రతిష్ఠాత్మక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. గంగా ప్రక్షాళనకు నిధులిచ్చిన కేంద్రాన్ని మూసీ శుద్ధికి కూడా నిధులు అడగాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. పేదలకు నష్టం లేకుండా మూసీ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొంత మెరుగైన ఫలితాలను సాధించిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయాలని చూస్తోందని, ఆ ప్రయత్నాలను అడ్డుకుంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మోదీకి శృంగభంగం తప్పదని ఆయన అన్నారు.

గొర్రెలు, చేపల పంపిణీపై విచారణ చేయాలి

» టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ డిమాండ్

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో గొర్రెలు, చేపల పంపిణీల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ డిమాండ్ చేశారు. ఇప్పటి వరకున్న సమాచారం మేరకు సుమారు రూ.142 కోట్ల విలువైన గొర్రెల పంపిణీ వివరాల లెక్కలు లేవన్నారు. గత డిసెంబరు 10న మాసాబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్థక శాఖ కార్యాలయం నుంచి పలు పత్రాల తస్కరణ జరిగిందని, ఇందులో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పీఏ హస్తం ఉన్నట్లు మీడియాలో ప్రచారం జరుగుతోందని తెలిపారు. కేవలం నలుగురు అధికారులను బాధ్యులను చేసి ఊరుకుంటే దోషులు బయటపడరని, బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నర్సింగ్‌కు నీట్ తప్పనిసరి కాదు!

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు నీట్ తప్పనిసరి నిబంధనను రాష్ట్ర సర్కారు సడలించింది. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం(2023-24) నర్సింగ్ బీ కేటగిరి సీట్లకు నీట్ లేదా ఎంసెట్‌లో క్వాలిఫై కావాలన్న నిబంధన పెట్టడంతో ఈ కేటగిరిలో 2 వేలకు పైగా సీట్లు మిగిలిపోయాయి. దాంతో ఆ నిబంధనను సడలించి పది, ఇంటర్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎంసెట్, నీట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటా కింద అడ్మిషన్లు పొందేలా వెసులుబాటు కల్పించారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2023-24) మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుందని హెల్త్ సెక్రటరీ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

ఎన్నికలకు కార్యాచరణను సిద్ధం చేయండి

» ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు సీఈఓ వికాస్‌రాజ్ సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అందుకు తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ సూచించారు. శుక్రవారం ఆయన సంబంధిత విభాగాల నోడల్ అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్రం, సరిహద్దు ప్రాంతాల్లో నగదు ప్రవాహాన్ని అరికట్టాలని, విలువైన వస్తువులు, మద్యం, డ్రగ్స్ రవాణాను కట్టడిచేయడంపై దృష్టి పెట్టాలని వారికి సూచించారు.

ఈఎన్‌సీ(జనరల్)గా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్



నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్)గా గుమ్మడి అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు వారాల కిందట ఈఎన్‌సీ(జనరల్)గా ఉన్న సి.మురళీధర్ రాజీనామా చేయగా.. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. దాంతో మూడురోజుల కిందట ప్రభుత్వం అనిల్‌కుమార్‌కు ఈఎన్‌సీ(జనరల్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రెండేళ్లుగా కుదుపునకు గురవుతున్న కడెం ప్రాజెక్టును అనిల్‌కుమార్ శనివారం పరిశీలించనున్నారు

గురుకుల ప్రిన్సిపాళ్లకు స్పెషల్ క్లాసులు

ఇటీవల గురుకులాల్లో విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో అధికారులు నష్టనివారణ చర్యలకు ఉపక్రమించారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని, వారు ఎదుర్కొంటున్న సంఘర్షణను గుర్తించేందుకు ఎస్సీ, ఎస్టీ గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. హైదరాబాద్ తెలుగు సంక్షేమ భవన్ ప్రాంగణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఈ శిక్షణ తరగతులను సెక్రటరీ సీతాలక్ష్మి, అడిషనల్ సెక్రటరీ హనుమంత్‌నాయక్ ప్రారంభించారు. రెండ్రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుంది.

టీపీసీసీ వార్‌రూం చైర్మన్‌గా పవన్ మల్లాది

రాబోయే లోకసభ ఎన్నికల కోసం ఏర్పాటైన టీపీసీసీ వార్‌రూం చైర్మన్‌గా పవన్‌మల్లాది నియమితులయ్యారు. కో- చైర్మన్లుగా సందేష్ సింఘాల్‌కర్, సతీష్‌మన్నె, సంతోష్‌రుద్ర, జక్కిని అనితను పార్టీ నియమించింది. అనలిస్టుగా శ్రీకాంత్ కుమ్మరి, సోషల్ మీడియా విభాగానికి గాను గిరిజా శేట్కర్, నవీన్ పఠాన్ అలాగే ట్రైనింగ్ విభాగానికి వాసిం భాషా, ఆరోన్ మీర్జాలను ఎంపిక చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత..

» ముగ్గురు ఉద్యోగులపై వేటు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కొండాపూర్ డివిజన్‌లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విద్యుత్ సరఫరాను నిలిపేసిన ముగ్గురు ఉద్యోగులను శుక్రవారం సస్పెండ్ చేశారు. ఓ గృహ సముదాయానికి ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడానికి లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లు విద్యుత్‌ను నిలిపివేయడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. అత్యవసరమైతే తప్ప విద్యుత్ సరఫరాను నిలిపివేయడానికి అనుమతులు ఇవ్వడంలేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రుణ మాఫీపై త్వరలో తీపి కబురు

బ్యాంకర్లతో తుది దశకు చేరిన చర్చలు.. 27న గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు శ్రీకారం

» మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులకు మంత్రులతో కమిటీ

» జాతరకు ప్రధాని మోదీ, అమిత్ షా రావాలి: సీఎం రేవంత్



హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు త్వరలో తీపి కబురు చెప్పబోతున్నామని, వారికిచ్చిన హామీ అమల్లో భాగంగా రూ.2 లక్షల రుణ మాఫీపై బ్యాంకర్లతో చర్చలు తుది దశకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ ప్రకటన చేస్తామని తెలిపారు. తాము హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తున్నామని, 27వ తేదీ నుంచి మరో రెండింటిని ప్రారంభిస్తామని తెలిపారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతరకు శుక్రవారం వచ్చిన ఆయన తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని (66 కిలోల బెల్లం) తులాభారం వేయించి గద్దెల వద్ద అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. "రూ.500కే గ్యాస్ సిలిండర్‌తోపాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించే పథకాలను 27వ తేదీ నుంచి అమలు చేస్తాం. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం" అని తెలిపారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆదరణ పొందిందని, మేడారం జాతరకు 6 వేల బస్సులు నడిపి వాటిలోనూ మహిళలను ఉచితంగా జాతరకు తరలించామని చెప్పారు. జాతరను దృష్టిలో ఉంచుకొని కొత్తగా 100 బస్సులను కొనుగోలు చేసి నడుపుతున్నామని తెలిపారు.

మార్చి 2న మరో 6000 కొలువులు

తాము అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, వీటిలో 6,956 స్టాఫ్ నర్సు, సింగరేణిలో 441; 10 వేలకుపైగా పోలీస్, ఎక్సైజ్, ఫైర్ శాఖలో కొలువులు కల్పించామని సీఎం రేవంత్ తెలిపారు. మార్చి 2న మరో 6 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఇటీవల 25 వేల ఉద్యోగాల భర్తీని చూసి కుళ్లుకుంటున్నవారు చూసేలా ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించామన్నారు. మామ, అల్లుడు, బావ, బామ్మర్దులు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ బదిలీల్లో పారదర్శకత పాటిస్తున్నామని, గతంలో జీతం ఎప్పుడు వస్తుందోనని ఉద్యోగులు ఎదురు చూసేవారని, ప్రస్తుతం ఒకటో తేదీనే జీతాలు వేస్తున్నామని అన్నారు. ఒక గంట కూడా సెలవు తీసుకోకుండా తన మంత్రివర్గ సహచరులు పని చేస్తున్నారని తెలిపారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్రంలో పది స్కిల్ యూనివర్సిటీలను ప్రారంభించారని, అనేక మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు.

బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందానికి తెగబడుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. "బయటకు విమర్శలు చేసుకుంటున్నా.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఏడుచోట్ల బీజేపీ, పది స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ చేసేలా చీకటి ఒప్పందం కుదిరింది. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించామని, బీజేపీ నేతలు మాత్రం సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని, సీబీఐకి అప్పగిస్తే కేసులతో బెదిరించి కేసీఆర్‌ను గిల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ అవినీతిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని, సీబీఐ, ఈడీ, ఐటీ వాళ్ల చేతుల్లోనే ఉన్నా ఎటువంటి విచారణ జరపలేదని గుర్తు చేశారు. అందుకే, హైకోర్టు లేదా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని భావిస్తున్నామన్నారు. "కుంగిన మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారం బ్యారేజీలో పోయాలని హరీశ్ రావు అంటున్నారు. దూలంలా పెరిగినా దూడకు ఉన్న బుద్ధి కూడా ఆయనకు లేదు. అన్నారం బ్యారేజీలో లీకేజీలు అవుతున్నాయనే కిందికి వదులుతున్నాం. కిందికి వదిలిన నీటిని పైకి ఎత్తిపోయాలని ఎలా అంటున్నారు!?" అని మండిపడ్డారు.

కిషన్ రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేమంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కుంభమేళాకు లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న కేంద్రం.. గిరిజన జాతరకు జాతీయ హోదా ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. మేడారానికి కేంద్రం మొండి చేయి చూపిందని పత్రికల్లో వార్తలు వస్తే.. రూ.3 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. అయోధ్యలో రామాలయాన్ని ఎలా దర్శించుకుంటామో సమ్మక్క-సారలమ్మలను కూడా అలాగే దర్శించుకునేందుకు మోదీ, షా రావాలని, వారి కోసం అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం మేడారంపై నిర్లక్ష్యం చేసి మూల్యం చెల్లించుకుందని, బీజేపీకి కూడా అలాంటి పరిస్థితే వస్తుందని హెచ్చరించారు.జాతరలో తాత్కాలిక పనులతో కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయని పత్రికల్లో వార్తలు వచ్చాయని, శాశ్వత పనుల కోసం త్వరలోనే మంత్రులతో కమిటీ వేస్తామని చెప్పారు. మంత్రులు సీతక్క, సురేఖ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కమిటీ వేసి ఆదివాసీలు, భక్తుల నుంచి సలహాలు తీసుకుంటామన్నారు.

75 రోజుల్లో ప్రజల్లో విశ్వాసం కల్పించాం

సమస్యలు చెబితే తీరుతాయనే నమ్మకాన్ని ఈ 75 రోజుల తమ హయాంలో కల్పించామని సీఎం రేవంత్ తెలిపారు. సరిగ్గా ఏడాది కిందట ప్రతిపక్ష నేతగా అమ్మవార్లను దర్శించుకొని మొక్కుకున్నానని, రాష్ట్ర ప్రజల అభీష్టాన్ని ఆ తల్లి మన్నించినందుకు మొక్కు తీర్చుకున్నానని తెలిపారు. వన దేవతల ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. సీఎం వెంట జాతరకు వచ్చిన సీఎస్ శాంతి కుమారి కూడా అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు.

గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు చేవెళ్ల నుంచే శ్రీకారం

కాంగ్రెస్ పార్టీ తనకు సెంటిమెంట్‌గా మారిన చేవెళ్ల నుంచే ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు శ్రీకారం చుట్టనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరుకానున్నారు. ఈనెల 27న సీఎం రేవంత్ రెడ్డి, ప్రియాంకగాంధీ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు నిర్వహిస్తున్న సభ కావడంతో పెద్దఎత్తున మహిళా సంఘాలను తరలించనున్నారు. సభ ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ శశాంక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీపై విజిలెన్స్

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్లుగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కొత్త కార్పొరేషన్లకు ఐఏఎస్‌లను కమిషనర్లుగా నియమించాలని సూచించారు. మునిసిపాలిటీల్లో పనిచేసే వర్కర్లకు ప్రమాద బీమా కల్పించడంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీలో వయసుపైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని సూచించారు. ఆస్తి పన్ను మదింపునకు డ్రోన్ కెమెరాలను ఉపయోగించడంపై అధ్యయనం చేయాలని నిర్దేశించారు. ప్రైవేట్ సెక్టార్‌లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కాలనీలకు వెళ్లకుంటే.. ఇంటికి వెళ్లిపోండి

ఉదయమే లేచి కాలనీల్లో పర్యటించని జోనల్ కమిషనర్లు ఇంటికి వెళ్లిపోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ హెచ్చరించారు. కుర్చీల్లో కూర్చుని పని చేసే పోస్టులు కావాలంటే ఇస్తామని వ్యాఖ్యానించారు. "హైదరాబాద్‌లో న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో వీడియో ప్రకటనల బోర్డు, మల్టీ యుటిలిటీ టవర్లను ఏర్పాటు చేయండి. వీధి దీపాల మెరుగుదలకు చర్యలు తీసుకోండి. మంచి నీటి కొరత లేకుండా చూడండి. స్థానిక చెరువులను స్టోరేజీ ట్యాంకులుగా ఉపయోగించుకోండి. మల్లన్న సాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయండి" అని నిర్దేశించారు. ఔటర్ రింగు రోడ్డు బయట ఉన్న చెరువులను క్లస్టర్లుగా విభజించాలని, వచ్చే 50 ఏళ్ల తాగు నీటి అవసరాల కోసం ప్రణాళికలు రచించాలని సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు దానకిశోర్, ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎంతో ధరణి కమిటీ భేటీ

» ధరణి సమస్యలు, పరిష్కారాలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ధరణి కమిటీ సీఎం రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశం కానుంది. ధరణిలో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారమార్గాల గురించి ఈ భేటీలో చర్చించనున్నారు. 'ధరణి, రెవెన్యూ చట్టం 2020'లో ఉన్న లోపాల గురించి ప్రస్తావించి, ఆ చట్టం సవరణకు కూడా కమిటీ సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని కమిటీ తొలుత భావించింది. కానీ, సీఎం అపాయింట్‌మెంట్ లభించటంతో కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌ను వాయిదా వేశారు. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి తాలూకు వివరాలు తదితర అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కమిటీ ఇప్పటికే సేకరించింది. ధరణితో సంబంధం ఉన్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే ల్యాండ్ అండ్ సెటిల్‌మెంట్, అటవీ, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, పరిశ్రమలు, నీటిపారుదల, గిరిజన సంక్షేమ శాఖలతో దాదాపు 15 రోజుల పాటు ధరణి కమిటీ సమావేశమైంది. ఈ కసరత్తు అనంతరం, ధరణి తాలూకు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ ఒక మధ్యంతర నివేదికను తయారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వీలైనంత త్వరగా సమసస్యలను పరిష్కరించేందుకు అవసరమైన సిఫార్సులను ధరణి కమిటీ ఈ నివేదికలో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

సమ్మక్క సారలమ్మలనే మోసం చేసిన బీజేపీకి ప్రజలో లెక్కా



» కవితకు సీబీఐ నోటీసులు డైలీ సీరియల్.. సురభి నాటకం

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు జాతీయ హోదా, ఢిల్లీ మద్యం కేసు అంశాల్లో బీజేపీ తీరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మక్క సారలమ్మలనే మోసగించిన బీజేపీ నేతలకు తెలంగాణ ప్రజలను మోసగించడం చాలా తేలికని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితకు నోటీసుల వ్యవహారం ఓ డైలీ సీరియల్‌లా ఉందని, సురభి నాటకాన్ని తలపిస్తోందని విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మంత్రులు ఢిల్లీలో ఉన్నప్పుడు ఒకలా.. హైదరాబాద్‌కు వచ్చాక ఇంకోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మీద ఏదో ఒక నింద వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి మాటలు ప్రజలను తికమకపెట్టే విధంగా ఉన్నాయన్నారు. ఢిల్లీ రాజకీయం అంతా కలుషితమైందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలిటిక్స్ ఫ్రెష్‌గా మారుతాయన్నారు.

మోదీ, కేసీఆర్ మధ్య రాజకీయ ప్రేమాయణం

మతంతో రాజకీయం చేయాలని చూస్తున్న బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని జగ్గారెడ్డి అన్నారు. మోదీ పెట్టిన అన్ని బిల్లులకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మోదీ, కేసీఆర్ మధ్య రాజకీయ ప్రేమాయణం నడిచిందని వ్యాఖ్యానించారు. ప్రేమికుల మధ్య ఏం చెడిందో కానీ రెండేళ్ల గ్యాప్ వచ్చినట్టు నటించారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎన్ని అబద్ధాలు చెప్పిందో వాటిని రోజుకు ఒకటి చొప్పున బయటపెడతానన్నారు. రెండేళ్ల క్రితం మేడారం జాతరకు వచ్చిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా జాతీయ జాతరగా ప్రకటిస్తాం అన్నారని గుర్తు చేశారు. తాజాగా కిషన్ రెడ్డి మేడారం వెళ్లి సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగ చేస్తామని తామెప్పుడూ చెప్పలేదని అంటున్నారని పేర్కొన్నారు. కోట్లాది మంది భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారి దగ్గరకు వెళ్లినా.. రాజకీయలబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తారా? అని బీజేపీని ప్రశ్నించారు. మేడారం జాతరకు నాలుగు రాష్ట్రాల ప్రజలు వస్తుండడంతో జాతీయ పండగగా ప్రకటించాలనే డిమాండ్ ఉందన్నారు. అమ్మవారి గుడి ముందే అబద్ధాలు చెప్తున్నారు.. ఇక సాక్ష్యం ఎందుకన్నారు. వారే జాతీయ పండగ చేస్తాం అంటారు.. మళ్లీ వాళ్లే అలాంటివి లేవంటారు.. బాధ్యత కలిగిన కేంద్ర మంత్రులు ఇన్ని అబద్ధాలు ఆడతారా ? అని జగ్గారెడ్డి నిలదీశారు. బీజేపీ నేతలు పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవితను అరెస్టు చేస్తారని బండి సంజయ్ వారానికోసారి చెప్పేవారని, ఆ వెంటనే నోటీసులు వచ్చేవని జగ్గారెడ్డి అన్నారు. సంజయ్ ఏది చెప్తే అది చేసిన బీజేపీ ఈడీకి విలువ లేకుండా చేసిందని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో రాకూడదని, కవితను అరెస్టు చేయించి బీజేపీ సానుభూతి రాజకీయం చేయాలని చూసిందని ఆరోపించారు.

'గొర్రెల' నిందితులు విదేశాల్లో!

» కేసు ఏసీబీ వద్దకు చేరేటప్పటికే పరారీ

» అక్కడి నుంచే బాధితులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్న మొహిదొద్దీన్, అతని కుమారుడు

» లుకౌట్ నోటీసు ఇచ్చే యోచనలో ఏసీబీ



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న మొహిదొద్దీన్ గుర్తింపు కార్డులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకం బిల్లు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డ కేసులో ప్రధాన నిందితులైన సయ్యద్ మొహిదొద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్ అహ్మద్.. విదేశాలకు పరారయ్యారు. విదేశాల్లో నక్కి.. బాధిత రైతులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో ఈ తండ్రీకొడుకులపై లుకౌట్ నోటీసు జారీ చేసేందుకు అవినీతి నిరోధక శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. రైతుల వద్ద నుంచి గొర్రెలను కొనుగోలు చేసి.. అందుకు సంబంధించిన రూ.2.10 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయకుండా దారి మళ్లించిన కేసులో ఏసీబీ అధికారులు ఇప్పటికే నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరికొందరిని కూడా అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రూ.2.10 కోట్ల బిల్లు చెల్లింపు వరకే ఇది పరిమితం కాలేదని, మరికొంత మంది రైతుల నుంచి పెద్దమొత్తంలో నిధులు దారి మళ్లించినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. విదేశాల్లో నక్కిన తండ్రీకొడుకుల్ని విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ కేసు ఏసీబీ వద్దకు చేరుకునేటప్పటికే ప్రధాన నిందితులిద్దరూ విదేశాలకు పరారయ్యారు. ఏ1గా ఉన్న మొహిదొద్దీన్ తీరుపై ఏసీబీ లోతుగా దర్యాప్తు జరుపుతోంది. మొహిదొద్దీన్ పలు సంస్థలకు ఎండీగా, డైరెక్టర్‌గా పరిచయం చేసుకుని రైతుల నుంచి గొర్రెలను కొనుగోలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో గొర్రెల పంపిణీ పథకం ఎప్పుడు ప్రారంభమైంది, ఆయా సంస్థలు ఎప్పుడు ఏర్పాటయ్యాయనే వివరాలను ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. పత్రాల్లో ఉన్న సంస్థలు వాస్తవంగా ఉన్నాయా? లేదా? అన్నదానిని నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఫ్రెష్ అండ్ ఫాస్టర్, సైమో సంస్థలకు మొహిదొద్దీన్ ఎండీగా ఉన్నాడు. దీంతోపాటు నెట్ డీల్ షీప్ అండ్ గోట్ ఫామ్స్‌కు డైరెక్టర్‌గా ఉన్న మొహిదొద్దీన్ తన పేరును ఎస్ఎస్ మొయిద్‌గా రికార్డుల్లో నమోదు చేశాడు. నియో మల్టీప్లెక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కూడా అతడు ప్రొప్రయిటర్‌గా ఉన్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కొండాపూర్‌లో 'లోలోన' పేరుతోనూ 2008లో ఓ సంస్థను ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో ఉంది.

కాగ్ పరిశీలనలోనూ వెలుగులోకి అక్రమాలు..

గొర్రెల పంపిణీ పథకం అమలుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) పరిశీలనలోనూ పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒకే బైక్‌పై ఒకే ప్రయాణంలో 126 గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. బైకు, కారు, ఆంబులెన్స్, ఆటో ఇలా ఏది దొరికితే ఆ వాహనం నంబరు వేసి గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో చూపించివ.. కోట్ల రూపాయల బిల్లులు తీసుకున్నట్లు కాగ్ నివేదికలో వెల్లడైంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో కాగ్ జరిపిన విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. గొర్రెల కొనుగోలు నుంచి తరలింపు, లబ్ధిదారులకు చేరవేత, బిల్లుల చెల్లింపు.. ఇలా ప్రతి దశలోనూ అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో గచ్చిబౌలిలో నమోదైన కేసు వరకే పరిమితం కాకుండా.. ఈ కేసు దర్యాప్తుపై ఏసీబీ విస్తృతంగా దృష్టి సారించింది. ఇప్పటికే గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ నుంచి రికార్డులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. గొర్రెల పంపిణీలో పెద్దమొత్తంలో అక్రమాలు జరిగిన ఏడు జిల్లాల నుంచి కూడా దర్యాప్తునకు అవసరమైన సమాచారం, రికార్డులు సేకరించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది.

బీసీ సబ్ ప్లాన్ కావాలంటే కుల గణన జరగాలి

» బీసీ మేధావులు, అధికారులతో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

» కులగణనతో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం: మంత్రి పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీసీ సబ్ ప్లాన్ కావాలంటే కులగణన జరగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కుల గణనపై అసెంబ్లీలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని విప్లవాత్మక చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ ప్రయత్నాన్ని సెమినార్లు, మీడియా సమావేశాలు, యూనివర్శిటీల్లో సదస్సుల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. శుక్రవారం సచివాలయంలో బీసీ మేధావులు, అధికారులతో నిర్వహించిన కుల గణన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు బిహార్‌లో సర్వే సజావుగా జరగడం, అది చట్టరూపం దాల్చిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో అంతరాలు తొలగాలంటే కులగణన జరగాల్సిందేనని పేర్కొన్నారు. కులగణన తీర్మానంపై విపక్షంలోని కొందరు దారితప్పించాలని చూశారని, కుట్రపూరిత విమర్శలు చేశారని, అయినా తీర్మానాన్ని ప్రవేశపెట్టామని స్పష్టంచేశారు. సంపద ఎక్కడ ఉంది, భూమి లేని నిరుపేదలు ఎంతమంది, విద్యలో వెనుకబాటు, ఇల్లు లేనివారు ఎందరున్నారు? సహా అన్ని అంశాలు కుల గణనతో వెలుగులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా బిహార్ సర్వేలోని అంశాలన్నింటినీ గుర్తించారా? అని అధికారులను భట్టి ప్రశ్నించారు. కులగణన అంశాన్ని పబ్లిక్ డిమాండ్‌లో ఉంచామని, దీనిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని పొన్నం అన్నారు. అసెంబ్లీలో కులగణన తీర్మానం తో మరో 15 ఏళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. వెనుకబడిన కులాల పట్ల ప్రభుత్వానికి నిబద్ధత ఉన్నదని తమకు భరోసా కలిగిందని సమావేశంలో పాల్గొన్న బీసీ నేత క్రాంతి తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచనను ప్రొఫెసర్ సింహాద్రి కొనియాడారు. సమావేశంలో మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రొఫెసర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష తుది ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణశాఖ పరిధిలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష తుది ఫలితాలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్లో ఉంచామని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

లాస్య నందిత దుర్మరణం



(మొదటిపేజీ తరువాయి)

టిఫిన్ చేసేందుకు మరోమారు సంగారెడ్డి వైపునకు తిరుగు ప్రయాణం అయ్యారని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు. ముత్తంగి జంక్షన్ వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. ప్రమాదవార్త తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న పటాన్‌చెరు పోలీసులు.. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను మియాపూర్ శ్రీకర ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే లాస్యనందితను పటాన్‌చెరులోని అమేధా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి వార్త తెలియగానే కుటుంబసభ్యులు, బంధువులతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలవడం పట్ల ఆయన దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. లాస్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె మృతిపై మాట్లాడాలని విలేకరులు కోరినా విషణ్నవదనంతో మౌనంగా ఉండిపోయారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ జరుగుతున్నంత సేపూ అక్కడి వెయిటింగ్ హాలులోనే కూర్చున్నారు. అనంతరం లాస్య ఇంటికి వెళ్లి ఏర్పాట్లు పర్యవేక్షించడంతోపాటు అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకూ ఉన్నారు.

డ్రైవర్ నిద్రమత్తు వల్లనే..

డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలోని మిస్కిన్ షా బాబా దర్గా సందర్శన అనంతరం.. లాస్య తన కుటుంబసభ్యులతో కలిసి రెండు కార్లలో హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఆమె టీఎస్09జీజీ టీఆర్ 1955 నంబర్ గల మారుతీ సుజుకీ ఎక్స్ఎల్ 6 కారులో ప్రయాణిస్తున్నారు. అల్పాహారం కోసం శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి సంగారెడ్డి వైపు వస్తుండగా సుల్తాన్‌పూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత సుమారు 5.10 గంటల సమయంలో డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులోకి జారుకుని, కారుపై నియంత్రణ కోల్పోయి, ఎడమ వైపు ఉన్న ఓఆర్ఆర్ మెటల్ బీమ్‌కు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఎమ్మెల్యే అక్కడికక్కడే మృతి చెందారు. కాగా.. 5.15 గంటల సమయంలో ఆకాశ్ తనకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేవలం గాయాలు మాత్రమే అయ్యాయని తెలిపాడని లాస్య నందిత సోదరి నివేదిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ప్రమాద స్థలికి వచ్చి చూసేసరికి లాస్య చనిపోయి ఉందని ఆమె పేర్కొన్నారు. దీంతో డ్రైవర్ ఆకాశ్‌పై ఐపీసీ 304(ఎ) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో కారు విడిభాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్న తీరుచూస్తే.. ముందు వెళుతున్న వాహనం వెనకభాగాన్ని ఢీకొనగా, అది సుమారు వందమీటర్ల వరకు ఈ కారును ఈడ్చుకెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. ఆ వాహనం ఆచూకీ మాత్రం తెలియరాలేదు. అలాగే.. ప్రమాద సమయంలో వారి కారు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్టు స్పీడోమీటర్ వల్ల తెలుస్తోంది.

పోస్టుమార్టమ్ రిపోర్టు..

ఈ ప్రమాదంలో లాస్య తలకు బలమైన గాయమై మరణించినట్టు పోస్టుమార్టమ్ నిర్వహించిన వైద్యులు నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం ఉదయం 9.55 గంటల సమయంలో లాస్య భౌతికకాయాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగాధిపతి కృపాల్‌సింగ్, డాక్టర్ లావణ్య, పీజీ వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదంలో ఆమె తలకు కుడిభాగంలో, మెడ వద్ద తీవ్రగాయాలయ్యాయి. ఎడమ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఛాతీ ఎముకలు విరిగాయి. వెన్నుకు తీవ్రగాయాలయ్యాయి. ఆరు దంతాలు పూర్తిగా విరిగిపోయాయి. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. అయితే, తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృత్యువాత పడినట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. పోస్టుమార్టమ్ పూర్తి నివేదిక రావాల్సి ఉంది. ఇక.. ప్రమాద సమయంలో కారు నడుపుతున్న ఆకాశ్ కనుబొమ పైభాగం, ముఖం వద్ద చిన్న చిన్న ఫ్రాక్చర్లు అయినట్లు, ఎడమ కాలు తొడ వద్ద ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స చేస్తున్నామని చెప్పారు.





లాస్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కన్నీటి నివాళులు..

లాస్య తండ్రి మాజీ ఎమ్మెల్యే జి.సాయన్న గత ఏడాది ఫిబ్రవరి 19న అనారోగ్యంతో మరణించారు. నాలుగు రోజుల క్రితమే ఆయన ప్రథమ వర్ధంతి జరిగింది. అంతలోనే ఆయన కుమార్తె మృతి చెందడంతో.. వారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. లాస్య మరణవార్త తెలియగానే ఆమె తల్లి గీత స్పృహ తప్పిపడిపోయారు. లాస్యను తలచుకుంటూ భోరున విలపిస్తున్న ఆమె తోబుట్టువులు నమ్రత, నివేదితను, కుటుంబసభ్యులను ఆపడం ఎవరితరం కాలేదు. ఏడాది వ్యవధిలో తండ్రి, తనయ మరణించడంతో కంటోన్మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఉదయం 11.45 గంటలకు లాస్య భౌతికకాయాన్ని సికింద్రాబాద్ కార్ఖానా గృహలక్ష్మి కాలనీలోని నివాసానికి తీసుకువచ్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. అనంతరం మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. లాస్య మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మేడారంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన రేవంత్.. నేరుగా లాస్య నివాసానికి చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అంతకుముందు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కేసీఆర్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. లాస్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత మృతదేహం రాక ముందే కార్ఖానాలోని ఇంటికి చేరుకున్నారు. లాస్య తల్లి గీత, సోదరి నమ్రత, నివేదితను ఓదార్చారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎంపీలు కే కేశవరావు, సంతోష్‌కుమార్ తదితరులు కన్నీటి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు లాస్య కడసారి చూపు కోసం తరలివచ్చారు. రేవంత్ ఆదేశాలతో లాస్యనందితకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని హిందూ శ్మశానవాటికలో రాత్రి 7.10 గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హరీశ్, తలసాని, వేముల, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి పాడె మోశారు. సాయన్న మరదలు కుమారుడు పీయూష్ రాఘవ లాస్య చితికి నిప్పంటించారు. కాగా.. లాస్యనందిత మృతి పట్ల తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మంత్రి కొండా సురేఖ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం తెలిపారు. లాస్య మృతి పట్ల తీవ్రదిగ్ర్భాంతి వ్యక్తం చేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్.. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.



పాడె మోస్తున్న హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

ఓటమితో మొదలై..

దివంగత ఎమ్మెల్యే సాయన్నకు లాస్యనందితతో పాటు మరో ఇద్దరు కుమార్తెలు నమ్రత, నివేదిత ఉన్నారు. కుటుంబ సభ్యులందరి ఆమోదంతో ఆయన లాస్య నందితను తన రాజకీయ వారసురాలిగా గతంలోనే ప్రకటించారు. 2015లో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలిగా పోటీ చేసి ఓటమిపాలైన లాస్య.. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ కార్పొరేటర్‌గా బరిలో నిలిచి విజయం సాధించారు. 2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కవాడిగూడ నుంచి మరోసారి పోటీ చేసిన లాస్య పరాజయం పాలయ్యారు. నిరుడు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ నుంచి పోటీ చేసే అవకాశం ఆమెకు కల్పించింది. సాయన్నకు ఉన్న మంచి పేరు, ఆయన అనుచరుల కృషితో లాస్య 17 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తన తండ్రి స్ఫూర్తితో ఆమె సామాజిక సేవా కార్యక్రమాలూ నిర్వహించేవారని.. పుట్టినరోజు, ఇతర సందర్భాల్లో ఆహారం, చలికాలంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసేవారని పార్టీ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. కానీ, ఎమ్మెల్యేగా ఎన్నికై మూణ్నెల్లు కాకముందే ఆమె మరణించడం విషాదం.

ఎప్పుడూ వెంట ఉండే గన్‌మెన్ లేకుండా ఎలా వెళ్లారు?

ఇరవై నాలుగు గంటలూ ఎమ్మెల్యేకు నీడలా ఉంటూ కాపాడే గన్‌మెన్ వెంట లేకుండానే ఆమె ప్రయాణం చేయడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎమ్మెల్యే కారు ప్రయాణించిన మార్గంలోని టోల్‌గేట్లు, సీసీ టీవీలను పరిశీలిస్తున్నారు.

నాడు సాయన్నకు సాధారణ అంత్యక్రియలు

గత ఏడాది ఫిబ్రవరిలో మరణించిన సాయన్న అంత్యక్రియల నిర్వహణ అప్పట్లో వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ శ్మశానవాటికలో ఆయన అనుచరులు నాడు ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి పార్టీకి చెందిన నాయకులు సర్దిచెప్పడంతో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు సాధారణంగానే అంత్యక్రియలు నిర్వహించారు.

వారం క్రితం ప్రాణాలతో బయటపడి..

ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక 3 ప్రమాదాలు

లాస్య నందిత ఎమ్మెల్యేగా ఎన్నికైన మూడు నెలల్లో మూడు ప్రమాదాలు జరిగాయి. రెండు ఘటనల్లో ప్రాణాలతో బయటపడిన ఆమె.. మూడో ప్రమాదంలో కన్నుమూశారు! వీటిలో మొదటి ప్రమాదం గత ఏడాది డిసెంబరు 24న జరిగింది. ఆరోజు ఆమె బోయిన్‌పల్లి బాపూజీనగర్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ ఆమె లిఫ్టులో ఇరుక్కోవడంతో.. దాన్ని పగలగొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చారు. తర్వాత, ఈనెల 13న నల్గొండలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు హాజరైన లాస్య నందిత.. తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో ఆమె స్వల్పగాయాలతో బయట పడ్డారు. కానీ ఆమె కారు ఢీకొని.. బందోబస్తు విధుల్లో ఉన్న హోంగార్డు మృతి చెందాడు. సరిగ్గా వారంలోనే ఆమె ఘోర రోడ్డు ప్రమాదానికి గురై కన్నుమూయడం విషాదం. కాగా.. లాస్య కుటుంబానికి ఒక పాత కారు, ఫార్చ్యూనర్ ఉన్నాయి. ఇటీవలే తెలిసిన బంధువుల పేరుతో ఎక్స్ఎల్6 కారును కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైంది ఆ కారే.

ఎమ్మెస్పీ తగ్గిస్తే రంగంలోకి మార్క్‌ఫెడ్

- ప్రతి పంటకు మద్దతు ధర అందాల్సిందే: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో ఏ పంటకైనా మద్దతు ధరకంటే తక్కువ ధర వస్తే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యంచేసుకుంటుందని, మార్కెఫెడ్‌ను రంగంలోకి దించి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రైతులు పంట ఉత్పత్తులకు మద్దతు ధర లేదా అంతకంటే ఎక్కువ ధర పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి పంటకు సంబంధించి కొనుగోలు ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు మంత్రి సూచించారు. కేంద్రం నుంచి ప్రొక్యూర్మెంట్ ఉత్తర్వులు ఆలస్యంగా వస్తే.. రాష్ట్ర ప్రభుత్వం తరుపున కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. రైతుబంధు సాయం ఇప్పటికే 54,29,645 మంది రైతులకు అందజేశామని, మిగిలిన రైతులకు కూడా త్వరలోనే రైతుబంధు పంపిణీ జరుగుతుందని మంత్రి తెలిపారు.

గ్రూప్-1 దరఖాస్తులు షురూ

గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం మొదలయింది. వచ్చేనెల 14వరకు అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. గతంలో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ప్రభుత్వం ఇటీవల తాజా నోటిఫికేషన్‌ను ఇచ్చిన విషయం తెలిసిందే. గత నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే వీరు మళ్లీ ఇప్పుడు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తాజా నోటిఫికేషన్‌లో స్పష్టత ఇచ్చారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం.. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ప్రిలిమనరీ, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో మెయిన్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి గ్రూప్-1 పోస్టులు భర్తీ పూర్తిచేయాలని అనుకుంటున్నారు.

గ్రూప్-1 షెడ్యూల్ వివరాలు

అంశం	తేదీలు
దరఖాస్తుల దాఖలు	23-02-2024 నుంచి 14-03-2924 వరకు
దరఖాస్తుల ఎడిట్ ఆప్షన్	23-03-2024 నుంచి 27-03-2024 వరకు
హాల్ టికెట్ డౌన్‌లోడ్	పరీక్షల తేదీకి 7 రోజుల ముందు నుంచి పరీక్షకు 4 గంటల ముందు వరకు
ప్రిలిమనరీ పరీక్ష	2024 మే, జూన్ మాసాల్లో
మెయిన్ పరీక్ష	2024 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో

ఆభరణాల 'అప్పగింత జాబితా' ఏది?

- గల్లంతైనట్లుగా భద్రాద్రి క్షేత్రంలో ప్రచారం
- నగల తనిఖీలో కనిపించని 6కిలోల వెండి ఇటుక
- ఉన్న 3 జాబితా కాపీలూ మాయం?.. హైరానాలో సిబ్బంది

భద్రాచలం, ఫిబ్రవరి 23: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గతంలో ఉన్న ఆభరణాల తాలూకు 'అప్పగింత జాబితా' కనపడటం లేదనే ప్రచారం దేవస్థానం వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇటీవల దేవస్థానంలో దేవాదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి అంజనీదేవి వెండి ఆభరణాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆరుకిలోల వెండి ఇటుక జాడ లేదనే ప్రచారం జోరుగా వ్యాపించింది. ఈ విషయాన్ని.. గతంలో 'ఆభరణాల అప్పగింత జాబితా' ద్వారా వివరాలన్నీ తెలుసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాస్తవానికి ఆభరణాల అప్పగింత సందర్భంగా అప్పజెప్పినవారు, తీసుకున్నవారి సంతకాలతో కూడిన రెండు జాబితాలు.. ఈ వివరాలతో దేవస్థానం వద్ద మరో జాబితా ఉంటుంని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ మూడు జాబితాలు ప్రస్తుతం కనపడకపోవడంతో దేవస్థానం వర్గాల్లో ఆందోళన నెలకొంది. దేవస్థానం వద్ద 67.774 కిలోల బంగారం, 980.68 కిలోల వెండి ఉంది. అయితే 2009 తర్వాత ఇటీవల పూర్తిస్థాయి తనిఖీలు కొనసాగుతుండటంతో కనపడకుండా పోయిన అరు కిలోల వెండి ఇటుక ఎక్కడ ఉందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని ఇప్పటికే దేవస్థానం అధికారులు పేర్కొన్నారు. అయితే ఎంతో కీలకమైన ఆభరణాల గత అప్పగింత జాబితా కనిపించకుండా పోవడంతో సంబంధిత సిబ్బంది దానికోసం తీవ్రంగా అన్వేషిస్తున్నట్లు వినికిడి.

అన్నారం గేట్లెత్తి మేడిగడ్డలో పనులను దెబ్బతీశారు

- పునరుద్ధరణ ఖర్చు ప్రభుత్వానిదే
- నీటిపారుదలశాఖకు ఎల్ అండ్ టీ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నారం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో మేడిగడ్డలో చేసిన పనులన్నీ దెబ్బతిన్నాయని, నీటి పారుదల శాఖ నిర్లక్ష్యం వల్ల తాము చేసిన పనులన్నీ వృథా అయ్యాయని ఎల్ అండ్ టీ పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ, కాఫర్‌డ్యాం నిర్మాణానికి ఖర్చయ్యే మొత్తం ప్రభుత్వమే భరించాలని మరోసారి తేల్చిచెప్పింది. ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ఆధారంగానే బ్యారేజీని నిర్మించామని, అలాంటప్పుడు బ్యారేజీలో తలెత్తిన లోపాలకు తామెలా బాధ్యులవుతామని ప్రశ్నించింది. ఈమేరకు ఈ నెల 17న రామగుండం సీఈకి ఎల్ అండ్ టీ అధికారులు లేఖ రాశారు. అన్నారం బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఆ నీళ్లన్నీ మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌ను చుట్టుముట్టాయని, దాంతో తాము చేసిన పనులన్నీ దెబ్బతిన్నాయని ఎల్ అండ్ టీ పేర్కొంది. ఇటీవలే అన్నారం బ్యారేజీలో భారీ సీపేజీతో బ్యారేజీని ఖాళీ చేశారు. నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం వల్ల తాము చేసిన పనులన్నీ వృథా అయ్యాయని, దీనికి ఆ శాఖే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పిల్లర్లు, రాఫ్ట్ ఫౌండేషన్, కటాఫ్‌వాల్స్, సికెంట్‌పైల్స్‌తో సహా పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాల్సి ఉందని, అలాగే పునరుద్ధరణ పనులు చేసే ఏడో బ్లాక్‌తోపాటు దానికి ఇరువైపులా ఉన్న బ్లాకులకు ఎగువ, దిగువ భాగంలో కాఫర్ డ్యాం నిర్మించాల్సి ఉందని తెలిపింది. ఈ పనులు వ్యయప్రయాసలతో కూడుకున్నాయని, ప్రభుత్వం ఈ పనులు చేపట్టేందుకు మళ్లీ అగ్రిమెంట్ చేసుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. అన్నారం బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడానికి ముందు మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో ఇన్వెస్టిగేషన్స్ కొనసాగుతున్నాయనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, దాంతో ఆ పనులన్నీ మళ్లీ మొదటికొచ్చాయని తెలిపింది.

నిందితురాలిగా కవిత!

(మొదటిపేజీ తరువాయి)



సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164(2)ల కింద ఈడీకి కీలక సమాచారం అందించారు. దీని వల్లే ఆయన ముందస్తు బెయిల్‌ను తాము వ్యతిరేకించలేదని సీబీఐ తెలిపింది. అదే విధంగా కవిత పీఏ రమేశ్ కుమార్ కౌశిక్ ఇచ్చిన వాంగ్మూలాన్ని 164 సీఆర్‌పీసీ కింద రికార్డు చేశారు. నిందితుల నేరం గురించి తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉన్నప్పుడు, సీఆర్‌పీసీ 41 ఏ కింద నోటీసులు జారీ చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంది. ఆ నోటీసులు స్వీకరించిన వ్యక్తి తప్పనిసరిగా విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని, హాజరు కాకపోతే కోర్టు ద్వారా ఆ వ్యక్తిని అరెస్టు చేసే అధికారం సీబీఐకి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. నోటీసులకు అనుగుణంగా హాజరైనా కూడా తగిన కారణాలు ఉంటే సదరు వ్యక్తిని అరెస్టు చేయవచ్చని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

మహిళకు ఈడీ సమన్లు జారీ చేయకూడదని, ఆమె ఇంటి వద్దే ఆమెను విచారించాలని వాదిస్తూ కవిత గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తరహా పిటిషన్‌ను నళినీ చిదంబరం కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఏడాదిగా ఈడీ సమన్ల నుంచి కవితకు రక్షణ లభిస్తోంది. కాగా కవిత, నళినీ చిదంబరం కేసులు వేర్వేరని, రెండింటికీ ముడిపెట్టలేమని ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేది స్పష్టం చేసి కవిత కేసు విచారణను ఫిబ్రవరి 28వ తేదీకి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ ముందు ఈ నెల 26న హాజరు కావడంతో పాటు తర్వాతి రోజుల్లో ఈడీ ముందు కూడా ఆమె హాజరు కావాల్సి రావచ్చని న్యాయనిపుణులు భావిస్తున్నారు.

మారిన బీజేపీ వైఖరి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ పట్ల బీజేపీ వైఖరి మారిందని, దాని పర్యవసానమే ప్రస్తుత పరిణామాలని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్-బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉన్నదనే ప్రచారంలో నిజం లేదని చెప్పటానికే కవితపై ఢిల్లీ మద్యం కేసులో దర్యాప్తులు వేగవంతం అవుతున్నాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ బలహీనపడితే బీజేపీకే లాభమని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో తాము అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని బీజేపీ ఆశిస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కేసులో త్వరలో అరెస్టు చేసే అవకాశాలున్నాయని, కవితను కూడా అదే సమయంలో అరెస్టు చేయవచ్చని సమాచారం.

ఢిల్లీ పర్యటన మానుకున్న కేసీఆర్!

తన కుమార్తె కవిత విషయంలో సీబీఐ దూకుడు చూసిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం ప్రయత్నించాలని కేసీఆర్ తొలుత భావించారని, కానీ కేంద్రం వైఖరి స్పష్టం కావడంతో ఆయన ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదని సమాచారం. కాగా, ఢిల్లీ వస్తే కేసీఆర్ ఎక్కడ ఉండాలన్న విషయంపై బీఆర్ఎస్‌లో చర్చ జరిగిందని, పార్టీ కార్యాలయంలోనే ఆయనకు సూట్ రూమ్ ఉన్నందువల్ల అక్కడే ఉండే అవకాశాలను పరిశీలించారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ తరఫున రాజ్యసభకు వద్దిరాజు రవిచంద్ర మరోసారి ఎన్నికైనందున ఆయనకు పెద్ద బంగళా సంపాదించేందుకు ప్రయత్నాలు జరిగాయని, కేసీఆర్ ఢిల్లీకి వచ్చినప్పుడు దాంట్లో ఉండాలనుకున్నారని ప్రచారం జరిగింది. కానీ, ఈ ప్రయత్నాలు ఫలించలేదని తెలిసింది.

పొత్తును ఆపటానికే కేజ్రీవాల్ అరెస్టుకు నిర్ణయం!

- ఆప్-కాంగ్రెస్ పొత్తును చూసి బీజేపీ వణికిపోతోంది
- అరెస్టు చేసినా పొత్తు ఆగదు: ఆప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: తమ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ త్వరలో అరెస్టు చేయవచ్చని ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) తెలిపింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోకుండా ఆపటానికే ఈ అరెస్టు తతంగమని.. పొత్తు వార్తలు వెలువడగానే కేజ్రీవాల్‌కు ఈడీ ఏడోసారి సమన్లు పంపిందని గుర్తు చేసింది. ఢిల్లీ మద్యం కేసులో విచారణకు ఈడీ ఇప్పటి వరకూ కేజ్రీవాల్‌కు ఆరుసార్లు సమన్లు పంపినప్పటికీ, ఆయన విచారణకు హాజరు కాలేదు. కాగా, సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే ఏ కేసులో అరెస్టు చేయవచ్చన్నది మాత్రం ఆప్ వెల్లడించలేదు. ఆ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ క్యాబినెట్ మంత్రి సౌరబ్ భరద్వాజ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'ఆప్-కాంగ్రెస్ పొత్తు కుదిరితే కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారని, రెండు మూడు రోజుల్లో ఇది జరగవచ్చంటూ మాకు వార్తలు వస్తున్నాయి. ఈ రెండు పార్టీల పొత్తును చూసి బీజేపీ వణికిపోతోంది. కేజ్రీవాల్‌ను మీరు అరెస్టు చేసినా.. పొత్తు ఆగదు. సునామీ రాబోతోంది. వారి (బీజేపీ) రాజకీయ లెక్కలన్నీ తారుమారు కాబోతున్నాయి. అరెస్టు పట్ల మాకు భయం లేదు. దేశం కోసం పొత్తు పెట్టుకోబోతున్నాం' అని తెలిపారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే జనం వీధుల్లో కొస్తారని ఆప్ రాజ్యసభ ఎంపీ సందీప్ పాఠక్ హెచ్చరించారు. ఆప్ ఆరోపణలపై సీబీఐ స్పందించలేదు. బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆప్ ఆరోపణలను ఖండించారు. ఆప్-కాంగ్రెస్ పొత్తు చర్చలు విఫలమవుతున్నాయని, ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్ పట్ల ప్రజల్లో సానుభూతి పెంచటం కోసం ఆప్ నేతలు ఇటువంటి పుకార్లను సృష్టిస్తున్నారన్నారు.

గడువు పొడిగించినా ఎఫ్‌సీఐకి చేరని బియ్యం

సీఎంఆర్ టార్గెట్ పూర్తిచేయని మిల్లర్లు.. గతేడాది ఖరీఫ్ బకాయిలు 3.15 లక్షల టన్నులు

- నిరుడు రబీ సీజన్‌కి 29 లక్షల టన్నుల పెండింగ్
- మిల్లర్ల వద్ద ధాన్యం లేకపోవడమే కారణం
- తనిఖీల్లేక ఇష్టారాజ్యం
- కేంద్రం గడువు ఈ నెలాఖరుతో ముగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత జనవరి నెలాఖరుతో ముగిసిపోయిన కస్టమ్ మిల్లింగ్ రైస్ గడువును మరో నెల పొడిగించినా రైస్‌మిల్లర్లు ఎఫ్‌సీఐ టార్గెట్ పూర్తిచేయలేకపోయారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 3.15 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి 29 లక్షల టన్నుల బియ్యం బకాయిలు మిల్లర్ల వద్ద పేరుకుపోయాయి. ఈ నెల 29వ తేదీతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిపోతుండగా... మిల్లర్లు మాత్రం ఎఫ్‌సీఐకి బియ్యం డెలివరీ ఆపేశారు. సీఎంఆర్ బకాయిలపై జనవరి నెలలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎక్కువ ఫోకస్ పెట్టడం, రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో దాడులు చేయించటం, అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై కేసులు కూడా నమోదు చేయించడంతో... సీఎంఆర్ డెలివరీ వేగంగా జరిగింది. మరో నెల రోజుల గడువిస్తే సీఎంఆర్ టార్గెట్ పూర్తిచేయిస్తామని ఢిల్లీ కృషిభవన్ అధికారులను ఒప్పించి పొడిగింపు ఉత్తర్వులు తెప్పించారు. కానీ ఫిబ్రవరి నెలకు వచ్చేసరికి డెలివరీ మందగించింది. ఈ నెలలో మహాలక్ష్మి పథకంలో రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చే పథకంపై కమిషనర్ ఫోకస్ పెట్టారు. దీన్ని అలుసుగా తీసుకొని మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ ఆపేశారు. 2022-23 సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి 65.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకొని... 43.73 లక్షల టన్నుల బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు ఇంకా 3.15 లక్షల టన్నులు ఇవ్వలేదు. దీని విలువ రూ. 1,229 కోట్లు ఉంటుంది. నిరుడు యాసంగి సీజన్ బియ్యం బకాయిలు కూడా 29 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఆ సీజన్లో 67 లక్షల టన్నుల ధాన్యం తీసుకున్న మిల్లర్లు... 45 లక్షల టన్నుల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉండగా... 16 లక్షల మెట్రిక్ టన్నులే తిరిగి ఇచ్చారు. మిల్లర్లు టార్గెట్ పూర్తి చేయకపోవడానికి వారి వద్ద ధాన్యం లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో కొంత బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. దాంతో మిల్లింగ్ చేద్దామంటే ధాన్యం లేకుండాపోయాయి. గతంలో ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించేవారు. ఇప్పుడు అలాంటి తనిఖీలు చేయడం లేదు. అటు ఎఫ్‌సీఐ, ఇటు పౌరసరఫరాల అధికారులు పట్టించుకోకపోవడంతో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించడం, కమిషనర్‌గా డీఎస్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించాక మిల్లర్లపై ఒత్తిడి పెంచడంతో ఫలితం కనిపించింది. కొంతమేరకు సీఎంఆర్ అప్పగించారు. అయినా ఇంకా బకాయిలు పేరుకపోయాయి. ఈ వారం రోజులు మరింత ఒత్తిడి చేస్తే కొంతమేరకు టార్గెట్ పూర్తయ్యే అవకాశాలున్నాయి.

చందమామపై తొలి ప్రైవేటు ల్యాండర్

చరిత్ర సృష్టించిన అమెరికా కంపెనీ ఇంట్యూటివ్ మెషీన్స్



న్యూయార్క్, ఫిబ్రవరి 23: ఎప్పుడో 1972లో అపోలో 17 మిషన్‌లో భాగంగా అమెరికాకు చెందిన వ్యోమనౌక చంద్రుడిపై దిగింది! ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు.. అంటే 52 సంవత్సరాలకు అమెరికా స్పేస్‌క్రాఫ్ట్ ఒకటి చందమామను ముద్దాడింది. అయితే అది నాసా వ్యోమనౌక కాదు. 'ఇంట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు సంస్థ పంపిన నౌక. చందమామపై విజయవంతంగా వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థగా చరిత్ర సృష్టించిందా కంపెనీ. హ్యూస్టన్‌కు చెందిన ఈ కంపెనీ అభివృద్ధి చేసిన ఒడిసస్ అనే ల్యాండర్.. భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున దాదాపుగా 5 గంటల సమయంలో చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగింది. నాసా ఈ ల్యాండర్‌లో ఆరు శాస్త్రీయ పరికరాలను పంపింది. ఒడిసస్ ల్యాండర్ చందమామపై దిగే సమయంలో దాంట్లోని రేంజింగ్ లేజర్ల పనితీరు దెబ్బతింది. నౌక ఎంత ఎత్తులో ఉంది, దాని వేగం ఎంత అనే విషయాలు తెలుసుకోవడానికి అవి అత్యంత కీలకం. దీంతో ఈ మిషన్‌ను పర్యవేక్షించిన శాస్త్రజ్ఞులు.. ల్యాండర్‌లో నాసా ప్రయోగాత్మకంగా పంపిన లేజర్లను నేవిగేషన్ కంప్యూటర్లకు అనుసంధానం చేయడంతో ఎట్టకేలకు ల్యాండయింది. దిగిన తర్వాత కొద్దిసేపటిదాకా దాన్నుంచి ఎలాంటి సంకేతాలూ రాకపోవడంతో అంతా ఆందోళన చెందారు. కాసేపటి తర్వాత దాన్నుంచి బలహీనంగానైనా ఒక సిగ్నల్ రావడంతో ఊపిరిపీల్చుకుని.. సంబరాల్లో మునిగిపోయారు. ఒడిసస్ ప్రస్తుతం చందమామపై స్థిరంగా ఉందని.. డేటాను, చిత్రాలను పంపుతోందని ఇంట్యూటివ్ మెషీన్స్ వెల్లడించింది. కాగా.. దీనికన్నా ముందు చందమామపై దిగిన వ్యోమనౌకలన్నీ ఆయా దేశాల ప్రభుత్వ అంతరిక్ష పరిశోధన సంస్థలు పంపినవే.


సౌరగాలి ప్రభావాన్ని గుర్తించిన 'పాపా'

ఆదిత్య-ఎల్1 మిషన్ మరో ముందడుగు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23: ఇస్రో తొలి సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలోని ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ ఫర్ ఆదిత్య (పాపా) పేలోడ్ విజయవంతంగా పనిచేస్తోంది. ఇందులో ఉన్న అధునాతన సెన్సర్లు ఈ నెల 10, 11వ తేదీల్లో సంభవించిన పరిణామాలతో పాటు కరోనల్ మాస్ ఎజెక్షన్ల (సీఎస్ఈ) ప్రభావాన్ని గుర్తించినట్లు ఇస్రో ఎక్స్‌లో తెలిపింది. పాపా పేలోడ్‌లో రెండు సెన్సర్లను ఏర్పాటు చేశారు. అందులో ఎలక్ట్రాన్లను కొలవడానికి సోలార్ విండ్ ఎలక్ట్రాన్ ఎనర్జీ ప్రోబ్ (స్వీప్), అయాన్‌లను కొలవడానికి సోలార్ విండ్ అయాన్ కంపోజిషన్ ఎనలైజర్ (స్వీకార్) ఉన్నాయి. రెండు సెన్సర్లు సౌర పవన కణాలు ఏ దిశ నుంచి వస్తున్నాయో గుర్తిస్తాయి. ఈ సెన్సర్లు గతేడాది డిసెంబరు 12 నుంచి పని చేస్తున్నట్లు ఇస్రో తెలిపింది. ఈ కాలంలో పాపా పరిశీలనలు ఎలక్ట్రాన్లు, అయాన్ల గణనలో ఆకస్మిక పెరుగుదలను గుర్తించినట్లు పేర్కొంది. ఈ నెల 10, 11వ తేదీల్లో కూడా సౌరగాలిలో స్వల్ప వ్యత్యాసాలను గుర్తించినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఈ నెల 17న షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ కక్ష్యను శాస్త్రవేత్తలు విజయవంతంగా పెంచారు. ప్రస్తుతం జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ లో ఉన్న ఇన్‌శాట్-3డీఎస్‌ను భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని జియో ఆర్బిట్ (భూ స్థిర కక్ష్య)లోకి ప్రవేశ పెట్టారు. ఈ నెల 28న ఉపగ్రహం నిర్దేశిత తుది కక్ష్యలోకి చేరనుంది.

లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి కన్నుమూత



ముంబై, ఫిబ్రవరి23: లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి (86) కన్నుమూశారు. ఈ నెల 21న గుండెపోటు రావడంతో ఆయన్ను ముంబైలోని హిందూజా ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్న మనోహర్ జోషి శుక్రవారం ఉదయం చనిపోయారు. మనోహర్ జోషి 1995-99 మధ్యకాలంలో మహారాష్ట్ర సీఎంగా పనిచేశారు. 2002-04 మధ్య కేంద్రంలో వాజపేయి ప్రభుత్వం ఉన్నప్పుడు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన ఉపాధ్యాయ వృత్తిని వదిలి 1967లో రాజకీయాల్లోకి వచ్చారు. 1972లో తొలిసారి మహారాష్ట్ర శాసనమండలికి ఎన్నికయ్యారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిచారు. 1980ల్లో శివసేనలో కీలకనేతగా ఎదిగారు. 1990లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1990-91మధ్య మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. 1999లో ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగానూ పనిచేశారు. మనోహర్ జోషి మృతిపట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు.

చైనా సరిహద్దులో అత్యాధునిక రాడార్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రక్షణ రంగ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. చైనా సరిహద్దు అయిన వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద అత్యాధునిక రాడార్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.6 వేల కోట్లు కేటాయించింది. ఈ రాడార్లను ఎల్ ఎండ్ టీ సంస్థ స్వదేశంలోనే తయారు చేయనుండడం గమనార్హం. ప్రధానంగా చైనా వాయుసేన కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ఈ రాడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. చైనా సరిహద్దుతో పాటు, పాకిస్థాన్ బోర్డర్ అయిన నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద కూడా ఈ రాడార్లను ఏర్పాటు చేయనుంది.

మహారాష్ట్రలో 39 సీట్లపై 'ఇండియా'అవగాహన

ముంబై, ఫిబ్రవరి 23: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటుపై 'ఇండియా' కూటమిలో ఓ అవగాహన ఏర్పడింది. మొత్తం 48 స్థానాలకుగానూ 39 స్థానాలపై కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఎన్సీపీల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. మిగిలిన 9 స్థానాలకు సంబంధించి చర్చలు కొనసాగుతుండగా, వీటిలో 8 సీట్ల విషయంలో కూటమిలో విభేదాలున్నాయి. మరోవైపు పశ్చిమబెంగాల్‌లో సీట్ల సర్దుబాటుపై తృణమూల్ కాంగ్రెస్‌తో కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చలకు సిద్ధమయినట్లు తెలిసింది. బెంగాల్‌లోని మొత్తం 42 సీట్లకు కాంగ్రెస్ 5 సీట్లు అడుగుతుండగా రెండే సీట్లు ఇస్తామని మమతాబెనర్జీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఇక జమ్మూ- కశ్మీర్‌లో చెరో మూడు సీట్లు పంచుకునే ఒప్పందంతో కాంగ్రెస్.. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీని సంప్రదించినట్లు తెలిసింది.

హోటల్‌లో వ్యభిచార రాకెట్.. బీజేపీ నేత అరెస్టు

- బెంగాల్‌లో సందేశ్‌ఖాలీ వివాదం నేపథ్యంలో ఘటన

కోల్‌కతా, ఫిబ్రవరి 23: హావడాలో వ్యభిచార రాకెట్ నడుపుతున్నారనే ఆరోపణలపై పశ్చిమబెంగాల్‌లో బీజేపీ నేత సబ్యసాచి ఘోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీ ప్రాంతంలో అధికార టీఎంసీ నేత షేక్ షాజహాన్, అతడి అనుచరులు స్థానిక మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యం లో బీజేపీ నేతను అరెస్టు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. హావడాలోని సంక్రాలి ప్రాంతంలో మైనర్ బాలికలతో తన హోటల్‌లో వ్యభిచార రాకెట్ నడుపుతూ ఘోష్ పట్టుబడ్డారని, ఈ వ్యవహారంలో 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు బాధితులను రక్షించారని టీఎంసీ తెలిపింది. ఇదిలా ఉండగా, సందేశ్‌ఖాలీలో వేధింపులకు పాల్పడిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని శుక్రవారం పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. టీఎంసీ నేతల ఆస్తులకు నిప్పు పెట్టారు.

కోర్టు వెలుపల పరిష్కరించుకోవాలి

- జ్ఞాన్‌వాపీ, మథుర వివాదాలపై అజ్మీర్ దర్గా చీఫ్ అబేదిన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి23: వారాణసీలోని జ్ఞాన్‌వాపీ, మథురలోని షాహీ ఈద్గా దర్గాలకు సంబంధించిన వివాదాలను కోర్టు వెలుపల సామరస్యంగా పరిష్కరించుకోవాలని అజ్మీర్ దర్గా చీఫ్ సయ్యద్ జైనుల్ అబేదిన్ సూచించారు. ఎలాంటి వివాదాన్ని అయినా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. ఆలిండియా సూఫీ సజ్జదానిష్ కౌన్సిల్ రాజస్థాన్ యూనిట్ నిర్వహించిన 'పైగామ్-ఎ-మొహబ్బత్ హమ్ సబ్ కా భారత్' సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలోని అంతర్గత సమస్యలను న్యాయస్థానాల వెలుపల శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కాగా, సీఏఏపై ముస్లిం సమాజాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

జీమెయిల్ తరహాలో త్వరలో ఎక్స్‌మెయిల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: నూతనంగా ఎక్స్‌మెయిల్‌ను తీసుకురానున్నట్టు ఎక్స్ (ట్విటర్) సీఈవో ఎలాన్ మస్క్ ధ్రువీకరించారు. గూగుల్ జీమెయిల్‌ను మూసివేస్తుందంటూ వదంతులు వ్యాపించిన నేపథ్యంలో మస్క్ చేసిన ఓ ట్వీట్ ప్రాధాన్యం సంతరించుకొంది. ఎక్స్‌మెయిల్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. అంతకుముందు 'జీమెయిల్‌కు సూర్యాస్తమయం' అన్న పేరుతో గూగుల్ నుంచి వచ్చిందని భావిస్తున్న ఈ-మెయిల్ స్క్రీన్ షాట్ సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మెయిల్స్ సేవలు నిలిచిపోతాయన్న వదంతులు వ్యాపించగా.. వీటిని గూగుల్ ఖండించింది. జీమెయిల్ సేవలు కొనసాగుతాయంది.

రఫాపై ఇజ్రాయెల్ దాడుల్లో 100 మంది మృతి

గాజా, ఫిబ్రవరి 23: దక్షిణ గాజాలోని రఫా నగరంపై ఇజ్రాయెల్ రాత్రి పూట భీకరమైన బాంబు దాడులతో విరుచుకుపడింది. దాడుల మూలంగా 24 గంటల్లో దాదాపు 100మంది చనిపోయారని, మరో 130 మంది గాయాలపాలయ్యారని గాజా వైద్యాధికారులు తెలిపారు. చాలా మంది బాధితులు శిథిలాల కింద చిక్కుకున్నారని చెప్పారు. అంతర్జాతీయంగా వినతులను పట్టించుకోకుండా రఫాపై పూర్తిస్థాయి దాడులు ప్రారంభించనున్నట్టు ఇప్పటికే ఇజ్రాయెల్ బెదిరింపు ప్రకటనలుచేసింది. చిన్న నగరమైన రఫాలో దాదాపు 15లక్షల మంది పాలస్తీనియన్లు ఉండేవారు. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం నేపథ్యంలో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.

కాలర్ ఐడీని తెలిపే ట్రాయ్ సీఎన్ఏపీ సర్వీస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ వస్తే.. ఆ కాల్ చేసింది ఎవరో తెలుసుకునేందుకు స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ట్రూకాలర్, భారత్ కాలర్, యాంటీ స్పామ్ వంటి అప్లికేషన్లు వాడుతుంటారు. అతి త్వరలో ఇలాంటి థర్డ్ పార్టీ యాప్‌లను ఫోన్ల నుంచి అన్‌ఇన్‌స్టాల్ చేసేయవచ్చు. ఎందుకంటే ట్రాయ్.. సీఎన్ఏపీ(కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్) అనే సేవలను ప్రవేశపెట్టనుంది. ఈ సీఎన్ఏపీ ద్వారా మనకు కాల్ చేసిన వారి పేరు మొబైల్ తెరపై కనిపిస్తుంది. కనెక్షన్ తీసుకున్న సమయంలో వినియోగదారుడు ఇచ్చిన పేరు చూపిస్తుంది. ఈ సీఎన్ఏపీ సర్వీస్‌ను దేశవ్యాప్తంగా అందించాలని ట్రాయ్ టెలికామ్ ఆపరేటర్లకు శుక్రవారం సిఫారసు చేసింది.

యుద్ధానికి దూరంగా ఉండండి

త్వరలోనే స్వదేశానికి రప్పిస్తాం

- రష్యా యుద్ధంలో ఇరుక్కున్న భారతీయులకు కేంద్రం భరోసా
- సైన్యంలో సహాయకుడి ఉద్యోగం పేరిట ఏజెంట్ల మోసం
- బాధితుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఏజెంట్ల మాయ మాటలు నమ్మి రష్యా సైన్యంలో సహాయకులుగా చేరిన వంద మందికిపైగా భారతీయులు ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఇరుక్కుపోయారనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భారతీయులు ఆ యుద్ధానికి దూరంగా ఉండాలని హెచ్చరించింది. అంతేకాక, వీలైనంత త్వరలో అందరినీ స్వదేశానికి రప్పిస్తామని భరోసా ఇచ్చింది. ఇందుకు సంబంధించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ఓ ప్రకటన చేశారు. "రష్యా సైన్యంలో సహాయకుల ఉద్యోగానికి కొందరు భారతీయులు ఒప్పందాలపై సంతకాలు చేసి వెళ్లినట్లు తెలిసింది. అలా వెళ్లిన వారిని స్వదేశానికి రప్పించేందుకు భారత రాయబార కార్యాలయం రష్యాలోని సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది.

అప్పటిదాకా భారతీయులు జాగ్రత్తగా ఉండడంతోపాటు యుద్ధానికి దూరంగా ఉండాలని కోరుతున్నాం" అని జైశ్వాల్ పేర్కొన్నారు. కాగా, సైన్యంలో సహాయకుడి ఉద్యోగం, ఆయుధం పట్టుకోవక్కర్లేదు, భారీ వేతనమని ఏజెంట్లు చెప్పిన మాటలు నమ్మి తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, జమ్మూకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన యువకులు రష్యా వెళ్లారు. వీళ్లంతా ఓ ఏడాది పాటు కచ్చితంగా ఉద్యోగంలో ఉండాలనే ఒప్పందంపై సంతకం చేసి నెలకు రూ.1.95 లక్షల వేతనానికి పనిలో చేరారు. శిక్షణ అనంతరం అక్కడి అధికారులు వీరిని వేర్వేరు సైనిక స్థావరాలకు పంపారు. ఇలా వెళ్లిన వారిలో కొందరు రష్యా సైన్యంతో కలిసి బలవంతంగా యుద్ధంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కొందరికి బుల్లెట్ గాయాలు అయ్యాయి. దీంతో తాము మోసపోయామని స్వదేశానికి రప్పించాలని కోరుతూ బాధితుల్లో పలువురు సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారు. దీంతో ఆయా యువకుల కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.ఇలా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన వారిలో నారాయణపేటకు చెందిన మహ్మద్ సుఫియాన్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అస్ఫాన్ ఉన్నారు. ఇక, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన 12 మంది భారతీయులను స్వదేశానికి రప్పించాలని కోరుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి ఇప్పటికే లేఖ రాశారు. తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, యూపీ, కశ్మీర్‌కు చెందిన వారు యుద్ధంలో ఇరుక్కుపోయారన్నారు. ముంబై, దుబాయ్ కేంద్రంగా పని చేస్తున్న ఏజెంట్లు యువతను మోసం చేశారని ఆరోపించారు.

మా బిడ్డలను రక్షించండి!



సయ్యద్ సూఫియాన్

నారాయణపేట టౌన్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రష్యా యుద్ధంలో చిక్కుకుపోయిన ఇద్దరు తెలంగాణ యువకుల గురించి వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా తమ బిడ్డలను కాపాడాలని వారి తల్లిదండ్రులు అర్థిస్తున్నారు. ఈ ఇద్దరు యువకుల్లో ఒకరు నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ సూఫియాన్ కాగా, మరొకరు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అస్ఫాన్. వీరిద్దరూ బాబా అనే వ్యక్తి చేతిలో మోసపోయి రష్యాకు వెళ్లారు. సూఫియాన్ ఇంటర్ చదువుకొని జీవనోపాధి కోసం 2021లో దుబాయికి వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో పని చేసేవాడు. అక్కడ బాబా అనే వ్యక్తి పరిచయమై రష్యాకు వెళ్తే బాగా జీతం వస్తుందని నమ్మించాడు. రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పగా సూఫియాన్ కుటుంబీకులు అప్పుచేసి ఆ మొత్తం బాబాకు చెల్లించారు. సూఫియాన్ డిసెంబరులో దుబాయి నుంచి రష్యాకు వెళ్లాడు. అక్కడ సెక్యూరిటీ ఉద్యోగం అని చెప్పి ఆర్మీలో చేర్చారు. మహ్మద్ అస్ఫాన్ కొన్నాళ్ల క్రితం సామాజిక మాధ్యమాల ద్వారా షార్జాలో ఉండే ఫైసల్‌ఖాన్ అలియాస్ బాబాను సంప్రదించాడు. రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ వంటి ఉద్యోగం ఇప్పిస్తానంటూ బాబా చెప్పిన మాటలు నమ్మి రూ.3 లక్షలు పంపాడు. గత ఏడాది నవంబర్ 12న అస్ఫాన్ చెన్నై విమానాశ్రయం నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లాడు. అక్కడ ఓ మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేయాల్సి ఉంటుందని రష్యన్ భాషలో రాసిన అగ్రిమెంట్‌పై సంతకం చేయించి, శిక్షణ తర్వాత అతన్ని ఉక్రెయిన్ సరిహద్దుల్లోకి పంపించారు. డిసెంబర్ 13 వరకు తమతో మాట్లాడిన అస్ఫాన్ ఆ తరువాత మాట్లాడలేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ బిడ్డలను ఎలాగైనా రక్షించాలని కోరుకుంటున్నారు.

సరోగసీ నిబంధనల్లో సవరణలు

- ఇకపై దాతల నుంచీ అండం, వీర్యం
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: సరోగసీ ద్వారా తల్లిదండ్రులు కావాలని కలలు కంటున్న దంపతులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సరోగసీ-2022 నిబంధనలకు తాజాగా కొన్ని సవరణలు చేసింది. గత నిబంధనల ప్రకారం.. పిల్లలు పుట్టే అవకాశం లేని వివాహిత జంటలు మాత్రమే సరోగసీని ఉపయోగించుకోవాలి. సరోగసీకి వినియోగించే అండం, వీర్యం వారివి లేదా వారి దగ్గరి బంధువులవి అయి ఉండాలి. కానీ, సవరించిన నిబంధనల ప్రకారం.. ఇప్పుడు వివాహిత జంటలో ఒక భాగస్వామి అండం లేదా వీర్యాన్ని వినియోగించలేని పరిస్థితి ఎదురైనప్పుడు.. భార్య లేదా భర్త అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని జిల్లా మెడికల్ బోర్డు ధ్రువీకరిస్తే.. వారు సరోగసీ కోసం దాత అండం లేదా వీర్యాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చారు. వాస్తవానికి అండం, వీర్యం రెండూ ఉద్దేశించిన జంట నుంచి రావాలనే నియమాన్ని 2023లో ప్రవేశపెట్టారు. దానికి ముందు.. అండాలను దానం చేయడానికి మాత్రమే నిబంధనలు అనుమతించేవి. వీర్య దానానికి అవకాశం ఉండేది కాదు. అయితే.. పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావం చేసే సమస్యలున్న మహిళ.. దాత అండాన్ని స్వీకరించి అద్దె గర్భం ధరించడానికి గతేడాది సుప్రీం కోర్టు అనుమతించింది. ఈ కీలక నిర్ణయాన్ని అనుసరించి సరోగసీ నిబంధనల్లో తాజాగా సవరణలు చేశారు. అయితే, సరోగసీ ద్వారా సంతానాన్ని పొందాలనుకునే వితంతువులు లేదా విడాకులు తీసుకున్న ఒంటరి మహిళలకు తాజా నిబంధనలు వర్తించవని కేంద్రం స్పష్టం చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం ఒంటరి మహిళలు తప్పనిసరిగా వారి సొంత అండాలు, దాత వీర్యాన్ని ఉపయోగించాలి. అయితే ఈ నిబంధనే ఇప్పుడు చర్చకు దారితీసింది. సరోగసీ ద్వారా పిల్లల్ని కనేందుకు అవకాశం లేకుండా వారిని మినహాయించడంపై ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

మతి లేకే ఆ మాటలు!

నా వారాణసీ బిడ్డలను తాగుబోతులంటారా?

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ ధ్వజం



వారాణసీ, ఫిబ్రవరి 23: ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ విపక్ష ఇండియా కూటమిపై ప్రధాని మోదీ విమర్శల దాడిని తీవ్రం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం వారాణసీలో శుక్రవారం రూ.13 వేల కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలు, సంత్ రవిదాస్ జయంతి పాల్గొన్న ఆయన.. బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండా మండిపడ్డారు. వారాణాసీలో కొందరు మద్యం తాగి రోడ్డుపై పడి ఉండడాన్ని చూశానంటూ రాహుల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఇదేం భాష? అని ప్రశ్నించారు. 'నా వారాణసీ బిడ్డలను తాగుబోతులని అంటారా? వారి సొంతగడ్డపైనే కాంగ్రెస్ యువరాజు వారాణసీ యువతను అవమానించారు. మతి లేని వారి నుంచే ఇలాంటి మాటలు వస్తాయి. 20 ఏళ్లుగా వారు నన్ను దూషిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆ అసహనం అంతటినీ యూపీ యువతపై చూపుతున్నారు. ఈ అవమానాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను' అంటూ నిప్పులు చెరిగారు. యువత ప్రతిభను చూసి కుటుంబ పార్టీల నాయకులు తట్టుకోలేక.. వారి అసలు స్వరూపాన్ని బయట పెట్టుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. కులతత్వంతో రెచ్చగొట్టడాన్నే ఇండియా కూటమి పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఐదేళ్లలో భారత్‌ను అభివృద్ధి చిహ్నంగా మారుస్తానని, దానికి గ్యారెంటీ ఇస్తున్నాని చెప్పారు.

రాత్రి వేళ రోడ్ షో.. ఆకస్మిక తనిఖీ

మోదీ గురువారం రాత్రే వారాణసీ చేరుకున్నారు. ఆ వెంటనే రోడ్ షోలో పాల్గొన్నారు. ఇటీవల ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రధాని పరిశీలించారు. అర్ధరాత్రి వేళ శివ్‌పుర్-ఫుల్వారియా-లహర్‌తారా మార్గ్‌ను యూపీ సీఎం యోగితో కలిసి తనిఖీ చేశారు. ఈ ఫొటోలను మోదీ "ఎక్స్"లో పోస్ట్ చేశారు. కాగా, రూ.360 కోట్లతో నిర్మించిన ఈ రోడ్డు వినియోగంలోకి రావడంతో బనారస్ యూనివర్సిటీ నుంచి వారణసీ విమానాశ్రయానికి వెళ్లేందుకు ప్రయాణ సమయం సగం మేర తగ్గనుంది.

13 తర్వాత లోక్‌సభ షెడ్యూల్!

543 స్థానాలకు 7 దశల్లో పోలింగ్?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గట్టిగా ఇరవై రోజుల్లో లోక్‌సభ ఎన్నికల తేదీలు వెలువడనున్నాయి. మార్చి 13 తర్వాత ఏ క్షణమైనా ఎలక్షన్ షెడ్యూల్ వెలువడే అవకావముందని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వర్గాలు శుక్రవారమిక్కడ తెలిపాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సారథ్యంలో కమిషనర్లు, ఉపకమిషనర్లు ఎన్నికల సన్నద్ధతపై ప్రస్తుతం రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారు(సీఈవో)లతో, రాజకీయ పార్టీలతో చర్చిస్తున్నారు. శుక్రవారం ఈసీ బృందం తమిళనాట పర్యటించింది. అనంతరం యూపీ, జమ్మూకశ్మీరులకు వెళ్తుంది. మార్చి 13లోపే ఈ పర్యటనలు పూర్తవుతాయి. అవి ముగియగానే షెడ్యూల్ విడుదలవుతుందని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాలకు ఏడు దశల్లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. అర్హులైన ఓటర్ల సంఖ్య 96.98 కోట్లు. ప్రపంచంలోనే ఇది అత్యధికం. 18-19 ఏళ్ల నవయువత 1.85 కోట్ల మంది వరకు ఓటు నమోదు చేసుకున్నట్లు ఈసీ వర్గాలు తెలిపాయి. కాగా.. రాష్ట్రాల సీఈవోలు పలు సమస్యలను ఈసీ బృందం దృష్టికి తీసుకొస్తున్నారు. ఈవీఎంల తరలింపు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, భద్రతా బలగాల అవసరం, సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా వంటి వాటిని ప్రస్తావిస్తున్నారు. వీటికి అనుగుణంగా ఈసీ చర్యలు తీసుకోనుంది.



స్పీకర్ పోడియం వద్ద బీజేపీ సభ్యుల నిరసన

కేంద్రంతో అమీతుమీ

ఆర్థిక వనరుల పంపిణీపై తారతమ్యం చూపవద్దని కర్ణాటక శాసనసభలో తీర్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పన్నులలో వాటా, గ్రాంట్ల కేటాయింపు, కరువు సాయం విడుదల వంటి అంశాల్లో కర్ణాటక రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ.. ఢిల్లీలో ఇటీవల నిరసన ప్రదర్శన నిర్వహించిన కర్ణాటక కాంగ్రెస్, తన ధాటిని మరింత పెంచింది. శాసనసభలో గురువారం విపక్షాలను షాక్‌కు గురి చేసేలా కేంద్రప్రభుత్వ తీరును ఖండిస్తూ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. బడ్జెట్‌పై చర్చ ముగిసిన తక్షణం శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ రెండు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక వనరులను ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని రాష్ట్రాలకు సమానంగా పంచాలన్నది మొదటి తీర్మానం కాగా, రైతుల పంటలన్నింటికీ కనీస మద్దతు ధర చట్టాలను ప్రవేశపెట్టాలన్నది రెండో తీర్మానం. దీనిపై ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దొంగచాటుగా తీర్మానం తీసుకురావడం సరికాదని విమర్శించాయి. ప్రతిపక్షాల సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లారు. ప్రధాని మోదీ నినాదాలతో సభ హోరెత్తింది. కాగా, కేంద్రాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర బీజేపీ అసెంబ్లీలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది.

భారతీయులకు ఐదేళ్ల దుబాయ్ వీసా

దుబాయ్, ఫిబ్రవరి 23: దుబాయ్ వెళ్లాలనుకునే భారతీయ పర్యాటకులకు మెరుగైన వీసా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. ఐదేళ్లపాటు చెల్లుబాటు అయ్యే వీసాలను జారీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. దీంతో ఒకసారి వీసా తీసుకున్న భారత పర్యాటకులు ఎన్నిసార్లయినా దుబాయ్ వెళ్లిరావడానికి వెసులుబాటు కలుగుతుంది. దుబాయ్‌కు వచ్చిన తరువాత 90 రోజులపాటు ఉండవచ్చని, ఇలా ఏడాదిలో గరిష్ఠంగా 180 రోజులు ఉండడానికి అవకాశం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జర్మనీలో గంజాయి లీగల్

బెర్లిన్, ఫిబ్రవరి 23: జర్మనీలో ఇక గంజాయి తాగడం చట్టబద్ధం కానుంది. వినోద కార్యక్రమాల్లో భాగంగా బహిరంగంగానే తాగే అవకాశం కలగనుంది. కొత్త చట్టం ప్రకారం 19 ఏళ్లు దాటిన వారు బహిరంగంగా 25 గ్రాములు, ప్రయివేటు ఇళ్లల్లో 50 గ్రాముల వరకు గంజాయిని తాగవచ్చు. ఈ నూతన నిబంధన ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. డ్రగ్స్‌ను నిషేధిస్తూ చట్టాలు ఉన్నా యువత వీటికి అలవాటు పడ్డారని, అందువల్ల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికే గంజాయిని చట్టబద్ధం చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 24 ఫిబ్రవరి 2024

జీమెయిల్‌లో ఏఐ పవర్డ్ టూల్ 'సూపర్ హ్యూమన్'





ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పవర్డ్ ఈమెయిల్ యాప్ 'సూపర్ హ్యూమన్' అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో ముందుకువస్తోంది. దీంతో ఉత్పాదకత పెరుగుతుంది. సమయం ఆదా అవుతుంది. ఈమెయిల్స్‌కు సమాధానం ఇవ్వడం అలాగే సులువుగా వేగంగా వాటిని పంపడంలో ఇది సహకరిస్తుంది. వారానికి నాలుగు గంటల సమయం ఆదా అవుతుందంటే ఈ ఫీచర్ పవర్ ఏమిటో ఇట్టే తెలుసుకోవచ్చు. ముఖ్యమైన టాస్క్‌లపై దృష్టిపెట్టేందుకు యూజర్లకు వీలవుతుంది. ఈమెయిల్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ ఫ్రీ ఎక్స్‌పీరియెన్స్‌ను కలుగజేస్తుంది. ప్రధానంగా...

- యూజర్లు అందించిన కొద్దిపాటి ఫ్రేజులతో మొత్తం మెయిల్ డ్రాఫ్టింగ్‌కు వీలుంటుంది. సరైన పదాలతో, చాలా చక్కటి సమాధానం ఇవ్వవచ్చు.
- స్పెల్లింగ్, గ్రామర్ తప్పుల నివారణ, మిస్సింగ్ కేరెక్టర్లను పరిహరించడం, క్యాపిటల్ పదాల వినియోగం వంటివి చేస్తుంది.
- సూపర్ హ్యూమన్‌లో స్ప్లిట్ బాక్స్ ఉంటుంది. ఇది టీమ్స్‌ను విభజిస్తుంది. దీంతో కొన్ని సెక్షన్లపై యూజర్లు వెంటనే చర్య తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.
- స్నిపెట్ ఫీచర్ మరొకటి. తరచూ ఇచ్చే జవాబులను వేగంగా అవే వాక్యాలతో అమరుస్తుంది. ఫలితంగా సమయం ఆదా అవుతుంది.
- క్యాలండర్ ఈవెంట్లను యూజర్లు క్రియేట్ చేసుకోవచ్చు. టాస్క్‌లను పూర్తి చేసుకోవచ్చు. ట్రాకింగ్ పనిని కూడా నిర్వహిస్తుంది. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఇది సబ్‌స్క్రిప్షన్ టూల్. నెలకు 30 డాలర్లు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ ఫీచర్ల కోసం గ్రోత్, ఎంటర్‌ప్రైజ్ ప్లాన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.



అడోబ్ ఆక్రోబాట్ పీడీఎఫ్ టూల్‌కు ఏఐ జోడింపు

అడోబ్ ఆక్రోబాట్ తన పీడీఎఫ్ మేనేజ్‌మెంట్ టూల్‌కు జనరేటివ్ ఏఐని పరిచయం చేస్తోంది. అడోబ్ ఆక్రోబాట్ మౌలికంగా పీడీఎఫ్ మేనేజ్‌మెంట్ టూల్ అన్న విషయం తెలిసిందే. దీనికి ఏఐ టూల్‌ని జతచేస్తోంది. ఫలితంగా మెరుగైన అనుభవం యూజర్లకు కలుగనుంది. ప్రధానంగా దీంతో అతి పెద్ద డాక్యుమెంట్లకు సంబంధించిన సమ్మరీ నిమిషాల్లోనే యూజర్లకు లభ్యమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా మూడు ట్రిలియన్ల మేరకు ఉన్న పీడీఎఫ్ డాక్యుమెంట్లకు ఈ ఏఐ టూల్‌తో అదనపు విలువ సమకూరనుందని అడోబ్ ఈ సందర్భంలో పేర్కొంది. ఏఐకి తోడు మెషీన్ లెర్నింగ్ టూల్స్‌ను ఈ ప్రక్రియలో అడోబ్ ఉపయోగిస్తుంది. ఫలితంగా పీడీఎఫ్ స్ట్రక్చర్ అదేవిధంగా కంటెంట్‌ను అర్థం చేసుకోవడం సులువుగా ఉంటుంది. అదనపు ఖర్చు లేకుండా ఈ ఫీచర్లను యూజర్లు ఉపయోగించుకోవచ్చు. ఈ టూల్స్‌తో డెస్క్‌టాప్‌పై ఒనగూరే ప్రయోజనాలను బ్లాగ్‌స్పాట్‌లో అడోబ్ తెలిపింది. కీ పాయింట్ల రూపంలో సమ్మరీని అందిస్తుంది. డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్‌ను పాటిస్తుంది. అలాగే ఏఐ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు కస్టమర్ డేటాను అస్సలు స్టోర్ చేయదు. సమాచారానికి మరింత సెక్యూరిటీని సమకూరుస్తుంది.

ఐఫోన్ 'బ్లింకిస్ట్' వేల పుస్తకాలు చదివేయవచ్చు!

నేను లక్ష పుస్తకాలు చదివాను అంటే ఇక ఎకసక్కాలు చేయాల్సిన పనిలేదు. అలాంటివి ఇక నిన్నటి మాటలు. నిజంగానే పెద్ద సంఖ్యలో పుస్తకాలను జీవితకాలంలో చదివేయచ్చు.

అందుకు ఐఫోన్ యాప్ 'బ్లింకిస్ట్' తోడ్పడుతుంది. అన్నేసి పుస్తకాలు చదవడానికి లేదా పాడ్‌కాస్ట్‌లో వినడానికి సమయం లేకపోయినప్పటికీ ఇబ్బంది లేదు. 'బ్లింకిస్ట్' సహకారంతో అన్ని పుస్తకాలను తెలుసుకోవచ్చు. అందులో ఏముందో పట్టేయచ్చు. ఈ యాప్ మొత్తం పుస్తకాన్ని స్కాన్ చేసి కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలో అందులో ఏముందో చెప్పేస్తుంది. అదేదో తెలుసుకుంటే చాలు, మొత్తం పుస్తకంలో ఏమి ఉందో పాఠకుడికీ తెలుస్తుంది.



వాస్తవానికి దీన్ని ఐఫోన్, ఐపాడ్ డివైజ్‌ల కోసం రూపొందించారు. ఇది పుస్తకాలు, పాడ్‌కాస్ట్ యూజర్లకు అర్థమయ్యేలా వివరించే యాప్. ఆడియో, టెక్స్ట్ ఫార్మేట్ రూపంలో అందిస్తుంది. కెరీర్, సక్సెస్, మైండ్‌ఫుల్‌నెస్, మతం, సైన్స్, చరిత్ర, పర్సనల్ డెవలప్‌మెంట్ సహా వివిధ సబ్జెక్టులను డీల్ చేస్తుంది. ఇందులో వేలకొద్దీ బెస్ట్ సెల్లింగ్ నాన్-ఫిక్షన్ పుస్తకాలు ఉన్నాయి. పదిహేను నిమిషాల్లో దేన్నైనా ఆకళింపు చేసుకోవచ్చు. ట్రావెలింగ్ నుంచి రిలాక్సింగ్ వరకు ఏ సమయంలో అయినా వీటిని ఆస్వాదించవచ్చు. హై క్వాలిటీ సమాచారంతో ఉంటుంది. ఇందులో షార్ట్‌కట్స్ అంటే ఇంకా తక్కువ చేసి కూడా ఉంటాయి. వాటిలోనూ విషయం మొత్తం కవర్ అవుతుంది. మొత్తమ్మీద ఈ యాప్‌లో చదివి లేదా విని ఒక పుస్తకంపై లోతైన అవగాహన కలిగించుకోవచ్చు.

మంచి అలవాట్లకు యాప్ హ్యాబిటిఫై

డిజిటల్ ప్రపంచంలో ఇదో సానుకూల కోణం. మంచి అలవాట్లను పెంపొందించుకునేందుకు ఉపకరించే యాప్ 'హ్యాబిటిఫై' అందులో ఒకటి. నిజానికి ఆరోగ్యకర అలవాట్లతో ఉత్పాదకత పెరుగుతుంది. ఎప్పటికప్పుడు ట్రాకింగ్‌తో తప్పులను సవరించుకోవచ్చు. లక్ష్యానికి చేరువ కావచ్చు. యాప్‌తో ట్రాకింగ్ ఎలాగంటే....

- ట్రాకింగ్ చేయాలని భావిస్తున్న వాటితో జాబితా రూపొందించుకోవాలి. రన్నింగ్, వర్కౌట్ వరకు అన్నీ లిస్ట్ చేసుకోవాలి. ఇవన్నీ దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. చర్యతీసుకోదగ్గవి, లక్ష్యం చేరుకోదగ్గవి ఎంచుకోవాలి.
- తదుపరి ప్రోగ్రెస్ పరీక్ష కోసం మెజర్‌మెంట్ యూనిట్‌ను క్రియేట్ చేసుకోవాలి. ప్రోగ్రెస్ ట్రాకింగ్‌లో భాగంగా వివిధ లక్ష్యాల కోసం వేర్వేరు మెజర్స్‌ను పెట్టుకోవాలి.
- క్రియేట్ చేసుకున్నవాటిని రొటీన్‌గా మార్చుకోగలగాలి. అలా చేస్తేనే వాటిపై కార్యాచరణ సాధ్యమవుతుందని గుర్తించాలి.
- అప్పుడు ఈ యాప్ అలెర్ట్‌లు, రిమైండర్ ఫీచర్స్‌తో రంగంలోకి దిగుతుంది. నిర్దేశిత గడువులోగా అనుకున్న లక్ష్యసాధన దిశగా యూజర్ని హెచ్చరించగలుగుతుంది.
- ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచీ, మ్యాక్స్‌లో యాప్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. ఈ యాప్‌ని ఐఓఎస్ డివైజ్‌లకు అనుగుణంగా తీర్చిదిద్దారు.



వాట్సాప్‌లో కొత్త ఫార్మేటింగ్ ఫీచర్స్

వాట్సాప్ ప్రాథమికంగా మెసేజింగ్‌కు అనువైనది. యూజర్ ఎక్స్‌పీరియెన్స్ పెంచే యత్నంలో భాగంగా ఏకంగా నాలుగు ఫార్మేటింగ్ ఫీచర్లను పరిచయం చేస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్, వెబ్, మేక్‌కు తోడు చానల్స్‌లో బుల్లెటెడ్ లిస్ట్, నంబర్డ్ లిస్ట్, బ్లాక్ కోట్స్, ఇంక్లయిన్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఉన్న బోల్డ్, ఇటాలిక్, స్ట్రయిక్‌త్రూ, మోనోస్పేస్ ఫార్మేట్‌లను కాంప్లిమెంట్ చేసేలా కొత్తవి ఉంటాయని 'ద వెర్జ్' తెలిపింది.

బుల్లెటెడ్ లిస్ట్: అటూ ఇటూ " " సింబల్స్‌తో స్పేస్ ఇచ్చుకుంటూ బుల్లెట్ పాయింట్స్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

నంబర్డ్ లిస్ట్: మెసేజ్‌లోని సమాచారం ఒక ఆర్డర్‌లో ఉండాలని భావిస్తే 1, 2 అంటూ అంకెలతో ఒక క్రమంలో పెట్టుకోవచ్చు.

బ్లాక్ కోట్స్: అతి పెద్ద మెసేజుల్లో బ్లాక్ కోట్స్‌తో హైలైట్ పెట్టుకోవచ్చు. సింపుల్‌గా > సింబల్‌ని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఆ పని చేయవచ్చు.

ఇంక్లయిన్ కోడ్: కోడర్స్‌కు ఇది పర్ఫెక్ట్. ప్రత్యేకించి ఒక సమాచారాన్ని తద్వారా హైలైట్ చేసుకోవచ్చు. " " సింబల్‌తో ఈ పనిచేయవచ్చు.

క్లాసిక్ ఫార్మేటింగ్ స్టయిల్స్ కావాలనుకునే వారికి ఈ ఫార్మేటింగ్ ఫీచర్స్ అనువుగా ఉంటాయి.



ప్లేస్టోర్‌లో ఆండ్రాయిడ్ మాల్వేర్



నాలుగువైపులా మూసేస్తే మరో పక్కనుంచి మాల్వేర్ దాడి జరుగుతోంది. తాజాగా గూగుల్ ప్లే స్టోర్‌లో మరో ఆండ్రాయిడ్ మాల్వేర్ యాప్‌ని కనుగొన్నారు. అది డేటాతోపాటు డబ్బులను తస్కరించేందుకు ఉపయోగపడుతున్న మాల్వేర్. గూగుల్ ప్లే స్టోర్‌లో అలాంటివి లక్షన్నర వరకు డౌన్‌లోడ్స్ కలిగి ఉన్నాయి. అనాట్సా బ్యాంకింగ్ ట్రోజన్ మాల్వేర్‌ని ఈ యాప్స్ వ్యాప్తి చెందిస్తున్నాయి. తద్వారా డివైజ్‌పై కంట్రోల్ సాధించి తమ పనులను చక్కబెడుతున్నాయి. 'బ్లీపింగ్ కంప్యూటర్' రిపోర్ట్ ప్రకారం ఇవి ఎక్కువగా ఉచిత పీడీఎఫ్, క్లీనర్ యాప్స్. ఇవి ఆండ్రాయిడ్ యాక్సెబిలిటీని, సర్వీస్‌ను పొందుతున్నాయి. ఆండ్రాయిడ్ 13, గూగుల్‌కు చెందిన సెక్యూరిటీ చెక్స్‌ను అధిగమించి మరీ పలు అంచెలుగా చొచ్చుకువస్తున్నాయి.

అలాంటి వాటిలో 'ఫోన్ క్లీనర్ - ఫైల్ ఎక్స్‌ప్లోరర్, 'పీడీఎఫ్ వ్యూయర్ - ఫైల్ ఎక్స్‌ప్లోరర్, 'పీడీఎఫ్ రీడర్ - వ్యూయర్ అండ్ ఎడిటర్, 'ఫోన్ క్లీనర్: ఫైల్ ఎక్స్‌ప్లోరర్, 'పీడీఎఫ్ రీడర్: ఫైల్ మేనేజర్ ఇందులో ఉన్నాయి. ఉచిత యాప్‌లన్నీ ఏదో ఒక రూపంలో డబ్బులు వసూలు చేస్తాయి.

వీటి నుంచి రక్షణ పొందాలంటే, ఉచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదు. అసలా యాప్ అవసరమా లేదా అన్నది మొదట ఆలోచించుకోవాలి. వేర్వేరు యాప్‌లతో డివైజ్‌ను నింపేయకూడదు. రెవ్యూ, రేటింగ్, డౌన్‌లోడ్స్ వంటివి చూసుకుని ఎంచుకోవాలి. ఆండ్రాయిడ్ డివైజుల్లో గూగుల్ ప్లే ప్రొటెక్ట్ ఉంచుకుంటే ఉన్న యాప్‌లకు తోడు మాలాసియస్ కోడ్ యాక్టివిటీని చెక్ చేస్తుంది. కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు అలెర్ట్‌గా ఉండాలి.

ఇండియాలోకి శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్

శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్ ల్యాప్‌టాప్‌లు మూడు ఇండియాలోకి వస్తున్నాయి. గెలాక్సీ బుక్ 4 ప్రొ, గెలాకీ బుక్ 4 ప్రొ 360, గెలాక్సీ బుక్ 4 అల్ట్రా - మూడు మోడల్స్ వాస్తవానికి గత డిసెంబర్‌లోనే విడుదలయ్యాయి. స్పెసిఫికేషన్స్ విషయానికి వస్తే, వనీలా శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 360



ముఖ్యంగా 15.6 ఇంచీల ఫుల్ హెచ్‌డి(1920 x 1080పిక్సెల్స్), సూపర్ అమోల్డ్ టచ్ స్క్రీన్ కలిగి ఉంది. ఇదే ప్రొ 360 మోడల్స్ 16 ఇంచీలు డైనమిక్ అమోల్డ్ 2ఎక్స్ యాటీ రిఫ్లక్షన్ టచ్ డిస్‌ప్లే కలిగి ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 ప్రొ 14 అలాగే 16 ఇంచీల స్క్రీన్‌తో రెండు వేరియంట్స్ ఉన్నాయి. టచ్ - సెన్సిటివ్ ప్యానల్స్ ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 360, గెలాక్సీ బుక్ 4 ప్రొ 360 వరుసగా 68డబ్ల్యుహెచ్(వాట్స్-అవర్స్), 76డబ్ల్యుహెచ్ బ్యాటరీలు ఉన్నాయి. 65 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉంది. 14 ఇంచీల గెలాక్సీ బుక్ 4 ప్రొ 63డబ్ల్యుహెచ్ బ్యాటరీ, 16 ఇంచీల 76డబ్ల్యుహెచ్ బ్యాటరీ కలిగి ఉన్నాయి. 65 వాట్స్ చార్జింగ్ సపోర్ట్ ఉంది. ఇండియా ప్రస్తుతం ప్రీ ఆర్డర్‌కు అవకాశం కల్పించింది. మూన్‌స్టోన్, గ్రే ప్లాటినమ్ సిల్వర్ రంగుల్లో లభ్యమవుతున్నాయి. ఇంటెల్ కోర్ అల్ట్రా సీపీయూ కలిగి ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 360 రూ.1,14,990, గెలాక్సీ బుక్ 4 ప్రొ రూ.1,31,990, గెలాక్సీ బుక్ 4 ప్రొ 360 రూ.1,63,990 నుంచి ఉన్నాయి. ఫిబ్రవరి 12 నుంచి అందుబాటులో ఉన్నాయి. అయితే ఫ్లిప్ కార్ట్ లిస్టింగ్స్ ప్రకారం ఫిబ్రవరి 26 నుంచి డెలివరీ చేయనుంది.



ప్రాణాలు కాపాడిన యాపిల్ వాచీ

యాపిల్ వాచీ అచ్చంగా ఒక మనిషి ప్రాణాలు కాపాడింది. ఒక వ్యక్తి హార్ట్ రేటు గణనీయంగా తగ్గింది. వెంటనే యాపిల్ వాచీ సదరు యూజర్ని హెచ్చరించింది. అలా తాను ప్రాణాలు కాపాడుకున్నాడు. న్యూజెర్సీలో ఉంటున్న ఫ్రాంక్ హెగెర్టీ ఒక రిటైర్డ్ అకౌంటెంట్. తను యాపిల్ వాచీ ఎస్‌ఈ 'బీ కూల్' కొనుగోలు చేశాడు. ఒక రోజు పడుకున్న సమయంలో తన వాచీ నుంచి అలెర్ట్ వచ్చింది. హృదయస్పందన కాస్తా 30 బీట్స్ కంటే తక్కువగా నమోదైంది. వెంటనే తను హాస్పిటల్‌కు చేరుకున్నాడు. హార్ట్ పూర్తిగా బ్లాక్ అయిందని డాక్టర్లు నిర్ధరించారు. వెంటనే డాక్టర్లు చర్యలు తీసుకోవడంతో తను ప్రాణాలతో బైటపడ్డాడు.

యాపిల్ వాచీలో హార్ట్ రేటును చెక్ చేసుకోవాలంటే...

- యాపిల్ వాచీలో హార్ట్ రేట్ మానిటరింగ్‌కు టర్నాన్ కావాలి. సెట్టింగ్స్‌లోకి వెళ్ళి మొదట ప్రైవసీ అండ్ సెక్యూరిటీ తదుపరి హెల్త్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- హార్ట్ రేట్‌ని టాప్ చేయాలి. హార్ట్ రేట్‌ని టర్నాన్ చేయాలి. హార్ట్ రేట్ యాప్‌ని ఓపెన్ చేయాలి. హార్ట్ రేటుని తెలుసుకోవాలి.

ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్ క్లిప్!



ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్ 'యాప్ క్లిప్'ని పరీక్షిస్తోంది. దీంతో అవసరమైన యాప్ లేనప్పటికీ రీల్స్‌ని - యాప్ నేటివ్ ఇంటర్‌ఫేస్‌లో చూడవచ్చు. ఇది యాపిల్ క్లిప్‌తో సాధ్యమవుతుంది. ప్రస్తుతం దాన్ని ఇన్‌స్టాగ్రామ్ పరీక్షిస్తోంది. 2021లో ఒక అప్డేట్‌తో ఐఫోన్‌లోకి యాప్ క్లిప్ వచ్చింది. దీంతో సదరు ఫుల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలా వద్దా అన్నది ప్రివ్యూతో తేల్చుకోవచ్చు. బేటా టెస్టర్లకు టెస్ట్ ఫ్లయిట్ ద్వారా ఇది అందుబాటులో ఉందని '9టు5మేక్' పేర్కొంది. దీంతో బ్రౌజర్ అవసరం లేకుండానే నేటివ్ యూఐతో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూడవచ్చు. ఇంకో విషయం, దీనికి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే ఆరో రీల్‌ను చూసిన తరవాత యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని యూజర్ని ప్రోత్సహిస్తుంది. నిజానికి వేర్వేరు విధానాల్లో యాప్ క్లిప్స్‌ను పొందవచ్చు. యాప్ క్లిప్ ఓపెన్ అయిన తరవాత ఎనిమిది గంటల సేపు నోటిఫికేషన్స్ పంపగలదు. అలా అనుకున్నప్పుడు వీటిని డెమోలగా భావించవచ్చు.

మార్కెట్లోకి ఐకూ నియో 9 ప్రొ



ఐకూ నియో 9 ప్రొ ఇండియన్ మార్కెట్లోకి వచ్చేసింది. కంపెనీకి చెందిన లేటెస్ట్ ప్రీమియం మిడ్ రేంజ్ స్మార్ట్ ఫోన్ ఇది. క్వాల్కామ్‌కు చెందిన స్నాప్‌డ్రాగన్ 8జనరేషన్, 2 మొబైల్ ప్రాసెసర్, 12 జీబీ ర్యామ్, 256జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజీ ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14-బేస్డ్ ఫన్‌టచ్ ఓఎస్ ఔటాఫ్ ద బాక్స్‌పై రన్ అవుతోంది. 6.78 ఇంచీలు 1260 x 2800 పిక్సెల్ - ఎల్‌టీపీఓ అమోల్డ్ స్క్రీన్, 120హెచ్‌జెడ్ రిఫ్రష్ రేటు ఉన్నాయి. గేమింగ్ సమయంలో రిఫ్రష్ రేటు 144హెచ్‌జెడ్‌గా ఉంటుంది. ఐకూ వెట్ టచ్ టెక్నాలజీ ఉంది. అంటే కొన్ని టాస్క్‌లను యూజర్ పొడి చేతులతోనే చేయాలి. ఇందులో రెండు రేర్ కెమెరాలున్నాయి. ఒకటి సెన్సర్‌తో 50 మెగా పిక్సల్ కెమెరా. ఇంకొకటి 8 మెగా పిక్సెల్. వీడియో కాల్స్, సెల్ఫీల కోసం సెన్సర్‌తో 16 మెగా పిక్సల్ కెమెరా ఉంది. బ్లూటూత్ 5.3, జీపీఎస్, యుఎస్‌బీ టైప్-సి పోర్ట్‌కు తోడు యాక్సిలరోమీటర్, యాంబియెంట్ లైట్ సెన్సర్, ఈ-కాంపాస్, ప్రాక్సిమిటీ సెన్సర్, గైరోస్కోప్ ఉన్నాయి. 120 వాట్స్ సూపర్ వూక్ చార్జింగ్ సదుపాయం ఉంది. దీని బరువు 190 గ్రాములు. 256 జీబీ స్టోరేజికి 8జీబీ ర్యామ్ అయితే రూ.37,990కి, అదే 12 జీబీ ర్యామ్ ఉంటే 39,999 లభిస్తుంది. కాంకరర్ బ్లాక్, ఫైరీ రెడ్ రంగుల్లో ఇది లభ్యమవుతోంది. అమెజాన్, ఐకూ స్టోర్స్‌లో ఇది లభిస్తుంది. ఆఫర్లు కూడా ఉన్నాయి.

బియ్యం డబ్బాలో ఫోన్! వద్దే వద్దు

స్మార్ట్ ఫోన్ చేతిలో నుంచి జారడం సహజం. ఒకోసారి నేలపై లేదంటే నీటిలో పడొచ్చు. నీటిలో మునిగితే మాత్రం వెంటనే బియ్యం డబ్బాలో పెడితే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తారు. అంతే కాదు అందుకు తిరుగులేని రుజువులు చెబుతారు. అయితే ఐఫోన్ నీటిలో పడితే మాత్రం దాన్ని తుడిచి బియ్యంలో పెట్టే పని వద్దని నిపుణులు చెబుతున్నారు. ఆ మేరకు ఒక డాక్యుమెంట్ 'మేక్ వరల్డ్'లో ప్రత్యక్షమైంది. బియ్యంలో పెట్టడానికి బదులు కింది విధంగా చేస్తే మంచిదని ఆ డాక్యుమెంట్‌లో తెలిపింది. అవేంటంటే...

- ఎక్స్‌టర్నల్ హీట్ లేదంటే కంప్రెస్డ్ ఎయిర్‌తో తడిసిన ఐఫోన్‌ను డ్రై చేసే పని పెట్టుకోకూడదు.
- పత్తి(దూది) లేదా పేపర్ టవల్‌ని కనెక్టర్‌లో పెట్టకూడదు
- బియ్యం బ్యాగ్‌లో పెట్టకూడదు. అలా చేస్తే, అందులో ఉండే చిన్నపాటి దూళి వంటి కణాలు ఫోన్‌లోకి చేరి డ్యామేజ్ కావచ్చు.



అందుకు బదులు

- కనెక్టర్‌ను కిందివైపుపెట్టి ఎక్కువగా ఉన్న నీటిని తొలగించాలి. తదుపరి గాలిసోకే చోట పెట్టి ఆరనివ్వాలి.
- అలా అరగంటసేపు ఉంచిన తరవాత చార్జింగ్‌తో లైటినింగ్ లేదా యుఎస్‌బీ-సి కేబుల్ లేదా మరో యాక్సెసరీకి కనెక్ట్ చేయడం ద్వారా ఉంచాలి. పూర్తిగా డ్రై అయ్యేందుకు కనీసం 24 గంటల సమయం పడుతుంది.
- పూర్తిగా ఆరినప్పటికీ చార్జింగ్ కాకుంటే అడాప్టర్ నుంచి కేబుల్‌ని తీసేయాలి. గోడ నుంచి కూడా తీసేయాలి. తిరిగి వాటిని కనెక్ట్ చేసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) తరఫున తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్‌వీయూ)- రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్) 2023-24 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా పార్ట్ టైం/ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లలో అడ్మిషన్స్ ఇస్తారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 24 ఫిబ్రవరి 2024

diksuchi@andhrajyothy.com

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్



ఏపీ ఆర్‌సెట్

స్పెషలైజేషన్‌లు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, బుద్దిస్ట్ స్టడీస్, కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఫైన్‌ఆర్ట్స్, ఫోక్‌లోర్, హిందీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ అండ్ ఏరియా స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్‌మెంట్, మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డా.బీఆర్.అంబేద్కర్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్, సోషియాలజీ, సంస్కృతం, తెలుగు, టూరిజం మేనేజ్‌మెంట్, ఉమన్ స్టడీస్, అప్లయిడ్ లైఫ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బోటనీ, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, జియాలజీ, హోం సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, కంపారిటివ్ ద్రవిడియన్ లిటరేచర్, తుళు, మహాత్మా జ్యోతి రావు ఫూలే స్టడీస్, ఉర్దూ, జియో ఇంజనీరింగ్, మెటియోరాలజీ అండ్ ఫిజికల్ ఓషనోగ్రఫీ.

యూనివర్సిటీలు-సీట్లు

యూనివర్సిటీ	ఫుల్ టైమ్	పార్ట్ టైమ్
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	155	76
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమండ్రి	86	36
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు	43	37
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం	131	70
డా.బీ.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం	15	12
ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం	33	30
జేఎన్‌టీయూ, అనంతపురం	86	298
జేఎన్‌టీయూ, కాకినాడ	-	426
జేఎన్‌టీయూజీ, విజయనగరం	1	14
కృష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం	33	12
రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు	2	3
ఆర్‌జీయూకేటీ, నూజివీడు	5	7
ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ	5	5
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం	45	31
శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, తిరుపతి	69	56
శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి	114	95
విక్రం సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు	31	14
యోగి వేమన యూనివర్సిటీ, కడప	84	27

అర్హత వివరాలు

- కనీసం 55 శాతం మార్కులతో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.
- పీజీ కాలేజీల్లో ఫ్యాకల్టీ/లైబ్రేరియన్/అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు; పాలిటెక్నిక్/ప్రభుత్వ/ప్రైవేట్/అనుబంధ జూనియర్ కాలేజీలు/పాఠశాలల్లో ఫ్యాకల్టీగా కనీసం నాలుగేళ్ల అనుభవం ఉన్నవారు పార్ట్‌టైం పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ ఆర్‌సెట్ 2023-24 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ మెథడాలజీ నుంచి 70 ప్రశ్నలు, రెండో సెక్షన్లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు.

ఇందులో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి.

- ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 60 మార్కులు నిర్దేశించారు.
- టెస్ట్ స్కోర్, ఇంటర్వ్యూ స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ర్యాంక్ లిస్ట్ రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 19
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఏప్రిల్ 4 నుంచి 7 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 10 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** ఏపీలోని అన్ని జిల్లా కేంద్రాలు, హైదరాబాద్
- **ఏపీ ఆర్‌సెట్ నిర్వహణ:** ఏప్రిల్‌లో
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/rcet

టీఎస్ పాలిసెట్

హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్(టీఎస్ పాలిసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ) అందిస్తున్న అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సులు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) అందిస్తున్న హార్టికల్చరల్ డిప్లొమాలు, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్‌ఆర్‌టీవీయూ) అందిస్తున్న యానిమల్ హజ్‌బెండ్రీ అండ్ ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో కూడా ఈ టెస్ట్ ద్వారానే అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి విభాగాన్ని అనుసరించి మూడేళ్లు/రెండేళ్లు ఉంటుంది.

విభాగాలు

మూడేళ్ల డిప్లొమాలు: సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, హోమ్ సైన్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్), సిరామిక్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్

రెండేళ్ల డిప్లొమాలు: అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, యానిమల్ హజ్‌బెండ్రీ, ఫిషరీస్, హార్టికల్చర్

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్‌ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్‌ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్‌ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్‌ఎస్), తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టీఓఎస్‌ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- అగ్రికల్చర్/హార్టికల్చర్/వెటర్నరీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో చేరాలంటే పాఠశాల స్థాయిలో కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

టీఎస్ పాలిసెట్ 2024 వివరాలు

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథ్స్ నుంచి 60 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు. అగ్రికల్చర్/హార్టికల్చర్/వెటర్నరీ డిప్లొమాల్లో చేరాలనుకొనేవారు మాత్రమే బయాలజీ ప్రశ్నలు అటెంప్ట్ చేయాలి. ప్రశ్నలను పదోతరగతి సిలబస్ ఆధారంగా ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు.
- ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే 30 శాతం మార్కులు రావాలి. ఎస్‌బీటీఈటీ డిప్లొమా అభ్యర్థులకు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మార్కులను; అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు మేథ్స్(స్కేలింగ్ డౌన్ టు 30 మార్కులు), ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. అంటే మొత్తం 120 మార్కులకు గాను కనీసం 36 మార్కులు రావాలి.
- టీఎస్ పాలిసెట్‌లో రెండు రకాలుగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఎస్‌బీటీఈటీ పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్న డిప్లొమా ప్రోగ్రామ్‌లలో చేరేవారికి ఎంపీసీ ర్యాంక్; అగ్రికల్చరల్ పాలిటెక్నిక్‌లలో చేరేవారికి ఎంబైపీసీ ర్యాంక్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 22
- **టీఎస్ పాలిసెట్ 2024 తేదీ:** మే 17
- **ఫలితాలు విడుదల:** ఎగ్జామ్ పూర్తయిన పన్నెండు రోజుల తరవాత
- **వెబ్‌సైట్:** www.polycet.sbtet.telangana.gov.in

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈము పక్షిలా ఉండే ఈ పక్షి పేరు సదరెన్ కాసోవరి. ఆస్ట్రిచ్ జాతికి చెందినది.
- టర్కీ కోడిలా ఉంటుంది. హానర్డ్ హెడ్ అని పిలుస్తారు దీని మీద ఉండే కొప్పు లాంటి చర్మాన్ని.
- 170 సెం.మీ పొడవు ఉండే ఈ పక్షి ఎత్తు మాత్రం 1.8 మీటర్లు ఉంటుంది. బరువు 58 కేజీల వరకు ఉంటుంది. ఇవి భూమిమీద 49 వేల పక్షులు మాత్రమే ఉన్నాయి.
- ఆస్ట్రేలియా, ఇండోనేషియా, న్యూ గినియా ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయివి
- ఈ పక్షులు రెయిన్ ఫారెస్టుల్లో ఉండటానికి ఇష్టపడతాయి. అప్పుడప్పుడు సవన్నా గడ్డిభూములు, పండ్లు అధికంగా ఉండే చోటకు కూడా వస్తాయి.




- వీటి కాళ్లు, గోళ్లు బలమైనవి. ముక్కుతో పట్టుకుని కాళ్లతో చీలిస్తే ఏ జంతువు అయినా చచ్చిపోవాల్సిందే. అంత బలిష్ఠమైనది. మెల్లగా నడిచినట్లే ఉంటుంది కానీ గంటకు 50 కి.మీ వేగంతో పరిగెత్తుతుంది.
- వీటి అరుపు గట్టిగా ఉంటుంది. దూరానికి వినపడుతుంది. ఇవి కేవలం 3 లేదా 5 గుడ్లు మాత్రమే పెడతాయి. మగ పక్షులు నేలమీదనే గూడు కడతాయి. రెండు పక్షులు గుడ్లమీద యాభై రోజులు పొదుగుతాయి.
- పిల్లలకు 9 నెలలు వచ్చే వరకూ పెంచుతాయి.
- ప్రపంచంలోనే అతి పెద్ద పక్షిలో రెండో స్థానం. వీటి పంచ్ కరాటే కిక్‌లా ఉంటుంది. కాబట్టి ఇవి డేంజరస్.
- 1517 వ సంవత్సరంలో యూరప్‌లోని రుడాల్ఫ్ అనే చక్రవర్తి ఈ పక్షులను తొలిసారి పెంచాడు.
- మనుషుల్ని సునాయసంగా చంపేస్తాయి.
- వీటి జీవనకాలం 12 ఏళ్లనుంచి 40 ఏళ్లే.

5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 238

		8						3
				5		6	8	
3	1		4			5		
2			5	7				
	9		8		6		3	
				4	2			6
		6			7		5	1
	7	9		3				
1						9		

సుడోకు - 237 సమాధానం

7	1	6	5	8	4	9	2	3
8	2	4	9	3	6	1	7	5
3	9	5	2	1	7	8	4	6
2	5	1	4	9	3	6	8	7
9	4	7	6	5	8	3	1	2
6	3	8	1	7	2	5	9	4
4	6	3	8	2	9	7	5	1
5	7	9	3	4	1	2	6	8
1	8	2	7	6	5	4	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 3000

ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు: 100 (గుంటూరు-40, విజయవాడ-30, విశాఖపట్నం-30)

తెలంగాణలో ఖాళీలు: 90(హైదరాబాద్-58, వరంగల్-38)

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్ శాఖలు రూ.15,000. పట్టణ శాఖలు రూ.15,000. మెట్రో శాఖలు రూ.15,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 1. క్వాంటిటేటివ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్. 2. బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్. 3. బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 4. బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 5. బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.


దరఖాస్తు రుసుము: రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్/మహిళా అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 6

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en

జాబ్ కార్నర్



సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో...

ఖాళీలు 1425

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్‌ఈసీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్(మైనింగ్/ఎలక్ట్రికల్/మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్). డిప్లొమా(మైనింగ్/మైనింగ్, మైన్ సర్వేయింగ్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్)

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

కనిష్ఠ వయోపరిమితి: 18 సంవత్సరాలు

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: www.seclcil.in/index.php

ఆయిల్ ఇండియాలో సూపరింటెండెంట్‌లు

ఖాళీలు 16

అస్సోంలోని ఆయిల్ ఇండియా లిమిటెడ్...కింద పేర్కొన్న గ్రూప్-సి కేడర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సూపరింటెండెంట్ ఇంజనీర్

అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ లేదా పీజీ(పెట్రోలియం ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 11 నాటికి 32 ఏళ్ల మించకూడదు

వేతనం: నెలకు రూ.80,000 - రూ.2,20,000

ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: https://www.oilindia.com

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 490

న్యూఢిల్లీలోని ప్రభుత్వరంగ సంస్థ...ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా...దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్): **3 పోస్టులు**
2. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - సివిల్): **90 పోస్టులు**
3. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్): **106 పోస్టులు**
4. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్): **278 పోస్టులు**
5. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **13 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ 2024 స్కోరు ఉండాలి.

వయోపరిమితి: 2024 మే 1 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2

దరఖాస్తుకు చివరి తేదీ: మే 1

వెబ్‌సైట్: www.aai.aero/

మహీంద్రా లా స్కూల్‌లో వర్క్‌షాప్, కాన్ఫరెన్స్

మహీంద్రా యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ లా ఒక వర్క్‌షాప్, మరో సదస్సు నిర్వహిస్తోంది. 'డేటా గవర్నన్స్ ఇన్ ద ఏజ్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'పై ఈ నెల 29న వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. అదే విధంగా 'రివల్యూషనరీ టెక్నాలజీస్ అండ్ ఎవల్యూషనరీ లాస్: చాలెంజెస్ అండ్ ఆపర్చ్యూనిటీస్'పై అంతర్జాతీయ సదస్సును మార్చి 1, 2 తేదీల్లో జరుపుతోంది. దీనికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులు హాజరవుతున్నారు. అటు లా ఇటు సాంకేతికతకు మధ్య వారధిగా ఉండటానికి తోడు సమాజం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను ఈ సదస్సులో చర్చించనున్నారు. వీటికి సంబంధించి మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్: https://www.mahindrauniversity.edu.in/one-day-international-conference-on-revolutionary-technologies-and-evoloutionary-laws-challenges-and-opportunities/

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్పీ - పీజీ డిప్లొమాలు

ప్రసిద్ధ సాంకేతిక విద్యా సంస్థ - బిట్స్ పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్పీ) విభాగం మూడు సరికొత్త పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను ప్రకటించింది. కెరీర్‌కు ఎలాంటి బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సులను చేసే అవకాశాన్ని బిట్స్ కల్పిస్తోంది. మార్చి 18లోపు వీటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ స్మార్ట్ మొబిలిటీ:** స్మార్ట్ మొబిలిటీ కాన్సెప్టులు, టెక్నాలజీలు, పాలసీలపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని మలిచారు. మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-smart-mobility.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్:** ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, ఈవీ రెగ్యులేషన్స్ తదితరాలను కలుపుతూ ఈ ప్రోగ్రామ్‌ని తీర్చిదిద్దారు మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-electric-vehicles.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీ:** సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగించే విధంగా ఈ కోర్సును మలిచారు. మరిన్ని వివరాలకు- https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-automotive-cybersecurity.php